www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 18-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 349 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా.10.10 తదుపరి పంచమి; నక్షత్రం: స్వాతి సా.5.52 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.12.09-1.57, అమృతఘడియలు: ఉ.7.56-9.44, దుర్ముహూర్తం: ఉ.8.47-9.35, రా.10.18-11.05, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 6.22 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కొత్త మద్యం బ్రాండ్లు వస్తున్నాయ్

రాష్ట్రంలో బీర్, లిక్కర్ అమ్మేందుకు 40 కంపెనీల అర్జీ

దరఖాస్తు చేసుకున్న వాటిలో సగం విదేశీ బ్రాండ్లు

విచారణ తర్వాత అనుమతి

ఏప్రిల్ నుంచి విక్రయం



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. తెలంగాణలో బీర్లు, లిక్కర్ అమ్మేందుకు కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(టీజీబీసీఎల్) ఇచ్చిన నోటిఫికేషన్‌కు దాదాపు 40 వరకు దరఖాస్తులు వచ్చాయి. అందులో 20దాకా విదేశీ లిక్కర్ బ్రాండ్లు కాగా.. మిగిలిన 20 స్వదేశీ బ్రాండ్లలో పది

మిగతా 3వ పేజీలో...

బీసీ బిల్లులో ఏముందంటే..

స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లను ఎందుకు పెంచాలనుకుంటున్నది, అందుకు గల కారణాలన్నింటినీ బిల్లులో సర్కారు తెలిపింది. సమగ్ర వివరాల పరిశీలన, రిజర్వేషన్ల పెంపునకు చేయాల్సిన అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్లు చేసిన సిఫారసులను కూడా ప్రస్తావించింది. స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం అమలవుతున్న 29% రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బిల్లులో స్పష్టం చేసింది. కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు తదితర పదవులన్నిటిలోనూ బీసీలకు 42 శాతం కోటా ఉండాలని పొందుపర్చింది.

'ఎస్సీ' బిల్లులో ఏముందంటే..

ఈ బిల్లులో ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను ప్రభుత్వం పేర్కొంది. వర్గీకరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు గురించి ప్రస్తావించింది. ఎస్సీలను 3 గ్రూపులుగా విభజించాలని, ఆ మూడు గ్రూపుల్లోని 59 కులాలకు 15% రిజర్వేషన్ కేటాయించాలని కమిషన్ నివేదిక ఇచ్చినట్లు పేర్కొంది.

బీసీ బిల్లులకు జై!

వెనకబడిన వర్గాల కోటా 29 నుంచి 42 శాతానికి

సర్పంచ్ నుంచి మేయర్ దాకా.. విద్య, ఉద్యోగాల్లోనూ

రెండు బీసీ బిల్లులకు శాసనసభ ఆమోదం

నేడు మండలికి.. ఆమోదం తర్వాత గవర్నర్‌కు

ఆయన పరిశీలించి రాష్ట్రపతికి పంపిస్తారు

పార్లమెంటులో 2/3 మెజారిటీతో ఆమోదం తప్పనిసరి

రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెడితేనే చట్టబద్ధత

రిజర్వేషన్ల తేనెతుట్టెను కేంద్రం కదుపుతుందా!?

అసెంబ్లీకి చేరిన ఎస్సీ వర్గీకరణ

బిల్లును సభలో ప్రవేశపెట్టిన మంత్రి దామోదర

నేడు చర్చ.. ఆమోదించే అవకాశం

కలిసికట్టుగా వెళ్లి ప్రధానిని కలుద్దాం

42% రిజర్వేషన్ సాధనకు నేను నాయకత్వం వహిస్తా

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ మాతో కలిసి రావాలి

ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యత బీజేపీదే

ఈ పార్లమెంట్ సెషన్‌లోనే ఆమోదం పొందేలా చేద్దాం

రిజర్వేషన్ సాధించే వరకూ విశ్రమించేది లేదు: సీఎం



రాజీవ్ యువ వికాసం కార్యక్రమ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్, ఎమ్మెల్యేలు కూనంనేని, అక్బరుద్దీన్

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. దాంతో, మంగళవారం వాటిని శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. అనంతరం వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపనుంది. ఆయన వాటిని పరిశీలించి.. రాష్ట్రపతికి పంపనున్నారు. తొలుత.. 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025', 'తెలంగాణ బీసీ (స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025'ను మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు 29 శాతం. వాటిని 42 శాతానికి పెంచుతూ ఆమోదించిన బిల్లు చట్ట రూపం దాల్చాలంటే.. పార్లమెంటులో 2/3 మెజారిటీతో వాటికి ఆమోదం పొందాల్సి ఉంది. ఇందుకు కారణం.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలందరికీ అమలు చేసే రిజర్వేషన్లన్నీ కలిపి 50 శాతాన్ని మించకూడదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఒకవేళ.. రిజర్వేషన్లను పెంచితే వాటిని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చాల్సి

మిగతా 13వ పేజీలో...

బీసీ బిల్లులపై వాడీవేడి చర్చ

మూడు సవరణలు చేర్చాలన్న హరీశ్‌రావు

కేంద్రానికి పంపే బిల్లుల్లో సవరణలు వద్దన్న మంత్రి పొన్నం ప్రభాకర్

మొండికేయవద్దని బీఆర్ఎస్ హితవు

బిల్లులకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ

13

మంత్రులను తీసేస్తేనే పట్టున్నట్లా?

10

పారదర్శక పాలన అందిస్తేనే పట్టువచ్చినట్లు

కులగణన వల్లే బడుగులకు ఎమ్మెల్సీ సీట్లు

రాజీవ్ యువవికాసంతో యువతకు ఉపాధి

జూన్ 2న 5లక్షల మంది లబ్ధిదార్ల జాబితా

పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు

పాలనా సౌలభ్యం కోసమే!

2 రాష్ట్రాల్లో ఒకే పేరుతో ఉంటే ఇబ్బందులు

నిజాంపై పోరాడిన సురవరం పేరు పెట్టాం

చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు

కేంద్ర మంత్రులిద్దరూ అనుమతులు తేవాలి

వర్సిటీ పేరు మార్పుపై సభలో సీఎం

12



14

యూజీసీ నిబంధనలపై రాష్ట్ర సర్కారు వ్యాజ్యం

డీమ్డ్ వర్సిటీల్లో మా పాత్ర లేకుండా చేశారు

వాటిని మూసేస్తే ఎవరిది బాధ్యత?

విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు జవాబుదారీ?

పిటిషన్‌లో ప్రశ్నించిన రాష్ట్ర ప్రభుత్వం

కేంద్రానికి, యూజీసీకి హైకోర్టు నోటీసులు



కుటుంబ సభ్యులతో రోహిత్ రెడ్డి (ఫైల్)

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

3

తెలంగాణకు చెందిన ముగ్గురి మృతి

భార్య, ఇద్దరు కొడుకులు, తల్లితో కలిసి కారులో వెళ్తున్న టెకీ.. దారిలో ప్రమాదం

భార్య, కొడుకు, తల్లి అక్కడికక్కడే మృతి

స్వల్ప గాయాలతో బయటపడ్డ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోహిత్ రెడ్డి, మరో కుమారుడు

వారి స్వగ్రామం టేకులపల్లిలో విషాదం

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ పద్ధతి

ఈ విధానంతో 10-15 నిమిషాల్లోనే పూర్తి కానున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఏప్రిల్‌లో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్ట్ షురూ

నిషేధిత జాబితాలోని గజం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

14



అఖిలపక్ష భేటీలో డిప్యూటీ సీఎం భట్టి, జానారెడ్డి, కూనంనేని, కే కేశవరావు

కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది పాత్ర

అనివార్యం కావాలి

ఆ దిశగా నియోజకవర్గాల పునర్విభజన ఉండాలి

దీనిపై ఎలా ముందుకెళ్లాలో అభిప్రాయాలు చెప్పండి

అఖిలపక్ష సమావేశంలో భట్టి

కొంతకాలం ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి: జానారెడ్డి

అఖిలపక్ష కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా ఆచరిస్తాం: నేతలు

భేటీకి బీఆర్ఎస్, బీజేపీ గైర్హాజరు

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యమయ్యేలా పార్లమెంటు నియోజకవర్గాల విభజన ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతున్నాయని, ప్రధానంగా తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. దీనిపై ఎలా ముందుకు వెళ్లాలో అభిప్రాయాలు అఖిలపక్ష నాయకులు చెప్పాలని కోరారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలోని కమిటీ హాల్‌లో

మిగతా 12వ పేజీలో...

రేవంత్ గోడలు దూకేది

మాకు తెల్వదా?

సాగర్ సొసైటీలో ఎంత సేపు ఉండేవాడో తెలుసు

సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రైవేట్ కార్ల వివరాలూ చెప్తాం

ఎక్కువ మాట్లాడితే ఫొటోలు కూడా బయటపెడతాం

మేము మొదలుపెడితే రేవంత్‌రెడ్డి బయట తిరగలేరు

తెలంగాణ పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది

ఆత్మహత్యలతో తల్లడిల్లుతుంటే.. అందాల పోటీలా?

కాంగ్రెస్ సర్కార్ అట్టర్‌ఫ్లాప్.. చిట్‌చాట్‌లో కేటీఆర్



హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): "మేమూ రేవంత్‌రెడ్డి లెక్కనే మాట్లాడితే బయట తిరగలేడు. రేవంత్ రెడ్డి ఎక్కడెక్కడ గోడలు దూకుతాడో మాకు తెలవదా? సాగర్ సొసైటీలో ఎంత సమయం గడిపేవాడో తెలుసు. సాగర్ సొసైటీ, మైహోం భూజా వ్యవహారాల గురించి మాట్లాడగలం. ఆయన ఎక్కువ మాట్లాడితే ఫొటోలు కూడా బయట పెడతాం. రేవంత్ సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రైవేట్ కార్ల వివరాలూ చెప్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి దూకిన గోడలు, హైదరాబాద్‌లో దాటిన

మిగతా 12వ పేజీలో...



పరిహారం కోసం కట్టిన ఇళ్లు ఇవే

ఇల్లు కట్టు.. పరిహారం కొట్టు

భూపాలపల్లి ఓసీపీ-3 విస్తరణకు భూ సేకరణ

ప్రభావిత పల్లె కొండంపల్లిపై అక్రమార్కుల కన్ను

కొత్తగా ఇళ్ల నిర్మాణం.. పరిహారంగా రూ.లక్షలు కొట్టేసే ప్లాన్

కేటుగాళ్లకు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు

గుడి, బడి స్థలాలకూ ఛోటా నేతల ఎసరు.. 'ఆంధ్రజ్యోతి' పరిశీలన

భూపాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ అక్రమార్కులకు వరంగా మారింది. కోల్‌బెల్ట్‌లో గనుల కోసం ఎక్కడ భూ సేకరణ జరిగినా.. కేటుగాళ్లు వాలిపోతున్నారు. రాత్రికి రాత్రే తాత్కాలికంగా ఇళ్లు కట్టి.. వాటిని శాశ్వత గృహాలుగా చూపి.. రూ.లక్షలు పరిహారం కొట్టేసేందుకు పథకం వేస్తున్నారు. సింగరేణి ప్రాంతంలో కొంత కాలంగా ఇది పరిపాటిగా మారింది. ఆసిఫాబాద్ జిల్లాలోని గోలేటి మొదలుకొని మందమర్రి, బెల్లంపల్లి, రామగుండం, వంటి ప్రాంతాల్లో ఈ తరహాలో పరిహారాన్ని కొట్టేసిన అక్రమార్కులు.. తాజాగా భూపాలపల్లి జిల్లా

మిగతా 3వ పేజీలో...



వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల సహా

11 మంది యూట్యూబర్లపై కేసు

బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేసినందుకే..

నిందితుల్లో సెలబ్రిటీలు, టీవీ నటులు

త్వరలో నోటీసులు.. అరెస్టుకు అవకాశం

పంజాగుట్ట/హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కలర్ ప్రిడిక్షన్.. నంబర్ ప్రిడిక్షన్.. క్రికెట్.. ఇలా చైనా కేంద్రంగా పనిచేస్తున్న పలు బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడి.. భారతీయులు రూ.కోట్లు పోగొట్టుకుంటున్నారు. "తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం" అంటూ ఇలాంటి యాప్స్‌పై ఊదరగొడుతూ ప్రచారం చేస్తున్న 11 మంది యూట్యూబర్లు, ఇన్‌స్టా యూజర్లపై పంజాగుట్ట పోలీసులు కొరడా

మిగతా 2వ పేజీలో...

టన్నుల్లో స్మగ్లింగ్..

గ్రాముల్లో పట్టివేత

యథేచ్ఛగా దుబాయ్ నుంచి అక్రమ రవాణా

ఏటా 300 టన్నుల అక్రమ బంగారం..!!

స్మగ్లర్లకు కస్టమ్స్‌లో ఇంటి దొంగల సహకారం

ఒక్క అధికారి సహకరించినా స్మగ్లర్లకు పండగే

ఈ కేసుల్లో మూలాలకు వెళ్లని దర్యాప్తు సంస్థలు

శంషాబాద్‌లో.. రన్యారావులెందరో..!

బంగారం స్మగ్లింగ్‌లో మహిళలదే కీలక పాత్ర



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'బెంగళూరు కెంపెగౌడ విమానాశ్రయంలో కన్నడ నటి రన్యారావు అరెస్టు.. రూ.12 కోట్ల విలువైన 14.8 కిలోల బంగారం సీజ్..' 'శంషాబాద్ విమానాశ్రయంలో మలద్వారంలో 3 కిలోల బంగారం గుర్తింపు.. ఒకరి అరెస్టు'.. 'మిక్సర్-గ్రైండర్ మోటార్‌లో మూడు కిలోల బంగారంతో వైండింగ్.. ఇద్దరు మహిళల అరెస్టు'.. 'పౌడర్/పేస్ట్ రూపంలో బంగారం.. 7 కిలోలు సీజ్.. ముగ్గురికి బేడీలు'.. పత్రికల్లో ఇలాంటి వార్తలు నిత్యకృత్యమయ్యాయి..! కేరళలో ఏకంగా సీఎం పినరయి విజయన్‌ను వణికించిన స్వప్న సురేశ్ కేసులోనూ బంగారం అక్రమ రవాణా కోణం ఉన్న విషయం తెలిసిందే..! గోల్డ్ స్మగ్లింగ్‌కు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని 15% నుంచి 6శాతానికి తగ్గించినా.. అక్రమ రవాణా ఎందుకు ఆగడం లేదు? అంతర్జాతీయ విమానాశ్రయాల్లో బంగారం జాడను ఇట్టే పసిగట్టే యంత్రాలున్నా.. అధికారులు స్మగ్లింగ్‌ను పూర్తిస్థాయిలో ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు? గోల్డ్ స్మగ్లర్లతో

మిగతా 14వ పేజీలో...



కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు!

ఏప్రిల్‌లో బాధ్యతల స్వీకారం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావును నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. 1989 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత సీఎస్ శాంతికుమారి 2021 జనవరి నుంచి సీఎస్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె పదవీ కాలం వచ్చే నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే తదుపరి సీఎస్‌గా రామకృష్ణారావు పేరును ప్రభుత్వం ఖరారు చేసినట్లు సమాచారం. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2016 ఫిబ్రవరి నుంచి ఆర్థిక శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టుతో ముగియనుంది.

పెళ్లయిన నెల నుంచే విడిగా ఉంటున్నాం

- కోర్టుకు తెలిపిన రన్యా రావు భర్త జతిన్
- అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థన



బెంగళూరు, మార్చి 17: గత ఏడాది నవంబరులో తాము వివాహం చేసుకున్నామని, కానీ కొన్ని కారణాల వల్ల డిసెంబరు నెల నుంచే విడివిడిగా ఉంటున్నామని కన్నడ నటి రన్యా రావు భర్త జతిన్ హుక్కేరి కోర్టుకు తెలిపారు. రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో తనకు అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. వారిద్దరూ అనధికారికంగానే విడివిడిగా ఉంటున్నారని హుక్కేరి తరఫు న్యాయవాది ప్రభులింగ్ నవదాగి కోర్టులో వెల్లడించారు. ఈ పిటిషన్‌పై ఈనెల 24న తమ అభ్యంతరాలను వెల్లడిస్తామని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) తరఫు న్యాయవాది మధు రావు కోర్టుకు తెలిపారు. అయితే తదుపరి విచారణ వరకు హుక్కేరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గత మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ ఆదేశాలు 24వ తేదీ వర కు అమలులో ఉండనున్నాయి. కాగా, రన్యా రావు శరీరం అంతా బం గారం చుట్టుకుని వచ్చిందని, ఆమెకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నా యో ఆ సమాచారం మొత్తం సేకరించానని బీజేపీ బీజాపూర్ సిటీ ఎమ్మె ల్యే బసన్ గౌడ పాటిల్ యత్నాల్ విలేకరుల సమావేశంలో చెప్పారు.

హాల్‌నే బురిడీ కొట్టించి.. 55 లక్షలు కాజేసి..

- ఫేక్ ఈమెయిల్‌తో అరకోటి కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

న్యూఢిల్లీ, మార్చి 17: సైబర్ నేరగాళ్లు సాధారణ ప్రజలతోపాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను కూడా బురిడీ కొట్టిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలు సైతం సైబర్ వలకు చిక్కి కోట్లు పోగొట్టుకుంటున్నాయి. తాజాగా భారత ప్రభుత్వ రంగ సంస్థ, యుద్ధ విమానాలు తయారు చేసే హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)ను కూడా సైబర్ నేరగాళ్లు ఫేక్ ఈమెయిల్ ఐడీతో మోసం చేసి రూ.55 లక్షలు కొల్లగొట్టారు. ఈ నెల 13న కాన్పూర్‌కు చెందిన హాల్ అడిషనల్ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. "గత ఏడాది మేలో హాల్.. మూడు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అవసరమైన కొన్ని విడిభాగాల కోసం అమెరికాకు చెందిన 'పీఎస్ ఇంజనీరింగ్ ఇన్‌కార్పొరేటెడ్' అనే కంపెనీ నుంచి కొటేషన్ కోరింది. దీనిపై ఆ సంస్థ కూడా ఈమెయిల్ ద్వారా స్పందించింది. ఇలా మెయిల్స్ ద్వారా చర్చలు నడుస్తున్న క్రమంలో మధ్యలో సరైన ఈమెయిల్ స్థానంలో నకిలీ ఈమెయిల్ ఒకటి వచ్చింది. ఈ రెండు మెయిల్ ఐడీలకు మధ్య 'ఈ' అనే అక్షరం ఒక్కటే తేడా కావడంతో హాల్ అధికారులు దీన్ని గుర్తించలేకపోయారు. ఫేక్ ఈమెయిల్ నుంచి సూచించిన ఖాతాకు సుమారు రూ.55 లక్షలు (63వేల డాలర్లు) చెల్లించారు. అయితే తమకు డబ్బులు అందలేదని పీఎస్ ఇంజనీరింగ్ ఇన్‌కార్పొరేటెడ్ సంస్థ చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాం" అని అశోక్ కుమార్ సింగ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే అమెరికాకు చెందిన మరో కంపెనీ హాల్‌ను మోసం చేసిందా.. లేదా ఇది భారత్‌లోని సైబర్ నేరగాళ్ల పనా అన్నది స్పష్టం కాలేదని పోలీసులు తెలిపారు.

బట్టతలపై హేళన.. ఉరేసుకున్న భర్త

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులకు మరో భర్త బలైపోయాడు. ఇప్పటికే భార్యల వేధింపుల వల్ల ఇద్దరు ముగ్గురు ఐటీ ప్రొఫెషనల్స్ వంటి ఉన్నత స్థాయిలో ఉన్న భర్తలు బలైపోయిన ఘటనలు వెలుగుచూడగా, తాజాగా.. బట్ట తల ఉందని భార్య హేళన చేయడం, సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టడంతో పరశివమూర్తి (30) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. కర్ణాటకలోని చామరాజనగర తాలూకా ఉడిగాల గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఆత్మహత్యకు ముందు పరశివమూర్తి సూసైడ్ నోట్ రాశారు.

రేపు ఈపాటికి భూమికి సునీతా విలియమ్స్!



వాషింగ్టన్, మార్చి 17: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో దాదాపు తొమ్మిది నెలల పాటు చిక్కుకున్న భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ బుధవారం తిరిగి భూమి మీదకు రానున్నారు. ఆమెతో పాటు సహచర వ్యోమగామి బచ్ విల్మోర్ కూడా రానున్నారు. అమెరికాలోని ఫ్లోరిడా కాలమానం ప్రకారం సాయంత్రం 5.57 గంటలకు (భారత కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున 3.37 గంటలకు) వారు ప్రయాణించే క్యాప్సూల్ ఫ్లోరిడా సమీపంలోని సముద్రంలో దిగనుంది. అక్కడి నుంచి ఒక్కొక్కరిని బయటకు తీసుకువస్తారు. వారిని తీసుకురావడానికి వెళ్లిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఆదివారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైంది. దీంట్లో వెళ్లిన నలుగురు వ్యోమగాములు అక్కడి బాధ్యతలను స్వీకరించారు. సునీత, విల్మోర్‌లతో పాటు నాసా వ్యోమగామి నిక్ హ్యాగ్, రష్యా వ్యోమగామి అలెక్సాండర్ గర్బునవ్ కూడా క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో తిరిగి రానున్నారు. వారు కిందకు దిగే కార్యక్రమాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. క్రూ డ్రాగన్ వ్యోమనౌక ప్రయాణ సన్నాహాలు సోమవారం రాత్రే మొదలయ్యాయి. అమెరికా కాలమానం ప్రకారం రాత్రి 10.45 గంటలకు వ్యోమనౌక హ్యాచ్ మూసివేత ప్రక్రియ మొదలవుతుంది. అర్ధరాత్రి 12.45 గంటలకు అన్‌డాకింగ్ ఆరంభవుతుంది. స్పేస్‌షిప్ విడిపోయిన తరువాత మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు తిరుగు ప్రయాణం మొదలవుతుంది. 5.51 గంటలకు భూమి కక్ష్యను దాటుకొని వస్తుంది. సాయంత్రం 5.57 గంటలకు ఫ్లోరిడా సముద్ర జలాల్లో దిగుతుంది. గత ఏడాది జూన్ 5న ప్రయోగించిన స్టార్‌లైనర్ వ్యోమనౌక ద్వారా సునీత, విల్మోర్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఎనిమిది రోజులు ఉండాలన్నది అసలు ప్రణాళిక. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారిని తిరిగి తీసుకురాకుండానే భూమికి వచ్చింది. దాంతో వారు ఇంతకాలం అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోవాల్సి వచ్చింది.

పదేళ్లలో రూ.16.35 లక్షల కోట్లు

బ్యాంకులు రైటాఫ్ చేసిన మొత్తమిది

- లోక్‌సభలో నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 17: గత పది ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు రూ.16.35 లక్షల కోట్ల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) లేదా మొండి బాకీలను బ్యాంకులు రైటాఫ్ చేసినట్టు కేంద్ర ప్రభుత్వం సోమవారం పార్లమెంట్‌కు తెలియజేసింది. ఇందులో అత్యధికంగా రూ.2,36,265 కోట్లను 2018-19 సంవత్సరంలో.. అత్యల్పంగా రూ.58,786 కోట్లను 2014-15 సంవత్సరంలో రైటాఫ్ చేసినట్టు పేర్కొంది. 2023-24లో రూ.1,70,270 కోట్లు, అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో రూ.2,16,324 కోట్లను బ్యాంకులు రైటాఫ్ చేసినట్టు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మార్గదర్శకాలు, బ్యాంకుల బోర్డులు ఆమోదించిన విధానం ప్రకారం బ్యాంకులు మొండి పద్దులను రైటాఫ్ చేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి రైటాఫ్‌ల వల్ల రుణగ్రహీతల రుణాలు మాఫీ కావు కాబట్టి వారికి ప్రయోజనం కలగదని తెలిపారు. బ్యాంకులు వాటికి అందుబాటులో ఉన్న వివిధ రికవరీ యంత్రాంగాల ద్వారా రుణగ్రహీతలపై రికవరీ చర్యలు చేపడతాయని చెప్పారు. సివిల్ కోర్టులు లేదా డెట్ రికవరీ ట్రిబ్యునళ్ల వంటి వాటిలో దావా వేయడంతోపాటు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడం, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసులను దాఖలు చేయడం వంటివి చేస్తాయన్నారు. ఆర్బీఐ గణాంకాల ప్రకారం.. 2024 డిసెంబరు 31 వరకు షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఎన్‌పీఏలుగా వర్గీకరించిన 20 ప్రత్యేక రుణగ్రహీత కంపెనీలున్నాయని, వాటిలో ప్రతి ఒక్కటి రూ.1,000 కోట్లు అంతకుమించి బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ ఖాతాల మొత్తం బకాయిలు రూ.61,027 కోట్లుగా ఉన్నట్టు తెలిపారు. రుణగ్రహీతలు బకాయి పడిన మొత్తాన్ని రికవరీ చేయడానికి బ్యాంకులు కాల్స్ చేయడంతోపాటు ఈమెయిల్స్/లేఖలు పంపుతాయని పేర్కొన్నారు. డిఫాల్ట్ మొత్తాన్ని బట్టి కార్పొరేట్ రుణగ్రహీతల విషయంలో కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించడానికి గాను బ్యాంకులు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. రుణ ఖాతాను ఎన్‌పీఏగా వర్గీకరించిన సందర్భంలో తమ బ్యాంకు బోర్డు ఆమోదం తెలిపిన విధానం ప్రకారం బ్యాంకులు రికవరీ చర్యలకు ఉపక్రమిస్తాయని చెప్పారు. కాగా ఎనిమిదో వేతన సంఘం (సీపీసీ) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మరో ప్రశ్నకు సమాధానంగా నిర్మలా సీతారామన్ తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి మొబైల్ యాప్

ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 17: యువతకు పారిశ్రామిక నైపుణ్యాన్ని అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకంలో మరిన్ని కంపెనీలు చేరాలని పిలుపునిచ్చారు. అలాగే యువతను ఇందులో చేరేలా ప్రోత్సహించాలని ఎంపీలకు సూచించారు. పరిశ్రమల అంచనాలు, అవసరాల పరంగా సిబ్బంది కొరత ఉందని.. ఆ అంతరాలను తగ్గించడమే ఈ పథకం లక్ష్యమని చెప్పారు. కేంద్రమంత్రి హర్ష్ మల్హోత్ర మాట్లాడుతూ.. గతేడాది అక్టోబరు 3న ప్రారంభమైన ఈ పథకం పైలట్ ప్రాజెక్టు కింద తొలి విడతలో 1.27 లక్షల మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు దక్కాయన్నారు. రెండో విడతలో 1.18 లక్షల మందికి రెండో విడతలో అవకాశాలు లభించాయని వివరించారు. కాగా, ఈ పథకం కింద నెలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున 12 నెలల పాటు ఆర్థిక సాయంతో పాటు రూ.6 వేల గ్రాంట్ లభిస్తుంది.

లోకం తీరు



సహకారంతోనే ఎదుగుతాం

- మోదీ వ్యాఖ్యలకు చైనా సానుకూలత
- మాది రెండువేల ఏళ్ల బంధమని వ్యాఖ్య

బీజింగ్, మార్చి 17: ఇరుదేశాల మధ్య సంబంధాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను చైనా స్వాగతించింది. పరస్పర సహకారంతోనే ఉభయపక్షాలు ఎదుగుతాయని అభిప్రాయపడింది. 'డ్రాగన్, ఐరావతం కలిసి పాడాల్సిన గీతమిదే.' అంటూ వ్యాఖ్యానించింది. భారత్-చైనా సరిహద్దుల్లో సైనిక ఉద్రిక్తతలు తలెత్తిన గత మూడేళ్ల కాలంలో భారత్, చైనా తొలిసారి బాహాటంగా పరస్పరం సానుకూలతను ప్రకటించాయి. ఇటీవల తాను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో జరిపిన చర్చల తర్వాత సరిహద్దుల్లో సాధారణ స్థితి నెలకొందని అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రీడ్‌మన్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మోదీ చెప్పారు. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. 'రెండు వేల సంవత్సరాలకు పైగా భారత్, చైనాలు స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉన్నాయి. మానవ నాగరికతా విజయాలకు, వికాసానికి పరస్పరం తోడ్పడ్డాయి.' అని మావో నింగ్ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో చేరిన మోదీ

న్యూఢిల్లీ, మార్చి 17: సామాజిక మాధ్యమం వేదిక అయిన 'ట్రూత్ సోషల్'లో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఖాతా తెరిచారు. ఈ వేదికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధ్వర్యంలోని ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ నిర్వహిస్తోంది. లెక్స్ ఫ్రీడ్‌మ్యాన్‌తో మోదీ పాల్గొన్న పాడ్‌కాస్ట్‌ను ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దాంతో మోదీ కూడా ట్రూత్ సోషల్‌లో చేరారు. అర్థవంతమైన సంభాషణల కోసం ఎదురు చూస్తున్నానంటూ పోస్టు పెట్టారు. పాడ్‌కాస్ట్‌ను షేర్ చేసినందుకు 'థ్యాంక్యూ మై ఫ్రెండ్ ప్రెసిడెంట్ ట్రంప్' అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీతో తులసి గబ్బార్డ్ భేటీ

ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీపై చర్చ.. తులసికి త్రివేణి సంగమ జలం ఇచ్చిన మోదీ

- ప్రధానికి రుద్రాక్ష మాల బహూకరించిన గబ్బార్డ్

న్యూఢిల్లీ, మార్చి 17: భారత పర్యటనలో ఉన్న యూఎస్ ఇంటలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీ ఆమెకు ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా త్రివేణి సంగమ జలం ఇచ్చారు. ప్రతిగా ఆమె మోదీకి రుద్రాక్ష మాల బహూకరించారు. రెండు నెలల సమయంలో వీరిద్దరూ సమావేశం కావడం ఇది రెండోసారి. ఇటీవల మోదీ అమెరికాలో పర్యటించినప్పుడు తులసితో సమావేశమయ్యారు. అంతకు ముందు ఆమె రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. భారత వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న నిషేధిత ఖలిస్థానీ సంస్థ సిఖ్ ఫర్ జస్టిస్‌పై చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ ఆమెను కోరారు. రక్షణ రంగం, నిఘా సమాచార పంపిణీపై కూడా సమావేశంలో చర్చించారు. అంతకు ముందు ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తులసి గబ్బార్డ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మైనార్టీల ఊచకోతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు అమెరికా యత్నిస్తోందని చెప్పారు. క్లిష్ట సమయాల్లో తనకు భగవద్గీతలోని శ్రీకృష్ణుడి బోధనలు మార్గదర్శకంగా నిలిచాయని ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. 3 రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చిన ఆమె నిన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన ప్రపంచ నిఘా విభాగాధిపతుల సదస్సులో పాల్గొన్నారు.



మోదీకి రుద్రాక్ష మాల బహూకరిస్తున్న గబ్బార్డ్

అనుమతి లేకుండా మహిళల ఫొటోల వినియోగం ఆందోళనకరం

- కేంద్రం, తెలంగాణ సహా 4 రాష్ట్రాలకు బాంబే హైకోర్టు నోటీసులు

ముంబై, మార్చి 17: ఎలాంటి అనుమతి తీసుకోకుండా మహిళల ఫొటోలను ప్రకటనల్లో ఉపయోగించడం చట్టవ్యతిరేకమని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. వాటిని ప్రభుత్వ ప్రకటనల్లో ఉపయోగించినా అది 'వాణిజ్యపర దోపిడీ' కిందకే వస్తుందని తెలిపింది. ఎలాంటి అంగీకారం తీసుకోకుండానే తన ఫొటోను ప్రభుత్వ ప్రకటనల్లో ఉపయోగించారని పేర్కొంటూ నమ్రత అంకుశ్ కవాలే అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జి.ఎస్.కులకర్ణి, జస్టిస్ అద్వైత్ సేత్నాల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సమాధానం చెప్పాలంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసా రాష్ట్రాల ప్రభుత్వాలు, కాంగ్రెస్ పార్టీ, అమెరికాకు చెందిన షట్టర్‌స్టాక్ వెబ్‌సైట్, టోటల్ డెంటల్ కేర్ ప్రైవేటు లిమిటెడ్, సంబంధిత ఫొటోగ్రాఫర్, ఇతరులకు నోటీసులు పంపించింది. ఈ నెల 24లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నమ్రత కవాలే గ్రామానికే చెందిన తుకారాం కార్వే అనే ఫొటోగ్రాఫర్ ఆమె ఫొటో తీశాడు. ఆమె నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే షట్టర్‌స్టాక్ వెబ్‌సైట్‌లో పెట్టాడు. ఈ వెబ్‌సైట్ నుంచి ఎవరైనా ఫొటోలు కొనుక్కొని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. దాంతో ఆమె ఫొటోను ఉపయోగించుకొని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు విడుదల చేయడంతో పాటు, హోర్డింగ్‌లు కూడా పెట్టాయి. తన అనుమతి లేకుండానే ఫొటోలను ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఇకపై తన ఫొటోను ఉపయోగించకూడదంటూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పుతిన్‌తో ట్రంప్ చర్చలు నేడే

అమెరికా, రష్యా వెల్లడి

- ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలికే అవకాశం





వాషింగ్టన్, మార్చి 17: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం మరోసారి చర్చలు జరపనున్నారు. ఈ విషయాన్ని అటు రష్యా, ఇటు అమెరికా కూడా ధ్రువీకరించాయి. ఇప్పటికే ఒకసారి ట్రంప్.. రష్యా అధినేతతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అయితే.. అప్పట్లో అసంపూర్తిగా చర్చలు ముగిశాయి. దీంతో తాజాగా మరోసారి పుతిన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యారు. అయితే.. యుద్ధం ముగింపునకు సంబంధించి తమకు బలమైన హామీలు ఇవ్వాలని రష్యా డిమాండ్ చేస్తోంది. నాటో సభ్యత్వం నుంచి ఉక్రెయిన్‌ను మినహాయించాలని పట్టుబడుతోంది. అంతేకాదు, ఉక్రెయిన్ తటస్థంగా ఉండాలని కోరుతోంది. వాస్తవానికి అమెరికా ఇరు దేశాలకు 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించింది. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. కానీ, రష్యా అధినేత పుతిన్ మాత్రం.. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి విరామం ఇచ్చేముందు కీలకమైన షరతులను నెరవేర్చాల్సి ఉందని పేర్కొన్నారు.

ప్రతీకార సుంకాలపై తగ్గేదే లేదన్న ట్రంప్

రంగాలవారీ టారిఫ్‌లతోపాటు ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఏప్రిల్ 2 నుంచి అమలు చేయనున్న ప్రతీకార సుంకాలపై అమెరికా వాణిజ్య భాగస్వాములకు మినహాయింపు ఇచ్చే ఉద్దేశం ఏమీ లేదని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రతీకార సుంకాల నుంచి ఏ దేశానికీ మినహాయింపు ఇచ్చే ఉద్దేశం తనకు లేదని పదే పదే చెబుతున్న ట్రంప్ తాజాగా ఆదివారం కూడా అదే విషయాన్ని స్పష్టం చేశారు. మరోవైపు.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పదవీకాలం చివరలో ప్రసాదించిన క్షమాభిక్షలు చెల్లవని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆటో పెన్ ద్వారా సంతకం చేసిన ఆ క్షమాభిక్షలన్నీ బైడెన్ పూర్తి అవగాహన లేకుండా ఆమోదించినవని ట్రంప్ తేల్చిచెప్పారు. అందువల్ల ఆ క్షమాభిక్షలు జారీ చేసిన అధికారులు నేరానికి పాల్పడినట్లేనన్నారు. ప్రత్యేకించి జనవరి 6న క్యాపిటల్ భవనంపై దాడి ఘటనను దర్యాప్తు చేసిన హౌస్ కమిటీ సభ్యులకు మంజూరు చేసిన క్షమాభిక్షల చట్టబద్ధతను 'ట్రూత్ సోషల్' పోస్టులో ట్రంప్ తోసిపుచ్చారు. 'నిద్రమత్తులో జో బైడెన్ ఎంపిక కానటువంటి పొలిటికల్ థగ్స్ కమిటీకి, అనేకమంది ఇతరులకు ప్రసాదించిన క్షమాభిక్షలు చెల్లవు. అవి ఇక ఏ మాత్రం అమలులో ఉండబోవని ప్రకటిస్తున్నా. ఎందుకంటే వాటిపై ఆటో పెన్‌తో సంతకం చేశారు. అంటే వాటిపై జో బైడెన్ సంతకం చేయలేదని అర్థం. మరీ ముఖ్యంగా వాటి గురించి బైడెన్‌కు అసలు ఏమీ తెలియదు. ఆ క్షమాభిక్షల గురించి బైడెన్ సరిగా వెల్లడించనే లేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

మోదీ పాడ్‌కాస్ట్‌ను షేర్ చేసిన ట్రంప్

అమెరికన్ పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రీడ్‌మన్ షోలో భారత ప్రధాని మోదీ సంభాషణ వీడియోను ట్రంప్ ఆదివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. ట్రంప్ నాయకత్వాన్ని ఆ షోలో మోదీ ప్రశంసించారు. ట్రంప్‌తో తాను సమావేశమైన సందర్భాలను చిరస్మరణీయ ఘటనలుగా పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొనసాగుతున్న తమ సంబంధాలనూ ఆ షోలో మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. దాదాపు మూడు గంటలపాటు సాగిన ఆ షో యూట్యూబ్ లింక్‌ను తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టు చేశారు.

11 మంది యూట్యూబర్లపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఝుళిపించారు. హర్షసాయి, విష్ణుప్రియ వంటి యూట్యూబర్లు సహా.. సెలబ్రిటీలు, టీవీ నటులపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల కూడా ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేటలోని ఓ సంస్థలో శిక్షణ తరగతులకు హాజరవుతున్న మియాపూర్ వాసి వి.వినయ్.. శిక్షణ కేంద్రాల వద్ద విద్యార్థుల్లో చాలా మంది బెట్టింగ్ యాప్‌లకు బానిసలై.. ఉన్నదంతా పోగొట్టుకుంటున్న విషయాన్ని గుర్తించారు. పలువురు యూట్యూబర్లు ఈ తరహా యాప్‌లకు ప్రచారం చేస్తున్నారంటూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా బెట్టింగ్ యాప్‌లపై ఎక్స్ వేదికగా మండిపడుతున్నారు. దీంతో పంజాగుట్ట పోలీసులు సోమవారం 11 మంది యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై గేమింగ్ యాక్ట్‌లోని సెక్షన్లు 3, 3ఏ, 4.. ఐటీ చట్టంలోని సెక్షన్ 66డీ, భారత న్యాయ సంహిత(బీఎన్‌ఎస్)లోని 318(4) సెక్షన్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో శ్యామల(వైసీపీ అధికార ప్రతినిధి), హర్ష సాయి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియ, రీతూ చౌదరి, బండారు శేషయాని సుప్రీత, కిరణ్ గౌడ్, అజయ్, సన్నీ యాదవ్, సుధీర్ పేర్లు ఉన్నాయి. పోలీసులు వీరందరికీ త్వరలో నోటీసులు జారీ చేసి, విచారించనున్నారు. విచారణ సందర్భంగా యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇచ్చే వాంగ్మూలాన్ని బట్టి.. అరెస్టులు కూడా ఉంటాయని తెలుస్తోంది.

సజ్జనార్ పోరాటం

ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా ఎక్స్ వేదికగా పోరాటం సాగిస్తున్నారు. "బెట్టింగ్ యాప్‌లకు సెలబ్రిటీలు, యూట్యూబర్లు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రచారం కల్పిస్తున్నారు. ఫలితంగా అమాయకులు నష్టపోతున్నారు. సర్వం కోల్పోయి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అంటూ ట్వీట్లు చేస్తున్న విషయం తెలిసిందే..! నిజానికి ఆయన సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా ఉన్న సమయంలో.. ఈ తరహా గేమింగ్ యాప్ నిర్వాహకుల భరతం పట్టారు. యాప్ నిర్వాహకుల మూలాల వరకు వెళ్లారు. ఢిల్లీ, నోయిడా, ఉత్తరప్రదేశ్‌లో ఉంటూ.. యాప్‌లను నిర్వహించే భారతీయులను అరెస్టు చేయగా.. చైనాలో ఉన్న సూత్రధారులపైనా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆర్టీసీ ఎండీగా ఉన్నా.. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు, ఇన్‌స్టా రీల్స్ చేసేవారిని టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఈ కోవలోనే సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లో పలువురిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే..!

స్నేహితుడిని కొట్టి చంపిన ముగ్గురు మిత్రులు

- ఈ నెల 8న ఘటన.. ముగ్గురు నిందితుల అరెస్ట్

పాపన్నపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్త బైక్‌ను పోలీసులు లాక్కెళ్లడానికి కారణమయ్యాడని స్నేహితుడిపై కోపం పెంచుకున్నాడు ఓ వ్యక్తి. అదును చూసి మిత్రుల సహాయంతో అతడిని తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బల ధాటికి బాధితుడు చనిపోయాడు. మెదక్ జిల్లా ఏడుపాయలలో ఈ నెల 8న జరిగిన హత్య కేసు వివరాలను మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సోమవారం వెల్లడించారు. పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామానికి చెందిన వడ్ల నవీన్ ఫిబ్రవరి 17న సంగారెడ్డిలో కొత్త బైక్ కొన్నాడు. 18న స్నేహితులు.. తొగర్పల్లికి చెందిన వినోద్‌రెడ్డి, సంగారెడ్డికి చెందిన బేగరి రాములు, కమ్మరి రమణాచారితో కలిసి మద్యం తాగాడు. అనంతరం బైక్‌పై వెళ్తుండగా సంగారెడ్డిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో దొరికిపోయారు. ఆ సమయంలో నవీన్ పోలీసులను బతిమాలుతుండగా వినోద్‌రెడ్డి వారితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, బైక్ లాక్కెళ్లారు. అప్పటినుంచి వినోద్‌రెడ్డిపై నవీన్ కోపంపెంచుకున్నాడు. మార్చి 8న నవీన్ సంగారెడ్డి వెళ్లాడు. రాములు, రమణాచారి తో కలిసి మద్యం తాగుతుండగా.. వినోద్‌రెడ్డి ఫోన్ చేశాడు. దీంతో నవీన్ అతడిని రమ్మని పిలిచాడు. అనంతరం ఏడుపాయలలో దావత్ చేసుకుందామని వినోద్‌రెడ్డిని తీసుకెళ్లారు. అక్కడ మళ్లీ మద్యం తాగారు. ఈ క్రమంలో నవీన్ కర్రతో వినోద్‌రెడ్డిపై దాడి చేశాడు. రాములు, రమణాచారి కూడా కొట్టడంతో వినోద్‌రెడ్డి మృతి చెందాడు. పోలీసులు ముగ్గురినీ అరెస్టు చేశారు.

మోసగాళ్లకు మోసగాడు సైబర్ నేరగాడికే రూ.10వేల టోకరా

అరెస్టు చేస్తానంటూ బెదిరింపు కాల్ చేసిన వ్యక్తికి ఉల్టా టోపీ

లఖ్‌నవూ, మార్చి 17: సైబర్ నేరగాళ్ల నేరశైలి తెలిసిందే..! పార్శిల్ వచ్చిందని, కస్టమ్స్ క్లియరెన్స్‌కు డబ్బులు చెల్లించాలని, వేర్వేరు పన్నులతో విడతల వారీగా అందినకాడికి దండుకుని, ఫోన్ సిమ్‌కార్డు మార్చేస్తారు..! అయితే.. తనకు ఫోన్ చేసి, బెదిరించిన సైబర్ కేటుగాడిని ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన ఓ యువకుడు కుచ్చుటోపీ పెట్టాడు. సైబర్ క్రిమినల్ నుంచి మూడు విడతల్లో ఏకంగా రూ.10,480 వసూలు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. కాన్పూర్‌కు చెందిన భూపేంద్ర సింగ్ అనే యువకుడికి కొద్ది రోజుల క్రితం సైబర్ నేరగాడి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. "నేను సీబీఐ నుంచి మాట్లాడుతున్నాను. నీకు సంబంధించిన అశ్లీల వీడియోలను గుర్తించాం. నీ మీద కేసు నమోదు చేస్తున్నాం. అరెస్టు చేస్తాం. ఒకవేళ కేసు పెట్టొద్దంటే.. రూ.16 వేల లంచం ఇవ్వాల్సిందే..!" అంటూ బెదిరించాడు. ఈ కాల్ చేసింది సైబర్ నేరగాడే అని గుర్తించిన భూపేంద్ర.. ఉల్టా కథ అల్లాడు. "అంకుల్.. అంత పని చేయకండి ప్లీజ్..! మా అమ్మకు మాత్రం చెప్పకండి. మీకు డబ్బులు చెల్లిస్తాను. కాస్త సమయం ఇవ్వండి" అంటూ అమాయకంగా నటించాడు. సైబర్ నేరగాడి నుంచి మరోమారు ఫోన్ కాల్ రావడంతో.. "అంకుల్.. మీకు డబ్బులు చెల్లిస్తాను. అయితే.. నా చైన్ ఒకటి తనఖాలో ఉంది. దాన్ని విడిపించాలంటే రూ.3 వేలు కావాలి. అంత డబ్బు నా దగ్గర లేదు. మీరు సాయం చేస్తే.. మీకు ఇవ్వాల్సిన మొత్తంతో కలిపి ఇచ్చేస్తాను" అని నమ్మబలికాడు. అంతే.. సైబర్ నేరగాడు యూపీఐ ద్వారా రూ.3 వేలు పంపించాడు. ఆ తర్వాతి రోజు.. ఏమైందంటూ భూపేంద్రకు మరోమారు ఫోన్ చేశాడు. దానికి భూపేంద్ర.. "అంకుల్, నేను మైనర్‌ని అని చెప్పి చైన్ విడిపించుకోనివ్వడం లేదు. నేను పాన్ బ్రోకర్ దగ్గరకు వెళ్లి, మీకు కాల్ చేస్తాను" అని ఫోన్ పెట్టేశాడు. కొంత సేపటికి కేటుగాడికి ఫోన్ చేసిన భూపేంద్ర తన మిత్రుడిని పాన్ బ్రోకర్‌గా పరిచయం చేస్తూ.. ఫోన్ ఇచ్చాడు. భూపేంద్ర మిత్రుడు వడ్డీతో కలిపి మరో రూ.4,480 చెల్లిస్తేనే చైన్ ఇస్తానని తెగేసి చెప్పాడు. దాంతో కేటుగాడు ఆ మొత్తాన్ని బదిలీ చేశాడు. ఆ తర్వాతి రోజు మరోమారు భూపేంద్రకు ఫోన్ చేసి విచారించగా.. "అంకుల్.. బ్యాంకులో రూ.1.1 లక్షల గోల్డ్‌లోన్ ఇస్తామన్నారు. అయితే.. ప్రాసెసింగ్ ఫీజు రూ.3 వేలు నగదు రూపంలో ఇవ్వాలంటున్నారు. మీకు తెలుసుకదా? నా దగ్గర అంత డబ్బు లేదు" అని నమ్మబలికాడు. దీంతో సైబర్ కేటుగాడు ఆ మొత్తాన్ని బదిలీ చేశాడు. ఆ తర్వాత అనుమానం వచ్చిన సైబర్ నేరగాడు.. తనను మోసం చేస్తున్నట్లు గుర్తించి, భూపేంద్రతో కాళ్లబేరానికి దిగాడు. "తప్పయిపోయింది. నేను పంపిన డబ్బులు నాకు తిరిగి బదిలీ చేయి" అంటూ వేడుకున్నాడు. అయితే.. భూపేంద్ర మాత్రం స్థానిక పోలీసులకు విషయం చెప్పి.. ఫిర్యాదు చేశాడు. తాను కొల్లగొట్టిన రూ.10,480లను అవసరాల్లో ఉన్నవారికి అందజేస్తానని పేర్కొన్నాడు. ఇప్పుడు భూపేంద్ర ఉదంతం నెట్టింట వైరల్‌గా మారుతోంది. నెటిజన్లు అతను చాకచక్యంగా వ్యవహరించిన తీరుకు కితాబిస్తున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

- భార్య, ఇద్దరు కొడుకులు, తల్లితో కలిసి కారులో వెళ్తున్న టెకీ.. దారిలో ప్రమాదం
- భార్య, కొడుకు, తల్లి అక్కడికక్కడే మృతి
- స్వల్ప గాయాలతో బయటపడ్డ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోహిత్ రెడ్డి, మరో కుమారుడు


ప్రమాదంలో చనిపోయిన ప్రగతిరెడ్డి, అర్విన్, సునీత (ఫైల్)

షాద్‌నగర్, చౌదరిగూడ 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో సాఫీగా సాగుతున్న వారి జీవితంలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఐదుగురు కుటుంబ సభ్యులు కలిసి ప్రయాణిస్తున్న కారును ఓ కంటెయినర్ ఢీకొనడంతో.. అందులోని ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అమెరికా కాలమాన ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు (భారత కాలమాన ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3.35 గంటలకు) అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ ప్రమాదం జరిగింది. సిద్దిపేట జిల్లా బక్రి చెప్యాలకు చెందిన రోహిత్‌రెడ్డి (38) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఆయన భార్య ప్రగతిరెడ్డి (36) అమెరికాలోని ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు. రోహిత్‌రెడ్డి తల్లి సునీత (56) కూడా వారితోనే ఉంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో రోహిత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో పిక్నిక్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న ఓ భారీ కంటెయినర్ వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. దీంతో వెనుక సీట్లో కూర్చున రోహిత్‌రెడ్డి తల్లి సునీత, భార్య, పెద్ద కుమారుడు అర్విన్(6) అక్కడిక్కడే మృతి చెందారు. ముందు సీట్లో కూర్చుని కారు డ్రైవింగ్ చేస్తున్న రోహిత్ రెడ్డి, ఆయన చిన్న కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోహిత్‌రెడ్డి 12 ఏళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి కూతురు ప్రగతిరెడ్డిని వివాహం చేసుకున్నారు. అనంతరం వారు అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవలే ప్రగతిరెడ్డి తల్లిదండ్రులు అమెరికా వెళ్లి వచ్చారు. ఈ సమయంలోనే ఒకేసారి ముగ్గురు వ్యక్తులు మరణించడంతో ఆ కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. టేకులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అదేరోజు తన కూతురు ఫోన్‌చేసి మాట్లాడుతూ పిక్నిక్‌కు వెళ్లామని, మరో అరగంటలో ఇంటికి చేరుకుంటామని చెప్పిందని, కానీ ఇలా తిరిగిరాని లోకానికి వెళ్తారని అనుకోలేదంటూ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ వేసవిలో తన కూతురు, అల్లుడు, మనుమళ్లు అందరూ సొంతూరికి వస్తారని ఎంతో ఆశతో ఎదురు చూస్తుంటే.. ఇంతలోనే దుర్వార్త వినాల్సి వచ్చిందని రోదించారు. ప్రగతిరెడ్డి తల్లితండ్రులు మంగళవారం సాయంత్రం అమెరికాకు బయలుదేరుతారు. ఫ్లోరిడాలోనే మృతులకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం.

చెత్త కుప్పలో వేసి పురుటి శిశువుకు నిప్పు!

- హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో దారుణం

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కుప్పలో వేసి నిప్పంటించారు. ఈ అమానవీయ ఘటన హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో చోటు చేసుకుంది. స్థానికంగా ఇది కలకలం రేపింది.. ఎన్టీఆర్ స్టేడియం పరిసరాల్లో ఓ శిశువుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని సోమవారం దోమలగూడ పోలీసులకు స్థానికుల నుంచి సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆధారాలు సేకరించారు. పసికందును చంపేసి ఇక్కడికి తీసుకొచ్చి నిప్పంటించారా..? లేదా మృత శిశువునే దహనం చేశారా అనేది తేలాల్సి ఉందని ఇన్‌చార్జ్ ఏసీపీ గురురాఘవేంద్ర తెలిపారు. కేసును అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నామని.. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా, ఎన్టీఆర్ స్టేడియంలో శిశువు దహనానికి ఇద్దరు టీనేజర్లే కారణమని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రేమ పేరుతో వారు హద్దులు దాటడంతో బాలిక గర్భం దాల్చిందని తెలిసింది. దీంతో తొందరగా ప్రసవం కావాలని బాలిక మాత్రలు వేసుకోవడంతో ఏడో నెలలోనే ఆడ శిశువుకు జన్మనిచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మృతి చెందిన ఆడ శిశువును ఈనెల 15న ఎన్టీఆర్ స్టేడియంలో పరిసరాల్లోకి తెచ్చి నిప్పంటించినట్లు భావిస్తున్నారు.

28 జిల్లాల్లో 40 డిగ్రీలపైనే

- నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లా బేలలో 42 డిగ్రీలు
- హైదరాబాద్‌లో 40.1 డిగ్రీలు నమోదు
- మానుకోటలో వడదెబ్బతో ఒకరి మృతి



హైదరాబాద్, కేసముద్రం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మార్చిలోనే ఎండలు మాడు పగలగొడుతున్నాయి. పగటి పూట బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయ్ అనే పరిస్థితి నెలకొంటోంది. సోమవారం ఆదిలాబాద్ జిల్లా బేలలో 42 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. జైనథ్‌లో 41.7, ఆదిలాబాద్ రూరల్‌లో 41.6, మావలలో 41.5, ఆదిలాబాద్ అర్బన్‌లో 41.2, గాదిగూడ 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లో ఎన్నడూలేని విధంగా మార్చిలోనే 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కొత్తగూడెం, నారాయణపేట్ జిల్లా మక్తాలలో 41.9, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బనలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రత జనగాంలో 39.8 డిగ్రీలుగా నమోదైంది. గతేడాది ఇదే రోజున కేవలం మూడు జిల్లాల్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరగా, మిగతా జిల్లాల్లో సగటు ఉష్ణోగ్రతలు 36-39గా నమోదయ్యాయి. రాగల 2 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. తర్వాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. కాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున పెద్దవంగర మండలం ఉప్పరిగూడెంకు చెందిన దుంపల రాజు(48) వడదెబ్బతో మృతి చెందారు. మృతుడు నెల రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయి ఆచూకీ తెలియకుండా వివిధ ప్రాంతాలు తిరుగుతున్నాడని, వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇల్లు కట్టు.. పరిహారం కొట్టు

(మొదటి పేజీ తరువాయి)

గణపురం మండలం కొండంపల్లిలో దగా చేసేందుకు సిద్ధమయ్యారు. భూపాలపల్లిలోని ఓపెన్‌కాస్ట్-3 గని విస్తరణకు 3,201 ఎకరాల భూసేకరణ చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఇందులో వ్యవసాయ భూములతో పాటు 120 ఇళ్లు కూడా ఇందులో నష్టపోయే అవకాశం ఉందని ప్రాథమికంగా గుర్తించింది. భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసి సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చింది. అయితే, ప్రాజెక్టులో ఇళ్లు, భూములు కోల్పోతున్న చాలా మంది పేర్లు ఈ జాబితాలో లేవు. దీంతో ఇందులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ నేపథ్యంలో హైరానా పడ్డ కొండంపల్లి పరిసర గ్రామాలకు చెందిన బాధితులు ఈ అక్రమ తతంగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ నిర్మాణాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించగా విస్తుపోయే వాస్తవాలు తెలిశాయి.

అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు..

ఓపెన్‌కాస్ట్ గని విస్తరణలో ఎక్కడి వరకు స్థలాలు సేకరించే విషయాన్ని కొంత మంది సింగరేణి అధికారులు లీక్ చేశారు. దీంతో సంబంధిత గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, సింగరేణి సిబ్బంది, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై సింగరేణి ఖజానాకు కన్నం పెట్టేందుకు సిద్ధమయ్యారు. కొండంపల్లి ప్రాంతంలో 90 నుంచి 120 ఇళ్లు నష్టపోతుండగా దళారుల రంగ ప్రవేశంతో ఆ సంఖ్య 380కి చేరింది. సింగరేణి నిబంధనలు అనుసరించి భూసేకరణ జరిపే ప్రాంతంలో సీసీ రూఫ్ టాప్ ఇళ్లకు రూ.8 లక్షలు, కలపతో నిర్మించిన పెంకుటిళ్లకు రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తున్నారు. దీంతో అక్రమార్కులు రాత్రికి రాత్రే పెంకుటిళ్లను కట్టేసి రూ.10 లక్షలు కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. ప్రస్తుతం సింగరేణి యాజమాన్యం ఇళ్ల విస్తీర్ణం, కలప వివరాలను నమోదు చేసే పనిలో బిజీగా ఉంది. మొదట్లో కొత్తగా నిర్మించిన ఇళ్లకు పరిహారం ఇచ్చేందుకు ససేమిరా అన్న సింగరేణి.. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో కాస్త మెత్తబడింది. స్థలాలకు కాకుండా తాత్కాలికంగా నిర్మించిన ఇళ్లకే పరిహారం ఇచ్చేలా సంస్థ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, పరిహారం జాబితాలో పేరు రాని బాధితులు అధికారులను నిలదీస్తే.. విషయం బయటకు పొక్కకుండా వారికి కూడా పరిహారం ఇప్పిస్తామంటూ హామీ పత్రం రాసిస్తామని చెబుతున్నారు. ఈ విషయమై సింగరేణి అధికారులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. ఇంకా ఎవరికి పరిహారం ఫైనల్ కాలేదంటూ మాట దాట వేయడం గమనార్హం.



దండుకుంటున్న రెవెన్యూ అధికారులు..

వ్యవసాయ భూములకు సింగరేణి చెల్లిస్తున్న పరిహారం తక్కువగా ఉందని రైతులు గగ్గోలు పెడుతుంటే.. భూసేకరణలో రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక రైతుకు ఎకరా స్థలం ఉంటే 30 గుంటలు మాత్రమే నమోదు చేసి పరిహారం మంజూరు చేస్తున్నారు. మిగతా 10 గుంటలను వేరొకరి పేరుపై నమోదు చేసి రూ.లక్షల్లో దండుకుంటున్నట్లు తెలుస్తోంది. కాస్తో కూస్తో అవగాహన ఉన్న రైతులు అధికారులను నిలదీస్తే అలాంటి వారి రికార్డులను సరిచేస్తున్నట్లు తెలుస్తోంది. భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయంలో చాలా కాలంగా తిష్ట వేసిన ఓ ఉద్యోగి ఈ వ్యవహారాలు నడిపిస్తున్నట్లు సమాచారం. కొండంపల్లి గ్రామం కింద మొత్తం 41.29 ఎకరాల భూములు ఉండగా, వీరికి పునరావాసం కింద భూపాలపల్లి వైద్య కళాశాల సమీపంలో ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున స్థలాలు ఇవ్వనున్నారు. కుటుంబంలో వివాహం కాని వారందరికీ ప్యాకేజీ ఇస్తారు. పునరావాసం కింద వచ్చే సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయనున్నారు.

ప్రేరేపిత ఆందోళనలు..

పరిహారం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు కొంత మంది దళారులు బాధితులతో ఆందోళనలు కూడా చేయిస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు కొండంపల్లిలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 20 గుంటల భూమిని, దేవాలయానికి చెందిన మరో 20 గుంటల స్థలాన్ని గ్రామానికి చెందిన అధికార, విపక్ష నాయకులు అంతా కలిసి తమ పేరిట రికార్డులు సృష్టించి, పరిహారం కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తమకు రావాల్సిన పరిహారం విషయంలో ఇబ్బందులు సృష్టిస్తారేమోనని గ్రామస్థులు భయపడి ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారని తెలుస్తోంది.

టికెట్ సొమ్ము వాపస్‌కు 3 రోజులే గడువు

- రద్దయిన రైళ్ల ప్రయాణికులకు ద.మ రైల్వే సూచన
- ఆన్‌లైన్ టికెట్ల సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి17 (ఆంధ్రజ్యోతి): వివిధ సందర్భాల్లో రద్దయిన రైళ్లకు సంబంధించిన ప్రయాణికులు తమ టికెట్ సొమ్ము ను మూడు రోజుల్లోగా వాపసు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది. రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్ తీసుకున్న వారు సొమ్ము వాపసు కోసం తమ టికెట్‌ను రిజర్వేషన్ కౌంటర్‌లో అందజేయాల్సి ఉం టుందని అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ఐఆర్‌సీటీసీ ద్వారా తీసుకున్న ఇ-టికెట్లు అయితే వాటంతటవే రద్దవుతాయని, ఎటువంటి క్యాన్సిలేషన్ చార్జీలు మినహాయింపు లేకుండా మొత్తం సొమ్ము ప్రయాణికుల బ్యాంకు ఖాతాకు జమవుతుందని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు, బంద్‌లు, రైల్‌రోకో వంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తినపుడు అనివార్యంగా రైళ్లను రద్దు చేయడం లేదా దారి మళ్లించడం జరుగుతుందని తెలిపారు. కాగా, ఇటీవల సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనుల కారణంగా కొన్ని రైళ్లను రద్దు చేయ డం, మరికొన్నింటిని దారిమళ్లించాల్సి వచ్చిందని సీపీఆర్‌వో శ్రీధర్ పేర్కొన్నారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగినికి రూ.73.5 లక్షల టోకరా

- మానవ అక్రమ రవాణా పేరుతో సైబర్ నేరగాళ్ల బెదిరింపులు
- డిజిటల్ అరెస్టు అంటూ భారీ మోసం

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాలో మీ పాత్ర ఉందంటూ 75 ఏళ్ల రైల్వే విశ్రాంత ఉద్యోగిని నుంచి సైబర్ కేటుగాళ్లు రూ.73.5 లక్షలు కొల్లగొట్టిన ఉదంతమిది. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన బాధితురాలికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి.. మానవ అక్రమ రవాణా కేసులో మీపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారంటూ హెచ్చరించారు. ప్రధాన నిందితుడు సదావత్‌ఖాన్‌ను అరెస్టు చేశామని, 187 మంది సహ నిందితుల్లో మీరూ ఒకరని చెప్పారు. మీ ఆధార్‌తో తీసుకున్న సిమ్‌కార్డును ప్రధాన నిందితుడు వినియోగించాడని, సీబీఐ మీ అరెస్టుకు వారెంటు జారీ అయిందంటూ బెదిరించారు. ఆ తర్వాత రిజర్వ్ బ్యాంక్ నిబంధనలని పేర్కొంటూ.. బాధితురాలి ఖాతాలోని రూ.73.5 లక్షలను బదిలీ చేయించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పేరుతో ఓ లేఖను సృష్టించి, ఆమెకు పంపుతూ.. "మీరు ఎలాంటి తప్పు చేయలేదని తేలితే.. ఆర్‌బీఐ మీ డబ్బులను వడ్డీతో సహా తిరిగి ఇచ్చేస్తుంది" అని నమ్మబలికారు. ఆ తర్వాత సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ రాకపోవడంతో.. బాధితురాలు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో.. తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సైబర్‌క్రైమ్ రాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడి దుర్మరణం

- టైరు పగిలి డివైడర్‌ను, బస్సును కారు ఢీకొనడంతో ప్రమాదం

జడ్చర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు దుర్మరణం చెందిన ఘటన 44వ నంబరు జాతీయ రహదారిపై మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం సమీపంలో సోమవారం జరిగింది. జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ సర్వేయర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి (78), ఆయన కుమార్తె సామ శ్వేత, మనవడు అర్పిత్‌రెడ్డి (24) హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు కారులో బయలుదేరారు. మాచారం సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత డివైడర్ ఎక్కి వ్యతిరేక మార్గంలో కారు దూసుకుపోయి.. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఆ ధాటికి కారు నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న వెంకటరెడ్డి, అర్పిత్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన శ్వేతను ఆస్పత్రికి తరలించారు.

కొత్త మద్యం బ్రాండ్లు వస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)



లిక్కర్, మరో 10 బీర్ల కంపెనీలు ఉన్నాయి. రాష్ట్రంలో మద్యం, బీర్ల అమ్మకాలకు సంబంధించి టీజీబీసీఎల్ గత నెల 24న నోటిఫికేషన్ జారీ చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తయారీ, సరఫరాదారులను ఆహ్వానించింది. ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు నిర్ణయించింది. దీంతో అందరి చూపు కొత్త బ్రాండ్లపై పడింది. అయితే, మొదట్లో దరఖాస్తులు రాకపోవడంతో ఆబ్కారీ శాఖ అధికారులు కొంత ఆందోళనకు గురయ్యారు. చివరి నాలుగైదు రోజుల్లోనే దరఖాస్తులు వచ్చాయి. ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా అర్జీలు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సర్కారు పిలవడం ఇదే తొలిసారి..

ప్రస్తుతం రాష్ట్రంలో బీరు, మద్యం సరఫరా చేసే దేశీయ, విదేశీయ బ్రాండ్లు 53 వరకు ఉన్నాయి. ఇందులో 15 కంపెనీలకు తెలంగాణలో తయారీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఆరు బీర్ల కంపెనీలున్నాయి. గతంలో మద్యం సరఫరాకు కొత్త బ్రాండ్లు దరఖాస్తు చేసుకుంటే.. ప్రభుత్వం పరిశీలించి అనుమతి ఇచ్చేది. కానీ, ఇప్పుడు ప్రభుత్వమే నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులను ఆహ్వానించింది. కొత్త కంపెనీలే కాకుండా ఇప్పటికే మద్యాన్ని సరఫరా చేస్తున్న కంపెనీలు కూడా కొత్త బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని టీజీబీసీఎల్ పేర్కొంది. మన దేశానికి చెందిన లిక్కర్, బీర్లను తయారుచేసే దాదాపు 95 శాతం బ్రాండ్లు టీజీబీసీఎల్‌లో రిజిస్టర్ చేసుకున్నవే. ఇక విదేశీ మద్యం పంపిణీదారులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నుంచి అనుమతి తీసుకుని రాష్ట్రంలో సరఫరా చేస్తారు. అయితే, గతంలో సోమ్ బీర్లను అమ్మేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధం కాగా, ఆ కంపెనీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వెనక్కి తగ్గింది. ప్రస్తుతం ఆ కంపెనీ మళ్లీ బీరు, మద్యం సరఫరాకు దరఖాస్తు చేసుకుంది. ఇక, రాష్ట్రంలో సరఫరా అవుతున్న ఆరు బీర్ల బ్రాండ్లలో అత్యధికంగా అమ్మకాలు జరిగే కింగ్‌ఫిషర్ పంపిణీదారులు.. రేట్లు పెంచాలని, బకాయిలు చెల్లించాలని ఇటీవల సరఫరాను నిలిపివేశారు. ధర పెంచుతామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో పంపిణీని పునరుద్ధరించారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి, కొత్త కంపెనీలు విక్రయించుకోవడానికి వీలుగా ప్రభుత్వమే దరఖాస్తులను ఆహ్వానించే పద్ధతిని తీసుకొచ్చింది.

నెలాఖరులోగా విచారణ పూర్తి..

దరఖాస్తు చేసుకున్న 40 బ్రాండ్లల్లో సగం విదేశీ సరఫరాదారులే ఉన్నారు. తాము పలు రాష్ట్రాల్లో నాణ్యతా ప్రమాణాలతో సరుకును పంపిణీ చేస్తున్నామని, తమపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంటూ.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తెచ్చిన సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో జత చేశారు. మద్యం పాలసీని అమలు చేయడానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారితో పాటు చార్టెడ్ అకౌంటెంట్‌తో కూడిన కమిటీ బాధ్యత తీసుకుంటుంది. దరఖాస్తు చేసుకున్న బ్రాండ్లను ఏయే ప్రాంతాల్లో విక్రయిస్తున్నారో ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఆయా కంపెనీల నాణ్యత, ధర వంటి విషయాలపై ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తుంది. కంపెనీలు పేర్కొన్న ధర విషయంలోనూ బేరమాడే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను పూర్తి చేసుకుని వచ్చే ఏప్రిల్ నుంచి అమ్మకాలు జరిపేలా కసరత్తు చేస్తున్నారు.


పంచాయతీ కార్యాలయం వద్ద మొండిగౌరెల్లి రైతులు

ప్రాణాలు పోయినా భూములివ్వం

- తక్షణమే నోటిఫికేషన్ రద్దు చేయండి
- మొండిగౌరెల్లి రైతుల డిమాండ్

యాచారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాణాలు పోయినా పారిశ్రామిక పార్కు కోసం భూములు ఇచ్చేది లేదని రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మొండిగౌరెల్లి రైతులు స్పష్టం చేశారు. తమ భూముల జోలికి వస్తే లగచర్ల ఘటనకంటే దారుణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మొండిగౌరెల్లికి చెందిన 821 ఎకరాల 11 పటా అసైన్ భూములను పారిశ్రామిక పార్కు కోసం తీసుకుంటున్నట్లు నోటిఫికేషన్ రావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రైతులంతా పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. భూపోరాటం ముమ్మరం చేయడానికి వివిధ పార్టీలకు చెందిన 37 మందితో కూడిన జేఏసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జేఏసీ నాయకులు తాండ్ర రవీందర్, మల్లారెడ్డి మాట్లాడుతూ.. పారిశ్రామిక పార్కు కోసం భూసేకరణ చేయాలనే నిర్ణయం వెంటనే విరమించుకోవాలన్నారు. భూసేకరణకు కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా ఎలా నోటిఫికేషన్ జారీ చేశారని ప్రశ్నించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సెస్సుల తిరకాసు

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో సోమవారం ఒక ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. అనేక రకాల సెస్సులు, సర్‌చార్జీల పేరిట వసూలు చేసిన సుమారు ఆరులక్షల కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం వినియోగించకుండా వదిలేసిందన్నది ఆ ప్రకటన సారాంశం. 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి వసూలు చేసిన 5.70 లక్షలకోట్లు వచ్చే ఏడాది మార్చి మాసాంతం వరకూ వినియోగం కాకుండాపోతాయని కేంద్రం ప్రకటించింది. వసూళ్ళకూ వినియోగానికీ మధ్య ఇంత భారీ వ్యత్యాసం ఉండటాన్ని ఆర్థికవేత్తలు ఏ పరిభాషలో అభివర్ణిస్తారో తెలియదు కానీ, సామాన్యుడికి మాత్రం కడుపు మండే విషయం ఇది. ముక్కుపిండి వసూలు చేసిన ఇంతటి భారీ మొత్తాన్ని వినియోగించకుండా వదిలివేయడం పన్ను విధానాల్లోనూ, నిర్వహణలోనూ అసమర్థతకు తార్కాణం.

పన్నుల మాదిరిగా కాక, నిర్దేశిత అవసరాలు, ప్రయోజనాల రీత్యా ఈ సెస్సులు, సర్‌చార్జీలు విధిస్తారు కనుక, మరోవిధంగా చెప్పాలంటే, కేంద్ర ప్రభుత్వం ఈ 5.70లక్షలకోట్ల రూపాయలను అవసరాలకంటే అధికంగా వసూలు చేసినట్టు అనుకోవచ్చు. ప్రత్యేకమైన ప్రయోజనాలకు మాత్రమే సదరు మొత్తాన్ని వాడాల్సి ఉన్నందున, అధికమొత్తాలను వసూలు చేయడమెందుకన్నది ప్రశ్న. ఆర్థికమంత్రి ఈ అంశంమీద అద్భుతమైన వివరణలు ఇవ్వగలరు కానీ, రాష్ట్రాలకు మాత్రం మంచి రాజకీయ ఆయుధం దొరికినట్టే. రాష్ట్రాలకు పన్నుల్లో దక్కే వాటా ఎగ్గొట్టడానికి వీలుగా, ఇలా సెస్సులు, అదనపు సెస్సులు, సర్‌చార్జీల వంటి పేర్లతో కేంద్రం అడ్డతోవలో ఆర్జిస్తోందన్న వాదనలు, విమర్శలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఇది వాటికి కొత్త అస్త్రంగా ఉపకరిస్తుంది. రాష్ట్రాలకు వాటా ఇవ్వక్కర్లేదన్న కారణంతోనే కేంద్రం ఈ దారిని ఎంచుకుందనీ, ఆయా మొత్తాలను ఏటా పెంచుతూ, విస్తరిస్తూ పోతున్నదని అవి ఏనాటి నుంచో విమర్శిస్తున్నాయి.

సెస్సులు, సర్‌చార్జీల పేరిట వసూలు చేసిన మొత్తంలో 2019–20 ఆర్థిక సంవత్సరంలో వినియోగించని భాగం 83వేల కోట్లు ఉండగా, అది ఏటా అది పెరుగుతూ వచ్చింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇది 1.32లక్షలకోట్లు ఉంటుందట. నిర్దిష్టమైన, స్వల్పకాలిక అవసరాలకు ధనాన్ని సమకూర్చుకోవడమే వీటి లక్ష్యమని ఆర్థికమంత్రి చెబుతున్నారు. అవసరాలు అబద్ధం కాకపోవచ్చునేమోగానీ, అవసరాన్ని మించిన ధనాన్ని ఈ పేర్లతో వసూలు చేసినమాట మాత్రం నిజం. 2023–24 ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలో 13రకాల సెస్సులు ఉంటే, మరుసటి ఏడాది కేంద్రం ఏడుకు కుదించింది. సర్‌చార్జీలు మాత్రం ఇప్పటికీ నాలుగున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలికసదుపాయాలతో పాటు అనేకరంగాల్లో, చివరకు స్వచ్ఛ ఇంధనం, స్వచ్ఛభారతం పేరిట కూడా సెస్సుల వసూలు కొనసాగుతోంది. వాటి సంఖ్య తగ్గినా వసూలయ్యే మొత్తం తగ్గలేదు, పైగా పెరిగింది. మోదీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో సెస్సులు, సర్‌చార్జీలపేరుతో కేంద్రం వసూలు చేసింది లక్షకోట్లు ఉంటే, ఇప్పుడది నాలుగులక్షలకోట్లు దాటింది. వినియోగం ఎందుకు లేకపోతున్నది, ఏకంగా నాలుగోవంతు మొత్తం ఎందుకు మిగిలిపోతున్నదన్న ప్రశ్నలను అటుంచితే, సదరు సెస్‌లను ఇంకా అంతేస్థాయిలో వసూలు చేస్తుండటం పట్ల ప్రభుత్వం వివరణ ఇవ్వకతప్పదు. పైగా, కాగ్ ఇప్పటికే పలుమార్లు వసూలవుతున్న మొత్తాలను నిర్దేశిత రిజర్వ్‌ఫండ్స్‌లోకి బదిలీ చేయనందుకు కేంద్రాన్ని తప్పుబట్టింది కూడా. చమురు పరిశ్రమ అభివృద్ధి కోసమంటూ వసూలు చేసిన రెండు లక్షలకోట్ల క్రూడ్ ఆయిల్ సెస్ అందుకు వాడకపోవడం వంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

కేంద్రప్రభుత్వం పన్నురూపేణా వసూలు చేసే ప్రతీ వందరూపాయల్లోనూ 11రూపాయలు సెస్, సర్‌చార్జీలే. కేంద్రం ఆదాయంలో సెస్‌ల వాటా పెరుగుతూ, పన్నుల వాటా తగ్గుతూండటంతో రాష్ట్రాలకు దక్కాల్సినదానిలో కోతబడటం మొదలైంది. పన్నుల్లో అరవైశాతం కేంద్రానిది, నలభైశాతం రాష్ట్రాలకు అని ఆర్థికసంఘం హితవు చెబుతూంటే, సర్‌చార్జీలు, సెస్‌ల ఆదాయం తోడై కేంద్రానికి 68శాతం దక్కుతున్నదని, అంతిమంగా రాష్ట్రాలకు 32శాతమే మిగులుతోందని ఆర్థికవేత్తల అంచనా. 15వ ఆర్థికసంఘం రాష్ట్రాలకు 41శాతం అని చెప్పినా 31శాతమే వస్తున్నదని కొందరు లెక్కలు విప్పుతున్నారు. కేంద్రపన్నుల్లో అధికవాటా కోసం పోరాటాలు చేస్తున్న రాష్ట్రాలకు, ఇప్పుడు వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీలను కేంద్రం సదరు అవసరాలకు వినియోగించడం లేదన్న వార్త మరింత ఆగ్రహం కలిగించకమానదు.

మన నిశ్శబ్ద విప్లవం తీరే వేరు!

ఉత్తర భారతదేశంలో నిశ్శబ్ద విప్లవం ఒకటి జరిగి తీవ్ర సామాజిక మార్పులకు దారితీసిందంటే ఒకపట్టాన నమ్మలేం! ఒకనాటి ఉత్తరాది గురించి అంబేడ్కర్ 1955లో అన్న మాటలను గుర్తుచేసుకుంటే ఆ విప్లవం ఇంకా విచిత్రంగా కనపడుతుంది. "ఉత్తర, దక్షిణాది మధ్య తేడా చాలా ఉంది. ఉత్తరాది సంప్రదాయశీలమైంది. దక్షిణాది పురోగమనభరితమైంది. ఉత్తరాది మూఢనమ్మకాలతో ఉంటే దక్షిణాది హేతుబద్ధంగా ఉంటుంది. విద్యలో దక్షిణాది ముందడుగు వేసింది. ఉత్తరాది వెనుకబడింది. దక్షిణాది సంస్కృతి ఆధునికమైంది. ఉత్తరాది సంస్కృతి ప్రాచీనమైంది" అంటూ ఎన్నో తేడాలను ప్రస్తావించిన అంబేడ్కర్ ఉత్తరాది పాలనను దక్షిణాది ఎలా సహించగలదు? అన్న ప్రశ్నను కూడా లేవనెత్తారు. ఉత్తర–దక్షిణాదుల మధ్య తేడాల గురించి అంబేడ్కర్‌కే గాక ఇప్పటికీ చాలా మంది మేధావులకు ఇలాంటి అభిప్రాయాలే ఉన్నాయి. దక్షిణాది నేతలు సైతం మూఢనమ్మకాలను పోత్సహిస్తున్నా రాజకీయ విమర్శలు చేసేటప్పుడు మాత్రం 'ప్రగతిశీల దక్షిణాది' అంటూ మాట్లాడుతూనే ఉన్నారు. రాజకీయ అంశంగా దక్షిణాది ప్రగతిశీలత మారినంత మాత్రాన ఆ భావనకు ఎంతోకొంత వాస్తవిక పునాది లేదని చెప్పలేం.

రాజకీయాలపరంగా 1980ల నుంచి ఉత్తరాదిలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. అగ్రకులాల రాజకీయ ఆధిపత్యాన్ని తోసిపుచ్చే జైత్రయాత్రను అక్కడి బీసీలు ఆరంభించారని పేర్కొంటూ దాన్నొక నిశ్శబ్ద విప్లవంగా సూత్రీకరిస్తూ ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు క్రిస్టఫ్ జఫలాట్ 2003లో 500 పేజీల పుస్తకాన్నే రాశారు. దాని పేరు భారతీయ నిశ్శబ్ద విప్లవం. జఫలాట్ విశ్లేషణంతా ప్రధానంగా ఉత్తరాదికే పరిమితమైంది. బీసీలకు రిజర్వేషన్ల కల్పనలో దక్షిణాది ఎలా ముందుందో తగినంత లోతుగానే వివరించినా ఉత్తరాదిలో రాజకీయ మార్పులను వెల్లడించటమే ప్రధానంగా అందులో కనపడుతుంది.

దక్షిణాదిలో రిజర్వేషన్లకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. దేశంలో రిజర్వేషన్లు విస్తృతస్థాయిలో అమలవ్వటానికి దక్షిణాది ప్రయోగాలే ప్రేరణ. ఎగుడుదిగుడులు ఎదుర్కొన్నప్పటికీ ఉత్తరాదితో పోల్చితే చాలా ముందుగా దక్షిణాదిలో బీసీ రిజర్వేషన్లు అమలయ్యాయి. అవెన్నో మార్పులనూ తీసుకొచ్చాయి. దక్షిణాదిన ఉద్యోగాల్లో బీసీల శాతం నిర్దేశించిన కోటాలను దాటటమూ ఆ మార్పుల్లో భాగమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985 నాటికే ఉద్యోగుల్లో బీసీలు 28 శాతం ఉన్నారన్న విషయాన్ని జఫలాట్ ప్రస్తావించారు. ఓపెన్ కేటగిరీ పోస్టులకు సంబంధించి అగ్రకులాలతో పోటీ పడటం బీసీలకు సాధారణమైంది. యాభైశాతానికి కాస్త అటూఇటూగా ఉద్యోగాలనూ విద్యారంగంలో సీట్లనూ దక్కించుకునే ప్రక్రియా మొదలైంది. మెడికల్, ఇంజినీరింగ్ సీట్ల విషయంలో ఇది స్పష్టంగా కనపడుతోంది. ఇటీవల తెలంగాణ గ్రూప్–1 ఉద్యోగాల మెయిన్ పరీక్ష ఫలితాలను చూసినా ఇదే అర్థమవుతుంది. అత్యధిక మార్కులు సాధించిన 500 మందిలో 228 మంది బీసీ అభ్యర్థులే ఉన్నారు. అంటే 45.6శాతం మంది. ఇక ఎస్సీ (50), ఎస్టీ (38) అభ్యర్థులను కూడా కలుపుకొంటే మూడు వర్గాల వారు 63.2శాతం మంది అవుతారు. అధిక మార్కులు సాధించిన వందమంది జాబితానే తీసుకుంటే బీసీ అభ్యర్థులు 48శాతం ఉన్నారు. ఇక్కడే మరో విషయాన్ని కూడా స్పష్టంగా చూడొచ్చు. జనాభా శాతానికి అనుగుణంగా బీసీలు లక్ష్యానికి చేరువవుతుంటే ఎస్సీ, ఎస్టీల్లో ఇంకా దూరంలోనే ఉన్నట్టుగా గ్రూప్–1 ఫలితాలను చూస్తే అర్థం అవుతుంది. అధిక మార్కులు పొందిన 100 మందిలో ఎస్సీలు ముగ్గురు, ఎస్టీలు అయిదుగురు ఉండటమే దీనికి నిదర్శనం. అధిక మార్కులు వచ్చిన 500 ర్యాంకులను పరిగణనలోకి తీసుకుంటే ఎస్సీ ఎస్టీ శాతాలు కొంత పెరిగినా నిర్దేశించిన వాటా కంటే తక్కువే ఉన్నారు.

రిజర్వేషన్ల కోటాకు మించి బీసీలు ప్రగతి సాధిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ సోమవారం శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టింది. ఇదో విచిత్రమైన సన్నివేశం. అందుబాటులోని కొన్ని గణాంకాలను చూస్తే ఇప్పటికే 42 శాతం దరిదాపుల దాకా బీసీల ప్రాతినిధ్యం చేరినట్లు కనపడుతుంది! పోటీ పరీక్షల ఫలితాల విశ్లేషణా దీన్నే సూచిస్తోంది. ఇది పక్కాగా నిర్ధారణ కావాలంటే అధికారిక సమాచారం ఉండాలి. అటువంటి సమాచారాన్ని ప్రభుత్వం మాత్రమే వెల్లడించాలి. కులగణన సర్వేలో లభ్యమైన సమాచారాన్నీ ఇంతవరకూ బహిరంగపర్చలేదు. బిహార్ ప్రభుత్వం తాను చేపట్టిన కులగణన సమాచారాన్ని ధైర్యంగానే వెల్లడించింది. ఉద్యోగాల్లో ఏ కులం వారు ఎంతమంది ఉన్నారో తెలిపింది. తెలంగాణలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. బిల్లు లక్ష్యాలను వివరించే అనుబంధంలో స్థూలంగా కూడా అటువంటి సమాచారాన్ని పొందుపరచలేదు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని బుసాని వెంకటేశ్వర రావు నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ తేల్చిందని ప్రభుత్వం పేర్కొందే తప్ప సమగ్ర సమాచారాన్ని త్వరలో సభ ముందు ఉంచుతామనీ కూడా ప్రకటించలేదు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగ విషయాల్లో రిజర్వేషన్లను పెంచేందుకు సిఫార్సులను చేసే పనినీ బుసాని కమిషన్‌కే అప్పగించారు. ఒకే వ్యక్తితో రెండు కమిషన్లు ఏర్పాటయ్యాయన్న మాట!



తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకూ ఒకటి స్పష్టంగా కనపడుతోంది. రాజకీయ పదవుల విషయంలో బీసీలు వెనుకబడి ఉన్నా... విద్యా ఉద్యోగ రంగాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అగ్రకులాలతో పోటాపోటీగా ముందడుగులు వేస్తున్నారు. రాజకీయ పదవుల్లో అధిక ప్రాతినిధ్యం ఉంటేనే సామాజిక, ఆర్థికంగా ముందడుగు వేయటం సాధ్యమవుతుందనే సూత్రీకరణను అన్ని సందర్భాల్లో చేయలేం. ఉత్తరాది–దక్షిణాదిలో బీసీల ప్రాతినిధ్యాల చరిత్ర చెప్పే సారం అదే! దేశమంతటికీ వర్తించే సాధారణ సూత్రీకరణలను భారత్‌లో రూపొందించటం అంత తేలికకాదు!

విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యంలేదని గణాంకాలతో నిరూపిస్తేనే న్యాయ సమీక్షముందు చట్టం నిలబడే అవకాశం ఉంటుంది. ఉద్యోగులకు సంబంధించి కులాల లెక్కలను తీయటం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. కులం వెనుకబాటు ఆధారంగా కల్పించే రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని ఎందుకు దాటాల్సి వస్తోందో వాదించటానికి గణాంకాలే ఆధారం. న్యాయస్థానాలకు వాటిని సమర్పిస్తేనే 50 శాతం పరిధిని పునఃపరిశీలించే అవకాశం కొంతైనా ఉంటుంది. మండల్ కమిషన్ నివేదికలో బీసీలకు సంబంధించి అటువంటి సమాచారాన్ని పొందుపరచారు కాబట్టే 27 శాతం రిజర్వేషన్లు గట్టెక్కగలిగాయి. 1980ల నాటికి కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం ఎస్సీల కంటే తక్కువగా ఉందనే విషయాన్ని మండల్ కమిషన్ పేర్కొంది. ఆ అంశమే అప్పుడు కీలకంగా మారింది. ఏకసభ్య కమిషన్ అలా చేసి ఉంటే కులాలవారీ ఉద్యోగుల, విద్యార్థుల సమాచారాన్ని సేకరించి మదింపుచేసి ఉండాలి.

జఫలాట్ విశ్లేషించినట్లుగా నిశ్శబ్ద విప్లవం ఉత్తరాది రాజకీయ రంగంలో కులాల బలబలాలను మార్చివేస్తున్నా కేంద్ర ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం ఇంకా ఆశించినంతగా పెరగటం లేదు. 27 శాతం రిజర్వేషన్లను ఇప్పటికీ బీసీలు ఉపయోగించుకోలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రచురించిన సామాజిక సంక్షేమ గణాంకాల నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. 2022 జనవరి 1 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 21.98శాతం మాత్రమే బీసీలు ఉన్నారు. అదే ఎస్సీ (16.82శాతం), ఎస్టీ (7.33 శాతం)లైతే వారికి నిర్దేశించిన రిజర్వేషన్లకు సమానంగానే ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం లభించింది.

రాష్ట్రపతి ఆమోదాన్ని పొంది, కేసులేమైనా పడితే వాటినీ ఎదుర్కొని అనుకున్నట్టుగా 42శాతం రిజర్వేషన్లు తెలంగాణలో అమలైన పక్షంలో ఉద్యోగ, విద్యాముఖ చిత్రం బాగా మారుతుంది. విద్య, ఉద్యోగాల్లో జనాభాని మించి ప్రాతినిధ్యం బీసీలకు భవిష్యత్తులో లభించే అవకాశాన్నీ కొట్టేయలేం. ఆ పరిణామం ఎలాంటి మార్పులకు, ప్రతిస్పందనలకు దారితీస్తుందో ఇప్పుడే చెప్పలేం. కులాల వర్గీకరణను మరింత విస్తృతపరచాలనే డిమాండ్లు తలెత్తవచ్చు. సంపన్నశ్రేణిపై వివాదాలూ పెరగొచ్చు.

విద్యా, ఉద్యోగ విషయాల్లో పరిణామాలన్నీ దక్షిణాదిన ఒకే రీతిలో జరుగుతూ బీసీల ప్రాతినిధ్యం జనాభా శాతానికి మించి పెరిగితే దాన్నొక నిశ్శబ్ద విప్లవంగానూ భావించొచ్చు! తమిళనాడులో లాగా రాజకీయాధికారం కూడా అగ్రకులాల చేజారితే సామాజిక పరివర్తన సంపూర్ణమవుతుంది! ఈ సామాజిక పరిణామంతో సమస్యలన్నీ తీరతాయా? దాన్నొక నిజమైన సామాజిక విప్లవంగా భావించొచ్చా? అన్నది అప్పటికీ పెద్ద ప్రశ్నగానే ఉంటుంది. ఉద్యోగాల్లో ప్రాతినిధ్యాన్ని, రాజకీయ అధికారంలో మార్పులను కులదృష్టితో చూస్తే తమిళ సమాజమే ఆదర్శం



■ రాహుల్ కుమార్

అవుతుంది. కానీ ఆర్థిక అసమానతలతో పాటు అనేక సామాజిక సమస్యలు అక్కడ ఇంకా ప్రబలంగానే ఉన్నాయి. కొన్ని కులాలకు అనుచిత ఆధిపత్యమూ ఉంది. సత్తనాథన్ బీసీ కమిషన్ ఆ విషయాన్ని 1970ల్లోనే స్పష్టంచేసింది. మానవాభివృద్ధి సూచికలో కొంత మెరుగుగానే ఉన్నా మొత్తంగా తమిళనాడును అద్భుత ఆదర్శ నమూనాగా భావించే పరిస్థితి లేదు. ఆర్థిక అసమానతల వల్ల ఒకే కులంలో అనేక వర్గాలు పుట్టుకొచ్చాయి. అందుకే ఒక కులం మొత్తాన్ని ఒక వర్గంగా భావించే పరిస్థితి వేగంగా కనుమరుగైపోతోంది.

ఉత్తర–దక్షిణాది తేడాలకు సంబంధించి మరొక విషయాన్ని కూడా ప్రస్తావించుకోవచ్చు. ఉత్తరాదిన రాజకీయాల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవం ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెద్దగా పెంచలేదు. దక్షిణాదిన మాత్రం మహిళల ప్రాతినిధ్యం గణనీయంగానే పెరుగుతోంది. తెలంగాణ గ్రూప్–1 మెయిన్ పరీక్షలో అత్యధిక మార్కులు పొందిన 100 మందిలో 41

రిజర్వేషన్ల కోటాకు మించి బీసీలు ప్రగతి సాధిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ సోమవారం శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టింది. ఇదో విచిత్రమైన సన్నివేశం. అందుబాటులోని కొన్ని గణాంకాలను చూస్తే ఇప్పటికే 42 శాతం దరిదాపుల దాకా బీసీల ప్రాతినిధ్యం చేరినట్లు కనపడుతుంది!

మంది మహిళలు ఉన్నారు. 500 ర్యాంకుల వరకూ తీసుకుంటే 204 మంది మహిళలకు చోటు లభించింది. ఇవేమీ చిన్న విషయాలు కావు. రెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో వెల్లడించిన 111 గ్రూప్–1 పోస్టుల ఫలితాల్లో 51 మంది మహిళలకు చోటు దక్కింది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఎమ్మెల్యేల సంఖ్యను చూస్తే ఉత్తర–దక్షిణాది తేడాలు స్పష్టంగా కనపడతాయి. తెలంగాణలో బీసీ ఎమ్మెల్యేలు 19 మంది ఉన్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారి సంఖ్య 20కి మించలేదు. అంటే అసెంబ్లీలో బీసీల ప్రాతినిధ్యం 16 శాతం మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక శాతం అటూఇటూగా పరిస్థితి అంతే ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 1972కు ముందైతే అది 15 శాతం దాటలేదు. బిహార్‌లో అయితే 1995 అసెంబ్లీ ఎన్నికల నాటికే బీసీ ఎమ్మెల్యేల సంఖ్య దాదాపుగా 50 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత శాతాల్లో కొంత మార్పు వచ్చినా తెలుగు రాష్ట్రాలంత తక్కువ స్థాయిలో ఎప్పుడూ లేదు. ఉత్తరప్రదేశ్‌లో కూడా బీసీలకు ప్రస్తుత అసెంబ్లీలో 38శాతం ప్రాతినిధ్యం ఉంది.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకూ ఒకటి స్పష్టంగా కనపడుతోంది. రాజకీయ పదవుల విషయంలో బీసీలు వెనుకబడి ఉన్నా విద్యా ఉద్యోగ రంగాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అగ్రకులాలతో పోటాపోటీగా ముందడుగులు వేస్తున్నారు. రాజకీయ పదవుల్లో అధిక ప్రాతినిధ్యం ఉంటేనే సామాజిక, ఆర్థికంగా ముందడుగు వేయటం సాధ్యమవుతుందనే సూత్రీకరణను అన్ని సందర్భాల్లో చేయలేం. ఉత్తరాది–దక్షిణాదిలో బీసీల ప్రాతినిధ్యాల చరిత్ర చెప్పే సారం అదే! దేశమంతటికీ వర్తించే సాధారణ సూత్రీకరణలను భారత్‌లో రూపొందించటం అంత తేలికకాదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ద్రవిడవాదానికి అనుగుణంగానే హిందీపై విషం!

'హిందీ ఆధిపత్యం దేశ భవితవ్యానికి చేటు' అంటూ మార్చి 4వ తేదీన వీర్ సంఘ్వి రాసిన వ్యాసం అసంబద్ధంగా ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ హిందీ భాషపై విషం కక్కుతూ– హిందీ భాష భారతదేశంలోని 19 స్థానిక భాషలను మింగేసిందనీ, తమిళనాడులో హిందీ భాష పెత్తనాన్ని అడ్డుకుంటామనీ, అందుకు భారతదేశంలోని ప్రజలందరూ సహకరించాలనీ సామాజిక మధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ గురించి వీర్ సంఘ్వి అతిశయోక్తులతో స్పందించారు.

దేశీయ భాష అయిన హిందీని వ్యతిరేకించడం ద్రవిడ రాజకీయాల్లో ఒక భాగం. రాజకీయాలపై తమ పార్టీలకు పట్టు తప్పుతుందనే అనుమానం వచ్చిన వెంటనే హిందీ భాష పెత్తనం, ఉత్తరాది ప్రభావం, సనాతన భారతీయ సంస్కృతి మౌఢ్యం అంటూ కట్టుకథలతో తమిళ ప్రజలలో భాషా ఉన్మాదాన్ని రెచ్చగొడుతుంటారు. హిందీ భాషపై ద్వేషం ఆ రాష్ట్రంలో 1937 నుండి జరుగుతున్న తంతే! 1965లో హిందీ భాషపై వ్యతిరేక ఉద్యమం హింసాత్మకంగా మారటంతో, కేంద్ర ప్రభుత్వం పారా మిలిటరీ దళాలను దింపి ఉద్యమాన్ని అణచివేసే ప్రక్రియలో, పెద్ద సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. ఈ విషయాన్ని దాచిపెట్టడం ఎందుకు? ఉద్యమాన్ని లేవదీసిన రామస్వామి పెరియార్, ఆయన శిష్యులైన కరుణానిధి, అన్నా దొరై తమిళ రాజకీయాలలో తిరుగులేని నాయకులైనారు. బలిదానం సామాన్య ప్రజలది.



దేశీయ భాష అయిన హిందీని వ్యతిరేకించడం ద్రవిడ రాజకీయాల్లో ఒక భాగం. రాజకీయాలపై తమ పార్టీలకు పట్టు తప్పుతుందనే అనుమానం వచ్చిన వెంటనే హిందీ భాష పెత్తనం, ఉత్తరాది ప్రభావం, సనాతన భారతీయ సంస్కృతి మౌఢ్యం అంటూ కట్టుకథలతో తమిళ ప్రజలలో భాషా ఉన్మాదాన్ని రెచ్చగొడుతుంటారు.

బ్రిటిష్ పాలకులు భారతదేశంలో తమ పరిపాలనను స్థిరీకరించుకోవడం కోసం భారతీయులను కులాల వారీగా, భాషల వారీగా, ప్రాంతాల వారీగా విభజించడంలో భాగంగా ఉత్తర భారతీయులు ఆర్య జాతికి చెందిన వారని, దక్షిణ భారతదేశం లోని ప్రజలు, ముఖ్యంగా తమిళులు, ద్రావిడ సంస్కృతికి చెందిన వారనీ, వీరు భారతీయ సంస్కృతిలో భాగం కాదనీ, హిందీ ఆర్యుల భాష ఐన సంస్కృతం నుండి పుట్టిందనీ ఒక కట్టుకథల సిద్ధాంతాన్ని అల్లి, దానిని భారతీయుల మనసుల్లోకి బలంగా ఎక్కించారు. ఆర్య ద్రావిడ సిద్ధాంత భావజాలాన్ని తమిళనాడులోని జస్టిస్ పార్టీ బాగా ప్రచారం చేసింది. కాంగ్రెస్ సంస్థ నడిపే స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఈ పార్టీ వ్యతిరేకించిన విషయం నేటి యువకుల్లో చాలామందికి తెలియదు. జస్టిస్ పార్టీ మరో రూపమే ద్రవిడ మున్నేట్ర కగజం. తమిళుల విఘటన వాదాన్ని తమిళనాడులోని జాతీయవాద నాయకులు వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ విషయం వ్యాసకర్తకు తెలియదేమో!

లోక్‌సభ స్థానాల పునర్విభజన విషయంలో తమిళనాడుకు అన్యాయం జరిగిపోతుందన్న స్టాలిన్, మోదీ ప్రభుత్వ వ్యతిరేకుల వాదనలలో పసలేదు. ప్రస్తుతం తమిళనాడుకి 39 లోక్‌సభ సీట్లు ఉంటే ఉత్తరప్రదేశ్‌కు 80సీట్లు ఉన్నాయి. ఈ సీట్ల కేటాయింపు బీజేపీ ప్రభుత్వం చేసింది కాదు. ఇక ఉత్తరాది వారు జనాభాను కంట్రోల్ చేయలేదనీ, దక్షిణాది రాష్ట్రాలు జనాభాను కంట్రోల్ చేసినందుకు శిక్షకు గురి అవుతున్నాయనీ చేసే వాదనలు అర్థరహితం. ఈ వాదనలన్నీ బీజేపీ అధికార ప్రాబల్యాన్ని దెబ్బిపొడవడానికే!

ఈ దేశంలోని మెజార్టీ ప్రజలు మాట్లాడే హిందీ భాషను ఒక కొత్త భాష అని పేర్కొనడం, హిందీని సంస్కృతమయం చేశారని చెప్పడంలో వ్యాసకర్త గందరగోళానికి గురయ్యాడు. ఈయన ఆర్య ద్రావిడ వాదాన్ని బాగా తలకెక్కించుకున్నట్లు స్పష్టమైంది. హిందీ భాషను దక్షిణాది వారిపై రుద్దడానికి ప్రయత్నిస్తున్న వారి గురించి వాపోతూనే, కొంత మంది ఉత్తరాది వారి సంకుచిత భావజాలాల వల్ల హిందీ భాష దేశ ప్రజల దగ్గరికి చేరలేదని వాదన చేయడంలో ఔచిత్యం ఏమిటి? హిందీ భాషకు సంబంధించిన విషయాన్ని ప్రస్తావించడానికి స్వాతంత్ర సమరయోధుడు వీర సావర్కర్ ప్రస్తావన ఎందుకు?

ఈ దేశ ప్రజలను ప్రాంతాల వారీగా, మతాల వారీగా, భాషల వారీగా, వర్గాల వారీగా విభజించి అధికారంలో కొనసాగాలనే దురాలోచన ఎక్కువ ప్రాంతీయ పార్టీల నాయకులకు ఉంటుంది. దేశ ప్రజలను సమైక్యంగా ఉంచాలన్న విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఆలోచనలలో పెద్ద తేడా లేదు. 1937 నుండి 1967 వరకు ద్రావిడ వాద రాజకీయ నాయకులు కాంగ్రెస్‌ను ఆడి పోసుకుని, ఆ రాష్ట్రంలో ఆ పార్టీకి ఉనికి లేకుండా చేశారు. 2024 ఎన్నికలలో తమిళనాడులో బీజేపీ 16శాతం ఓట్లను సాధించింది. ఈ విషయం తమిళ భాషా వాద రాజకీయ నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. అందుకే బీజేపీకి వ్యతిరేకంగా భాషోద్యమాన్ని లేవదీస్తున్నారు.

1986లో దేశమంతా నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తే తమిళనాడులో ద్రావిడ వాద రాజకీయ నాయకులు వాటి ఏర్పాటును అడ్డుకున్నారు. దేశంలో ఈ విద్యాలయాలు లేని రాష్ట్రం ఒక్క తమిళనాడే. భాష పేరుతో ప్రజలను రాజకీయాల చుట్టూ తిప్పుకోవడం తమిళ నాయకులకు అలవాటే! దేశ సమైక్యత సమగ్రతల విషయంలో ఏకాభిప్రాయంతో ఉండే ప్రజలు తమిళనాడులో సైతం ఉన్నారు. ఈ ప్రజా సమూహమే ఈ ద్రవిడవాద రాజకీయ నాయకుల దుర్నీతికి అడ్డుకట్ట వేస్తుంది.

• ఉల్లి బాలరంగయ్య

వర్గీకరణలో 'వాటా'లు సరిచేయాలి!

వర్గీకరణ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షించదగ్గ విషయమే అయినప్పటికి జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నివేదికలో ఉన్న అంశాల మీద ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయకపోవడం, అమలు చేయాల్సిన అంశాల మీద చర్చించి నిర్దిష్ట నిర్ణయాలను తీసుకోకపోవడం విచారకరం.

ఏకసభ్య కమిషన్ నాలుగు ప్రధానమైన సిఫారసులలో క్రిమిలేయర్ ప్రతిపాదనను తిరస్కరించి మిగతా మూడు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. దీని ప్రకారం గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3గా ఎస్సీ వర్గీకరణ జరిగింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా వర్గీకరించి వాటాలు కేటాయించారు. మొదటి గ్రూప్‌కు అత్యంత వెనుకబడిన షెడ్యూల్డు కులాలుగా, రెండవ గ్రూప్‌కు మధ్యస్థంగా లబ్ధి పొందిన షెడ్యూల్డు కులాలుగా, మూడవ గ్రూప్‌కు మెరుగైన ప్రయోజనాలు పొందిన షెడ్యూల్డు కులాలుగా కమిషన్ పేరు పెట్టింది. ఈ మూడు గ్రూపుల్లో గ్రూప్–1 కేటగిరీలో 15 కులాలను గుర్తించి వారికి 1శాతం (జనాభా 1,71,625), గ్రూప్–2లో మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 కులాలను గుర్తించి వారికి 9 శాతం (జనాభా 32,74,377), మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలుగా 26 కులాలను గుర్తించి వారితో గ్రూప్–3 ఏర్పాటు చేసి 5శాతం (జనాభా 17,71,682) రిజర్వేషన్లు కల్పించారు. ఈ నివేదికలో ఒక గ్రూప్‌కు వెనుకబాటుతనం ఆధారంగా, మరొక గ్రూప్‌కు జనాభా ఆధారంగా, మరొక గ్రూప్‌కు ఏ ఆధారం లేకుండా వర్గీకరణ చేశారు. అందువల్ల ఈ మొత్తం వర్గీకరణ ప్రక్రియలో కమిషన్ నిష్పక్షపాత కొలమానాన్ని, సూత్రబద్ధతను ఎంచుకోలేదనేది స్పష్టం.

ఎస్సీ వర్గీకరణలో గ్రూప్–1లో చేర్చబడ్డ 15 కులాలలో ప్రధానంగా మాదిగ అనుబంధ కులాలైన బేడ బుడగ జంగం, డక్కలి, మాతంగిలతో పాటు మరికొన్ని కులాలను తీసుకున్నారు. అయితే ఇదే గ్రూపులో మాల అనుబంధ కులాలైన మన్నే, పంబాల కులాలను కూడా చేర్చారు. దీనివల్ల గ్రూప్–1కు కేటాయించబడిన 1శాతం రిజర్వేషన్ కూడా మాల అనుబంధ కులాలైన పంబాల, మన్నె కులాలకు చెందేలా కుట్రపూరితమైన వ్యూహ రచన జరిగింది. 1998లోనే మూడవ శ్రేణి అయిన 'సి' గ్రూపులో చేర్చబడ్డ మాల, పంబాల కులాలను నేడు 2025లో అత్యంత వెనుకబడ్డ కులాలుగా గుర్తించి గ్రూప్–1లో చేర్చడం అతిపెద్ద తప్పిదం.

ఏకసభ్య కమిషన్ నివేదికలో లోపాలను మందకృష్ణ మాదిగ వివరించిన తర్వాత ముఖ్యమంత్రి కమిషన్ గడువును పొడిగించి మంచి నిర్ణయం తీసుకున్నారు. అంతిమంగా లోపాలు సవరించబడాలి. మళ్లీ పాత నివేదికనే అమలు చేస్తే ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్ అన్నట్లుగా ఉంటుంది.

ఇక రెండో విషయానికొస్తే రిజర్వేషన్లలో మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 కులాలను గుర్తించారు. గ్రూప్–2లో ఉన్న ఈ కులాలకు రిజర్వేషన్లు కేటాయించడంలో మధ్యస్థమైన సూత్రబద్ధతను ఎంచుకోలేదు. అత్యంత వెనుకబడిన వారికి, అత్యంత అభివృద్ధి చెందినవారికి మధ్యగా ఉన్న ఈ మధ్యస్థ కులాల గ్రూప్‌కు రిజర్వేషన్లు కేటాయింపులు కూడా సగటు మధ్యస్థంగానే ఉండడం ఏ కోణంలో చూసినా న్యాయబద్ధం. కానీ ఆ సగటు మధ్యస్థమైన విధానాన్ని రిజర్వేషన్ల కేటాయింపుల్లో పాటించలేదు. గ్రూప్–2లో ఉన్న మధ్యస్థ కులాలకు 1శాతం రిజర్వేషన్ కేటాయించడానికి 3,63,819 జనాభాను ఆధారంగా తీసుకున్నారు. అదే మెరుగైన ప్రయోజనాలు పొందిన గ్రూప్–3లో ఉన్న కులాలకు 1శాతం రిజర్వేషన్ కేటాయించడానికి 3,54,336 జనాభాను ఆధారంగా తీసుకున్నారు. ఇక్కడ రెండింటికి మధ్య వ్యత్యాసం దాదాపు 10 వేల జనాభా. న్యాయబద్ధంగా అయితే మెరుగైన కులాలకు రిజర్వేషన్ కేటాయించడానికి ఎక్కువ జనాభాను, మధ్యస్థంగా



లబ్ధి పొందిన కులాలకు రిజర్వేషన్ కేటాయించడానికి తక్కువ జనాభాను పరిగణనలోకి తీసుకోవాలి. దీనికి విరుద్ధంగా మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలకు తక్కువ జనాభాను (3,54,336), మధ్యస్థంగా ప్రయోజనాలు పొందిన కులాలకు (3,63,819) జనాభాను ఎక్కువగా పరిగణలోకి తీసుకున్నారు. ఇది సహజ న్యాయ సూత్రాలను పూర్తి విరుద్ధచర్య.


గ్రూప్–3 కేటగిరిలో మాలలతో పాటు మిగతా 25 కులాలను చేర్చి 5శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ఇక్కడ ఎస్సీలలో జనాభా ప్రకారం మూడవ అత్యంత జనాభా కలిగి ఉన్న నేతకాని కులానికి మరికొన్ని కులాలను కలిపి ఒక ప్రత్యేకమైన గ్రూపును ఏర్పాటు చేయడానికి అవకాశం, ఆస్కారం ఉన్నాయి. మాల సామాజిక వర్గంతో పోల్చితే ఈ గ్రూపులోని నేతకాని, మహర్, హోలియదాసరి, మాల దాసరి, మితయల్వార్ మొదలగు కులాలు తీవ్ర వెనుకబాటుతనంతో ఉన్నాయి. కానీ కమిషన్ వీరి ఆకాంక్షను పట్టించుకోలేదు. గతంలో మాదిగలతో కలిసి ఉన్న బుడగ జంగం కులానికి 1,11,710 జనాభా ఉందనే కారణంతో ప్రత్యేకంగా వేరు చేసి వారికి తోడుగా మరికొన్ని వెనుకబడిన కులాలను చేర్చి గ్రూప్–1 ఏర్పాటు చేసి ఒక శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు బుడగజంగం కులం కన్నా ఎక్కువ జనాభా 1,33,072 ఉన్న నేతకాని కులాన్ని మాలల నుండి వేరు చేసి వారికి మరికొన్ని వెనుకబడ్డ కులాలను కలిపి ఒక ప్రత్యేకమైన గ్రూపు చేసి వారికి కూడా ఒక శాతం రిజర్వేషన్ ఎందుకు ఇవ్వలేదు?

మాలల్ని ఇంకొన్ని మెరుగైన కులాలను గ్రూప్–4గా ఏర్పాటు చేసి వారికి ఎంత శాతం రిజర్వేషన్లు న్యాయబద్ధంగా చెందుతాయో ఆ ప్రకారం కేటాయింపులు చేయాలి. ఈ ప్రకారం గతంలో మాదిరిగా ఎస్సీ వర్గీకరణను నాలుగు గ్రూపులుగా అమలు చేయవచ్చు. మాలల జనాభా, మాల అయ్యవార్‌లతో కలిపి 15,27,143 మాత్రమే. కానీ వీరి రిజర్వేషన్ శాతాన్ని పెంచడం కోసం పక్షపాత దృష్టితో ఆలోచించి నేతకానితో పాటు మరికొన్ని కులాలను కలిపి గ్రూపులు ఏర్పాటు చేశారని నివేదికను బట్టి అర్థమవుతుంది.

కమిషన్ సిఫారసుల ప్రకారం ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణలో అనేక లోపాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలలకు 6శాతం రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణలో కేటాయించబడ్డాయి. ఇప్పుడు తెలంగాణలోనూ 6శాతం రిజర్వేషన్లు (గ్రూప్–3లో 5శాతం, పంబాల, మన్నె కులాలు ఉన్న గ్రూప్–1లో 1శాతం మొత్తం 6శాతం) కేటాయించబడ్డాయి. అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా యూనిట్‌గా తీసుకుంటే 6శాతం రిజర్వేషన్లు లభించాయి. కానీ తెలంగాణ జనాభాను యూనిట్‌గా తీసుకుంటే యథావిధిగా 6శాతం ఎలా కేటాయించబడ్డాయనేది అర్థం కాని అంశం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలల జనాభాతో పోల్చితే తెలంగాణలో మాలల జనాభా చాలా తక్కువ. అందువల్ల రిజర్వేషన్ల వర్గీకరణ కేటాయింపుల్లో 6శాతం కన్నా తక్కువ వాటా రావాలి.

ఎవరికి సంతృప్తి మిగల్చని పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాధించేది ఏమి ఉన్నదో ఆలోచన చేసుకోవాలి. ఈ మొత్తం నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్టమైన అంచనాకు వచ్చిన ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ వివిధ కులాల నేతలతో ముఖ్యమంత్రిని స్వయంగా కలిశారు. కమిషన్ నివేదికలో లోపాలను ముఖ్యమంత్రికి సవివరంగా వివరించారు. ముఖ్యమంత్రి సానుకూల దృక్పథంతో ఏకసభ్య కమిషన్ గడువును పొడగించి మంచి నిర్ణయం తీసుకున్నారు. అయితే అంతిమంగా లోపాలు సవరించబడాలి. మార్పులు లేకుండా మళ్లీ పాత నివేదికనే అమలు చేస్తే ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్ అన్నట్లుగా ఉంటుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కీలక ఘట్టంలో ఉన్నది. కాలం ఇచ్చిన అవకాశాన్ని రేవంత్‌రెడ్డి సద్వినియోగం చేసుకుంటారని, మాదిగలతో పాటు మిగతా 57 కులాలు మాత్రం బలమైన విశ్వాసంతో, నమ్మకంతో ఎదురు చూస్తున్నాయి.

■ గోవిందు నరేష్ మాదిగ
ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం)
సహర్: 5:00 (బుధవారం ఉదయం)



'పది' పరీక్షలకు సన్నద్ధం

పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం

- ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహణ
- ఫ్లయింగ్ స్క్వాడ్లు, చీఫ్ సూపరింటెండెంట్ల నియామకం
- హనుమకొండ జిల్లాలో 12,010 మంది, వరంగల్‌లో 9,392 మంది విద్యార్థులు

హనుమకొండ/ వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది హనుమకొండ జిల్లా నుంచి 12,010మంది, అలాగే వరంగల్ జిల్లాలో 9,392 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవనుండగా.. హనుమకొండలో 67, వరంగల్‌లో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రతీ కేంద్రంలో ప్రత్యేకంగా ఒక సిట్టింగ్ స్క్వాడ్ చొప్పున 67మందిని నియమించారు. వీటితో పాటు ప్రశ్నాపత్రాలు భద్రపరిచేందుకు పాయింట్లను గుర్తించారు. సర్కిల్ సిబ్బందిని, రూట్ అధికారులను కూడా ఏర్పాటు చేశారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కసరత్తు

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులందరికి అందచేశారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేశారు. రివిజన్ కూడా చేశారు. విద్యార్థులకు స్పెషల్ టెస్ట్‌లను నిర్వహించారు. నవంబర్‌లో ఒక స్పెషల్ టెస్ట్‌ను జరిపారు.

పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు 800 మందిని నియమించారు. వరంగల్ జిల్లాలో 287 పాఠశాలల నుంచి 9,392 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఈవో మామిడి జ్ఞానేశ్వర్, ఏసీజీఈ కన్నం కరుణ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విద్యాశాఖ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో సెల్ఫ్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించేందుకు 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 50 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ప్రతీ పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయగా, మరో 600 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించారు.

21 నుంచి పరీక్షలు.. పటిష్ట ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి హాల్ టికెట్లను విడుదల చేసింది. తమ అధికారి వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎస్ఎస్‌సీ బోర్డు తెలిపింది. హాల్ టికెట్లను విద్యార్థులు ఇప్పటికే నేరుగా టీటీటీ.ఱ్ఖ్ఖజ్స్ఖ్ఖ్ఖ.జౌరి.జీ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నారు. మరో వైపు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ప్రతీ పాఠశాలకూ ఇప్పటికే హాల్ టికెట్లను చేరవేశారు. ప్రతీ ఒక్క విద్యార్థి పరీక్ష గదికి వాటిని తప్పకుండా తీసుకువెళ్లాలి. పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు, మూత్రశాలలను ఏర్పాటు చేయడంతో పాటు చల్లనితాగునీటిని కూడా అందుబాటులో ఉంచుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థుల్లో ఎవరైనా అస్వస్థతకు గురైన పక్షంలో వారికి తక్షణం వైద్యసహాయం చేసేందుకు ప్రతీ పరీక్షా కేంద్రంలో మెడికల్ కిట్‌తో ఒక ఏఎన్ఎంను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతకు పోలీసు బందో బస్తును ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇతరులెవరు సంచరించకుండా 144 సెక్షన్‌ను విధిస్తున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ నుంచి ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు
వాసంతి, హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలో విద్యార్థులు పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా, ఉల్లాసపూరితమైన వాతావరణం రాసేందుకు వీలుగా అన్ని ముందస్తు చర్యలను తీసుకున్నాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షా కేంద్రాలను గుర్తించడమే కాకుండా అవసరమైన సిబ్బందిని నియమించాం. కేంద్రాల్లో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పించాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసేలా హెచ్ఎంలకు ఆదేశాలు ఇచ్చాం.

100 శాతం ఫలితాలు సాధిస్తాం : మామిడి జ్ఞానేశ్వర్, వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి

పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాం. ఈ ఏ డాది పరీక్షల్లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణ సాధిస్తారని ఆశిస్తున్నాం. అందుకోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ప్రత్యేక తరగతులతో నిరంతర పర్యవేక్షణతో వారిని అన్ని విధాలుగా సంసిద్ధులను చేశాం. డిసెంబర్‌లోనే సిలబస్ పూర్తి చేసి పునశ్చరణ తరగతులు నిర్వహించాం. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, భయం లేకుండా పరీక్షలు రాయాలి. జిల్లాలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం.

ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా కార్యాలయంలో అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్‌పై వరంగల్ నగర ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందితో పాటు అధికారులపై ఉందని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ఆస్తి, నల్లా పన్నుల వసూళ్లలో అంకిత భావంతో నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించడంలో పురోగతి సాధించాలన్నారు. రంజాన్ పండగ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గాలలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 118.06 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ. 60.17 కోట్లు వసూలు అయ్యాయని అన్నారు. నీటి పన్ను రూ. 30.18 కోట్లు కాగా రూ. 79 లక్షలు మాత్రమే వసూలు అయ్యాయని అన్నారు. పన్నుల వసూలుకు సమయం తక్కువగా ఉందని కనీసం 85 శాతం పన్నులు వసూలు కావాలని అన్నారు. కాజీపేట, కాశిబుగ్గ సర్కిళ్ల పరిధిలో ఇప్పటి వరకు పన్నులు చెల్లించని బడా వ్యాపారులకు రెడ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. పన్నులు చెల్లించని వారిని గుర్తించి ప్రాపర్టీ సీజ్ చేయాలని ఆదేశించారు.

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ విషయానికి వస్తే భూముల క్రమబద్ధీకరణకు లక్ష వరకు దరఖాస్తులు వచ్చాయని 14,088 మంది క్రమబద్ధీకరణకు ఫీజులు చెల్లించారని వెల్లడించారు. 680 మందికి క్రమబద్ధీకరణ ధృవపత్రాలను అందజేయడం జరిగిందని అన్నారు. 25 శాతం రిబేట్‌తో ఈ నెల 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజును చెల్లించవచ్చని అన్నారు. బల్దియా వ్యాప్తంగా 10 చోట్ల హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని ఎక్కడైనా డబ్బులు చెల్లించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ సిటి ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటి కమిషనర్లు ప్రసన్నరెడ్డి, రాజేశ్వర్, టీవో రామకృష్ణ, టౌన్‌ప్లానింగ్, ఇం జనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

నిర్బంధాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి సభ

6

- అట్టర్‌ఫ్లాప్ సీఎంగా రేవంత్‌రెడ్డి మిగులుతారు
- దమ్ముంటే కడియంతో రాజీనామా చేయించాలి
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, పెద్ది సుదర్శన్‌రెడ్డి

సామాజిక అవసరాలను తీర్చేవి ప్రభుత్వ వర్సిటీలే..

- వీటి అభివృద్ధికి విరివిగా నిధులు కావాలి
- పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి సదస్సులో కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

6

రేపు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన



హనుమకొండ టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవన్నపేటలోని ఫేస్ త్రీలో ఏర్పాటుచేసిన పంప్ హౌస్ మోటార్లను ఈ నెల 19న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రారంభించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.45 నిమిషాలకు మంత్రి పంప్ హౌస్ మోటార్‌ని ప్రారంభిస్తారని తెలిపారు.

20న బల్దియా కౌన్సిల్ సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య (కౌన్సిల్) సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు బల్దియా సెక్రెటరీ అలివేలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశాల మేరకు బల్దియా పరిధిలోని 66 డివిజన్‌ల కార్పొరేటర్లు, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు (ఎక్స్ అఫిషియో) మెంబర్లు పాల్గొనాలని తెలిపారు. బల్దియా కౌన్సిల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. 2025-2026 బడ్జెట్ అంచనాలు, 2024- 2025 సంవత్సరాలలో బడ్జెట్ సవరణలపై చర్చతో తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. అలాగే నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై అభిప్రాయ సేకరణ జరుగుతుందని వెల్లడించారు. కీలక నిర్ణయాలపై సభ్యుల ఆమోదం మేరకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు.

గవర్నమెంట్ ప్లీడర్‌గా నర్సింహరావు



వరంగల్ లీగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా గవర్నమెంట్ ప్లీడర్ (ప్రభుత్వ న్యాయవాది)గా న్యాయవాది కాకిరాల నర్సింహరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు లా సెక్రెటరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కోర్టు, ఇతర అదనపు జిల్లా కోర్టులకు సంబంధించిన సివిల్ కేసులను ప్రభుత్వం తరుఫున వాదిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బల్దియా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్‌పై ప్రతీ ప్రజావాణిలో తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయని అధికారులు సమస్యలపై శ్రద్ధ వహించాలని అన్నారు. రానున్న వేసవిలో మంచి నీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఇంకా ప్రజలు ఫోన్ చేస్తుంటే కొన్ని విభాగాల అధికారులు ఫోన్‌లు లిఫ్ట్ చేయడం లేదని తమకు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రతీ ఒక్కరితో ఫోన్‌లో మాట్లాడి సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 88 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్ లింగం, హెచ్‌వో లక్ష్మారెడ్డి, బయాలజిస్ట్ మాధవ్‌రెడ్డి, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై. రామకృష్ణ, పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 24, హెల్త్, శానిటేషన్ - 4, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 10, టౌన్‌ప్లానింగ్ - 46, తాగునీటి సరఫరా - 4 ఇలా మొత్తం 88 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

రెండు సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా..
మైదం ఎల్లయ్య, వరంగల్ జక్కలొద్ది

రెండు సంవత్సరాలుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా. తన గోడు పట్టించుకోవడం లేదని వరంగల్ జక్కలొద్ది ప్రాంతానికి చెందిన మైదం ఎల్లం అనే వృద్ధుడు బల్దియా కార్యాలయం ఎదుట అధికారుల తీరుపై నిరసన తెలిపాడు. తన భార్య, కుమారుడితో కలిసి ప్రజావాణికి వచ్చి అధికారుల తీరుపై మండి పడ్డాడు. తాను వరంగల్ చౌరస్తాలో వాటర్‌మెన్‌గా పని చేస్తూ ప్రమాదవశాత్తు కాలు విరగడంతో ఇంటి వద్దనే ఉంటూ చికిత్స చేయించుకుంటున్నానన్నాడు. ఇక ఉద్యోగం చేయలేనని తన ఉద్యోగం తన కుమారుడికి ఇవ్వమని అడిగితే రెండు సంవత్సరాలుగా ఇంజనీరింగ్ అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. ఓ అధికారి పని మార్పిడి కోసం డబ్బులు అడుగుతున్నాడని తన వద్ద చిల్లి గవ్వ లేదని కమిషనర్ మేడం తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

నీటి సరఫరా లేకపోవడంతో ఫిర్యాదు దారుల ఇబ్బంది

అసలే ఎండా కాలం.. ఇప్పటికే ఎండలు మండి పోతున్నాయి. కానీ ప్రతీ సోమవారం బల్దియా కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమానికి వందలాది మంది బాధితులు సమస్యల పరిష్కారం కోసం బల్దియా ప్రధాన కార్యాలయానికి వచ్చి గంటల తరబడి వేచి చూస్తారు. కానీ ఇక్కడ మంచి నీరు అందుబాటులో ఉండదు. ప్రజల గొంతు తడపాల్సిన ఫ్రీజ్ గత రెండు సంవత్సరాలుగా పని చేయకుండా మూలన పడి ఉందని బాధితులు విమర్శిస్తున్నారు. ప్రజావాణి బాధితులు మంచి నీటి కోసం ఎంజీఎం వరకు నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు.

ఫిర్యాదులు ఇలా..

ములుగురోడ్డు నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్లే మార్గంలో కేఎస్ఆర్ గార్డెన్ సమీపంలో ఇళ్లు కట్టుకుని ఉంటున్నాం. తమ కాలనీకి నల్లా కలెక్షన్లు, సీసీ రోడ్డు, కాల్వలు ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేశారు.

- మూడు సంవత్సరాల క్రితం వరంగల్ శాకరాసికుంటలో అండర్ డ్రైయినేజీ మోరీ, రోడ్లు నిర్మాణం చేశారు. ఐతే పూర్తిగా రోడ్డు నిర్మాణం చేయకపోవడం వల్ల కంకరతేలి ప్రజలకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు తెలిపారు.
- వరంగల్ 16వ డివిజన్ గొర్రెకుంట మెయిన్‌రోడ్డుపై బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మదర్‌థెరిస్సా సెంటర్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ కాకతీయకాలనీ ఫేజ్ -2 రోడ్డును పునరుద్ధరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు నుంచి 4,5,6 డివిజన్‌లకు వెళ్లాల్సిన ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారని, దారి వెడల్పు చేసి సీసీ రోడ్డు వేయాలని ఫిర్యాదు చేశారు.



కమిషనరేట్ క్రైం డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన జనార్ధన్

వరంగల్ క్రైం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా జనార్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1989 ఎస్సై బ్యాచ్‌కు చెందిన జనార్ధన్ వరంగల్, ఖమ్మం, సీఐడీ విభాగాల్లో పనిచేశారు. ట్రాన్స్ కో విభాగంలో అదనపు ఎస్పీగా పని చేస్తున్న జనార్ధన్‌కు ప్రభు త్వం పదోన్నతి కల్పించి కమిషనరేట్ క్రైం డీసీపీగా నియమించింది. కాగా, బాధ్యతల స్వీకరణ అనంతరం సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



గంగదేవిపల్లిని సందర్శించిన కేంద్ర సర్వీస్ బృందం

గంగదేవిపల్లిని సందర్శించిన కేంద్ర బృందం

గీసుగొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని 26 మందితో కూడిన కేంద్ర సర్వీస్ బృందం ఇండియా సెక్రటేరియట్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కిశోర్‌సోని ఆధ్వర్యంలో సోమవారం సందర్శించింది. వృత్తిపరమైన శిక్షణలో భాగంగా మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రానికి వచ్చిన బృందం ఫీల్డ్ విజిట్ కోసం గంగదేవిపల్లికి వచ్చి గ్రామాభివృద్ధిని అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా బృందానికి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, లభించిన జాతీయ, అంతర్జాతీయ అవార్డుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజీవ్, మార్గం కుమారస్వామి, గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ట్రైబల్ వర్సిటీ వీసీ

ములుగు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వై.ఎల్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు మం డలం జాకారంలోని వర్సిటీ తాత్కాలిక క్యాం పస్‌లో విధుల్లో చేరిన ఆయనకు ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది స్వా గతం పలికారు. అంతకు ముందు తాడ్వా యి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకున్న వీసీ సంప్రదాయ పూజలు చేశారు. పూజారులు ఆయనకు కండువా కప్పి ప్రసాదం అందజేశారు. కలెక్టర్ టీఎస్.దివాకరను వీసీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.



నూతన వీసీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ దివాకర

నిట్ చైర్‌పర్సన్ స్థానే విధుల అప్పగింతపై సవరణ

- జారీ అయిన గెజిట్ నోటిఫికేషన్
- వరంగల్ నిట్ -2017 స్యాచ్యూట్‌లో సబ్‌సెక్షన్ 4 చేర్పు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా కారణం వల్ల బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్‌పర్సన్ విధుల్లో లేని కాలంలో ఆయన బాధ్యతలను మరో జాతీయ ప్రాధాన్యత కలిగిన ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్‌కు అప్పగించే విషయంలో సవరణ చేస్తూ వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్‌పర్సన్ పదవీ కాలం ముగియడం, మృతి చెందడం, రాజీనామా చేయడం లేదంటే ఇతరత్రా కారణాల వల్ల ఖాళీ అయినా.. అనారోగ్యం, గైర్హాజరు లేదా మరే కారణం వల్ల విధులు నిర్వహించలేక పోయినా చట్టంలోని 16వ సెక్షన్ ప్రకారం ఆయన స్థానంలో జాతీయ ప్రాధాన్యత కలిగిన మరో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్‌కు అప్పగిస్తూ సవరణ చేశారు. అయితే ఈ బాధ్యతల అప్పగింత కాలపరిమితి ఆరు నెలల వరకు లేదంటే ఒక వేళ చైర్‌పర్సన్ కాలపరిమితి ముగిసిన పక్షంలో మరో రెగ్యులర్ చైర్‌పర్సన్ నియామకమయ్యే వరకు వరంగల్ నిట్ విజటర్ ఆమోదం మేరకు అమలులో ఉంటుంది. ఈ మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్స్ -2017లో సబ్-స్టాచ్యూట్ (4)ను చేర్చడం ద్వారా ఈ సవరణ చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్-2017ను ఇక నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్-2025గా పిలుస్తారు.

వన్యప్రాణులను వేటాడిన ఐదుగురి అరెస్ట్

ఖానాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పాకాల అభయారణ్యంలో వన్యప్రాణులను వేటాడిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు నర్సంపేట రేంజ్ ఆఫీసర్ రవికిరణ్ సోమవారం తెలిపారు. చిలుకమ్మనగర్ శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం వేటగాళ్ల అమర్చినఉచ్చులో పడ్డ కనుజును మాంసంగా మార్చి, కొండగొర్రె కళేబరాన్ని ఆటోలో తరలిస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వన్య ప్రాణుల వేట వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. కాగా, ఫారెస్ట్ అధికారులు వేటకు పాల్పడ్డ ఆరుగురిని గుర్తించి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో చిలుకమ్మగర్‌కు చెందిన బంగారి సుమన్, ఇస్లావత్ సుధీర్, పాయం పవన్‌కుమార్, అశో క్‌నగర్‌కు చెందిన షురేష్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మం డలం మొండ్రాయిగూడెంకు చెందిన బాబురావు అలియాస్ లవకుమార్ ఉన్నారు. ఏకాంబ్రం చికిత్స పొందుతున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

నిర్బంధాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి సభ

- అట్టర్‌ఫ్లాప్ సీఎంగా రేవంత్‌రెడ్డి విఎగిలిపోతారు
- దమ్ముంటే కడియంతో రాజీనామా చేయించాలి
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్బంధాల మధ్య ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను నిర్వహించారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలదీస్తున్నారని ఉద్యమకారులను, బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులకు పాల్పడినట్లు బీఆర్ఎస్ నేత, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి తిన్నింటి వాసాలు లెక్కపెట్టి అధికార దాహం కోసం బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచి కూతురు రాజకీయం కోసం కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి రాజకీయ విలువల గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంలో 9 రిజర్వాయర్లతో 1.40 లక్షల ఎకరాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పంటలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గాన్ని ఎడారిలా మారుస్తున్నారని దుయ్యబట్టారు. కడియం శ్రీహరి పచ్చి అవకాశవాదిగా మారి ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్వహించిన బహిరంగ సభ మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడానికి ఉపయోగించారని ఎద్దేవా చేశారు. ఆ సభతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం జరుగలేదన్నారు. గత ప్రభుత్వంలో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 15 నెలల్లో తట్టెడు మట్టి తీయలేదని కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చే పరిస్థితిలేదని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్‌లో మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అవినీతి, అక్రమాలు, దోపిడీ, విధ్వంసం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. కడియం శ్రీహరి మొఖంలో ఉపఎన్నిక భయం కనిపిస్తుందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కడియం శ్రీహరితో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఎప్పుడు ఉప ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ప్రజలు గెలిపిస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ కుటుంబంపై రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను మర్చురీకి పంపిస్తా, తాగుబోతు అని విమర్శలు చేయడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డిపై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయని దేశంలోనే అట్టర్‌ఫ్లాప్ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఎక్కువ రోజులు కొనసాగరని అన్నారు. అందుకోసమే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని తన పదవిని కాపాడుకుంటున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దమ్ముంటే కడియంతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పై రేవంత్‌రెడ్డి పల్లెత్తు మాట మాట్లాడిన ప్రజల చేతిలో నిర్బంధం తప్పదని హెచ్చరించారు.

కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ కన్నుమూత

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రవిందర్
- రవిందర్‌కు పలువురు నేతల నివాళి

రఘునాథపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చీమలపాటి రవిందర్(58) సోమవారం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రఘునాథపల్లికి చెందిన రవిందర్ అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. కంచనపల్లి పీఏసీఎస్ పరిధిలోని రఘునాథపల్లి నుంచి డైరెక్టర్‌గా 2019లో ఎన్నికవగా 15 ఫిబ్రవరి 2019న చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రవిందర్ మృతితో రఘునాథపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రవిందర్‌కు భార్య విజయ, ఇద్దరు కుమారులు మధు, ప్రవీణ్, కుమార్తె మమత ఉన్నారు. రవిందర్ మృతదేహా నికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవిందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, ములుగు అడిషనల్ కలెక్టర్ జి.మహేందర్‌జీ, రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైకుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తదితరులు నివాళులర్పించారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రవిందర్(ఫైల్)

కార్మిక భవన్ కూల్చివేతపై చర్చ

శాసనమండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో అజంజాహి మిల్లు కార్మిక భవన్ కూల్చివేతపై సోమవారం శాసనమండలిలో చర్చ జరిగింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. కార్మిక భవన్‌కు 80 ఏళ్ల చరిత్ర ఉందని, ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. ఆ స్థలానికి కొందరు దొంగ కాగితాలు సృష్టించి ఓ వస్త్ర వ్యాపారికి అమ్మగా... ఆ వ్యాపారి కార్మిక భవన్‌ను కూల్చివేశారని, దాంట్లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడం కోసం భూమి పూజ కూడా చేశారని, ఈ పూజకు మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు వెళ్లి కొబ్బరికాయ కొట్టారని వివరించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కుమ్మక్కై దానికి తప్పుడు కాగితాలు పుట్టించారని, ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆదే స్థలంలో కార్మిక భవన్‌ను నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు.



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

రేపు విద్యుత్ చార్జీల ప్రతిపాదనపై బహిరంగ విచారణ

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనపై బుధవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు బహిరంగ విచారణ చేపడుతున్నట్లు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు పాల్గొంటున్నారని, ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్న 17 జిల్లాల వినియోగదారులు బహిరంగ విచారణలో పాల్గొని అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

వినతులు స్వీకరించిన హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన వినతులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 94 వినతులు అందగా శాఖల వారీగా వాటిని ఎండార్స్ చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 20, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 6, జీడబ్ల్యూఎంసీ 6, పౌర సరఫరాల శాఖ 7, విద్యాశాఖ 4 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజావాణి అనంతరం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందుల ఏర్పాటుపై మండలాల వారిగా సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

హనుమకొండ : వివిధ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా వచ్చే ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలు వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 76 ఆర్జీలు వచ్చాయి. కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత బాధితుల నుంచి సమస్య తెలుసుకుని అధికారులను పిలిచి సమస్య ఎంక్వైరీ చేసి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



హనుమకొండలో బాధితుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్ కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

సామాజిక అవసరాలను తీర్చేవి ప్రభుత్వ వర్సిటీలే..

- వీటి అభివృద్ధికి విరివిగా నిధులు కావాలి
- కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- కేయూలో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సామాజిక అవసరాలు తీర్చేవి ప్రభుత్వ వర్సిటీలేనని కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో 'యూజీసీ నూతన నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల స్వయం ప్రతిపత్తి' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు వీసీ, సామాజికవేత్త, రిటైర్డు ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, మండ సారంగపాణి హాజరై మాట్లాడారు. మొదట వీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ వర్సిటీలను కాపాడుకోవాలన్నారు. ప్రైవేట్ వర్సిటీలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్ర పరిధిలోని వర్సిటీల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. పరిశోధనకు విరివిగా నిధులు కేటాయించాలన్నారు. నాణ్యమైన బోధనకు అధ్యాపకుల నియామకాలు జరగాలని స్పష్టం చేశారు. కేంద్రం, యూజీసీలు రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీలకు నిధుల్లో భారీగా కోత విధించడంపై రిటైర్డు ప్రొఫెసర్ వెంకటనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, మహిళ వర్గాలకు ఇచ్చే ఫెల్లోషిప్‌లను తగ్గిందన్నారు. మరో రిటైర్డు ప్రొఫెసర్ సారంగపాణి మాట్లాడుతూ.. కేంద్ర నూతన జాతీయ విద్యా విధానం-2025 విద్యను వ్యాపారంగా మార్చేందుకేనని ఆరోపించారు. ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నున్నా అప్పారావు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. యూజీసీ నూతన నిబంధనలకు వ్యతిరేకిస్తూ విద్యార్థులు, యువతను చైతన్యం చేస్తున్నామన్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకమైన కేంద్ర విధానాలను యువత అడ్డుకోవాలని పీడీఎస్‌యూ జాతీయ నేత ఈడంపాక విజయ్‌కన్నా పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పీడీఎస్‌యూ నేతలు డాక్టర్ సుత్రాపు అనిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, సహాయ కార్యదర్శి మిశ్రిన్ సుల్తానా, జిల్లా అధ్యక్షుడు రాచకొండ రంజిత్, వర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు పవన్ కల్యాణ్, వంశీకృష్ణ, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

21, 22 తేదీల్లో కేయూలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం శాఖాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో మార్చి 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను వర్సిటీ పరిపాలన భవనంలోని వారి చాంబర్‌లో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందచేశారు. 'ప్రజాస్వామ్య భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాల ప్రాధాన్యత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరుగుతోంది. దీనికి ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి రాజనీతిశాస్త్రవేత్తలు, స్కాలర్లు, విద్యార్థులు హాజరుకానున్నారు.

ఐటీఐ ప్రాంగణంలో 20న జాబ్‌మేళ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులలో సుమారు 20 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ములుగురోడ్‌లోని ఐటీఐలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళ ఉంటుందన్నారు. వివరాలకు 98488 95937 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2216	2100
పల్లికాయ (సూక)	7150	6500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	6652	5540
పెసళ్లు	7407	4645
పత్తి	6825	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13500	9000
వండర్‌హాట్	15800	11500
యూఎస్341	13000	9500
దేశీ	30000	25500
సింగిల్ పట్టి	32000	35000
దీపిక	16000	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

నిరంతర సాధన అవసరం



నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్లు వచ్చి చేతి రాతకు పెద్దగా పనిలేకుండా చేశాయి. దీనికి తోడు చాలా విద్యాసంస్థలు కేవలం బట్టీ పట్టించేందుకు చదువు మీద పెట్టిన శ్రద్ధను విద్యార్థుల చేతి రాతపై పెద్దగా పెట్టడం లేదు. దీని వల్ల పరీక్షల్లో జవాబులు అన్నీ సరిగానే రాసినప్పటికి అందమైన చేతి రాత లేక మార్కులు తగ్గిపోయి విద్యార్థులు నష్టపోతున్నారు. అందుకు ఒక్కసారి అందంగా రాయడం నేర్చుకుంటే జీవితాంతం అందంగానే రాయవచ్చు.

- రెడ్డిమల్ల వెంకటస్వామి, తెలుగు ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

అందమైన రాత చాలా ముఖ్యం



చదవడంలో ఎన్ని మార్పులు వచ్చినా, అలాగే ఆన్‌లైన్ పుస్తకాలు చదివి పరీక్షలు రాసే పద్ధతి వచ్చినా చేతి రాతకు ఉండే ప్రాముఖ్యత నేటికీ తగ్గలేదు. ఇందుకోసం ప్రతీ విద్యార్థికి అందమైన చేతి రాత అనేది చాలా ముఖ్యం. పరీక్షల్లో రాసే జవాబులు అందంగా కనిపిస్తే పేపర్లు దిద్దే వారు గుర్తించి అదనపు మార్కులు వేసే అవకాశాలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు చేతి రాతకు కూడా ప్రాధాన్యవివ్వాలి. చదివింది, రాయడం వల్ల చాలా వరకు గుర్తుండిపోతుంది.

- పోగుల నాగరాజు, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

చేతి రాత.. మారాలి!

అక్షరాలు అందంగా ఉంటే మరిన్ని మార్కులు

- సాధన చేస్తేనే అలా రాయడం సాధ్యమంటున్న ఉపాధ్యాయులు
- పదో తరగతి విద్యార్థులకు మరింత మేలు
- 21 నుంచి వార్షిక పరీక్షలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్‌పై క్షణాల్లో అందమైన అక్షరాలను తీర్చిదిద్దగల ఈ ఆధునిక యుగంలో, చేతి రాతకున్న ప్రత్యేకత ఏమాత్రం తగ్గలేదు. చేతి రాతను బట్టి వారి గుణగణాలను చెప్పవచ్చనేది నానుడి. పరీక్షల వేళ జవాబు పత్రాలు దిద్దే ఉపాధ్యాయులకు అక్షరాలు అందంగా కనిపించేలా జవాబులు రాస్తే చాలు ఇక అదనపు మార్కులు సాధించవచ్చని వేరే చెప్పక్కర్లేదు. ఇందుకోసం విద్యార్థులు నిరంతరం సాధన చేస్తేనే అందమైన చేతి రాత సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతీ విద్యార్థి చేతి రాతకు ఉన్న గుర్తింపు గురించి తెలుసుకుని, అందుకు అనుగుణంగా మార్చుకుంటేనే భవిష్యత్తులో అన్నింటికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, పదో తరగతి పబ్లిక్ పరీక్షల వేళ చేతి రాతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పరీక్ష సమయంలో తడబాటు..

పరీక్షల గంట మోగింది. ఈనెల 21వతేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు పది పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు అంటే విద్యార్థులకు తెలియని భయం. ఆ భయంతో పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను రాసే క్రమంలో చేతి రాత వంకరటింకరగా వస్తుంది. ఇంకొందరు విద్యార్థులు ముందుగా అందంగానే మొదలు పెట్టినప్పటికీ, పోనుపోను అందంగా రాయలేక ఇష్టం వచ్చినట్లు రాస్తుంటారు. దీంతో ప్రశ్నలకు, జవాబులు సరిగా రాసినప్పటికి చేతి రాత సరిగా లేకపోవడంతో పేపర్లు దిద్దే వారికి సరిగా అర్థం కాకపోవడం వల్ల మార్కులు కూడా తగ్గే అస్కారం ఉంది. కాబట్టి ముందు నుంచే విద్యార్థులు చేతి రాతపై దృష్టి పెట్టాలి. చదివిన దానిని చేతి రాతతో రాయడం వల్ల మరిచిపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి రాయడం వల్ల అందమైన దస్తూరి రావడంతో పాటు చదివింది కూడా గుర్తుకు ఉండడానికి ఉపకరిస్తుంది. ఇలా రెండు రకాలుగా తోడ్పడుతుంది. అందమైన చేతి రాతతో అక్షరాలను పొందికగా ముత్యాల్లాగా పేర్చి ఆకర్షించే విధంగా జవాబులు రాయడం వల్ల పేపర్లు దిద్దే వారికి రాసిన జవాబులు అందంగా కనిపించడంతో అదనపు మార్కులు పొందే అవకాశాలు చాలా ఉన్నాయి.





ల్యాబర్తిలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు...

- విద్యార్థులు పరీక్షల్లో జవాబులు రాసేటపుడు అక్షరాలు పొందికగా, ముత్యాల్లాగా పేర్చినట్లు అందంగా కనిపించాలి. అదేవిధంగా స్పష్టంగా రాయాలి.
- ఒక్క పేజీలో కేవలం 16 నుంచి 18 లైన్లు మాత్రమే వచ్చే విధంగా రాయడం మంచిది.
- సమాధాన పత్రం పైకి, కిందికి పక్కలకు బార్డర్లకు వదిలి సమానంగా రాయాలి.
- పరీక్ష రాసేటపుడు ఒద్దికగా పూర్తిగా అనుకూలంగా కూర్చోని రాయాలి.
- తెలుగు, హిందీ, అక్షరాలను నాలుగు మి.మీ.లే, ఇంగ్లీష్ అక్షరాలను మూడు మి.మీ.లు ఉండే విధంగా చూసుకోవాలి.
- అక్షరాలు, పదాలు, లైన్‌ల మధ్య తగినంత గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.
- అక్షరాలను ఒత్తిపెట్టి రాయకూడదు. అలా రాయడం వల్ల పేజీ వెనుక భాగం వైపు కనిపిస్తుంది. దీని వల్ల వెనక వైపు ఉన్న రాత కూడా కనిపించకుండా పోయి నష్టపోవాల్సి వస్తుంది.
- గణితంలో సమీకరణాలు, సైన్స్‌లో పటాలు, పోటీభాగాలు అందంగా కనిపించే విధంగా రాయాలి.
- జవాబులు రాసేటపుడు వాటికి సైడ్ హెడ్డింగ్‌లు. పేరాలు చేయాలి.
- తెలుగు, ఇంగ్లీష్ రాసేటప్పుడు ఎప్పుడు సవ్య దిశలోనే రాయాలి.

చెట్ల నీడన చదువు..



చెట్ల నీడలో కూర్చొని పరీక్షకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

ఓవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇంటర్ విద్యార్థుల్లో వార్షిక పరీక్షల వేడి. ఈ క్రమంలో వారు మంచి మార్కులు పొందాలంటే అనువైన వాతావరణం ఉండాలి. ప్రకృతి కన్నా అనువైన వాతావరణం ఏముంటుంది. మరీ ముఖ్యంగా చెట్ల నీడలో చదువుకోవడం కంటే ఆనందం ఇంకేముంటుంది. అందుకే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైనారిటీ కళాశాలలో విద్యార్థులు ఇదిగో ఇలా అందరూ చెట్ల నీడన కుర్చీలు వేసుకుని కూర్చుని చదువుకుంటున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

తెలంగాణ సంస్కృతి అంటేనే పాట



మహబూబాబాద్‌లో జయరాజ్‌ను సన్మానిస్తున్న ఘనపురపు అంజయ్య దంపతులు

- కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్
- గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయం
- ప్రయుఖ కవి, గాయకుడు గొడిశాల జయరాజ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి అంటేనే పాట అని, ఏ ఉద్యమానికైనా ఆ పాట వెన్నుదన్నుగా, ముఖ్య భూమికగా నిలిచిందని ప్రముఖ కవి, గాయకులు గొడిశాల జయరాజ్ అన్నారు. తన సొంతూరు మహబూబాబాద్ పట్టణానికి విచ్చేసిన ప్రముఖ కవి, గొడిశాల జయరాజ్‌ను సోమవారం కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జయరాజ్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా నిలిచిన పోరాటయోధులకు గత పదేళ్లలో ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కవులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన పాటను తెలంగాణ గీతంగా ప్రకటించడం, తన కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్‌ను సినీ పరిశ్రమను విడదీయలేరని 'బండెనక బండి కట్టి.. ఏ బండ్లె పోతావు కొడుకో.. నైజాం సర్కరోడా' అంటూ గద్దర్ రాసిన, పాడిన అనేక పాటలు వెండితెరపై ఉర్రూతలూగాయని చెప్పారు. వెండి తెరనుంచి గద్దర్‌ను తొలగించలేరని, సినీ పరిశ్రమకు ఆయన పెద్ద దిక్కుగా నిలిచారని వివరించారు. సాంస్కృతిక చిహ్నంగా గద్దర్ పాటలు నిలిచాయని తెలిపారు. విద్యార్థి ఉద్యమాలు... విప్లవోద్యమమైనా.. తెలంగాణ ఉద్యమంలోనైనా కవిగా నిలబడడానికి ఘనపురపు అంజయ్య తనకు వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు.

ఉద్యానంలో యువజోష్

- కొత్తవంగడాలతో కాసుల పంట
- ప్రత్యామ్నాయ సాగులో ఆదర్శంగా రైతులు

తొర్రూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేయడమంటేనే అప్పులు, ఆత్మహత్యలు అంటూ వదిలేసి, చిన్న ఉద్యోగమైనచాలని పట్టణాల వైపు పరుగులు పెడుతున్న రోజులివి. కానీ వ్యవసాయం దండగ కాదు పండుగని నిరూపిస్తున్నారు ఈ యువ రైతులు. తమ తల్లిదండ్రులు నమ్ముకున్న భూమినే అమ్మలా భావించిన ఆ యువకులు ఉద్యానపంటల్లో కొత్త వంగడాలను ఎంచుకుంటూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేసి.. వ్యాపించే తెగుళ్ల, రోగాలతో రైతులు అప్పుల పాలువుతున్న నేపథ్యంలో అత్యాధునిక వంగడాలతో ఉద్యాన పంటల్లో.. మెళకువలు, బిందు సేద్యం, మల్చింగ్ విధానం పాటిస్తూ రాణిస్తున్నారు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొత్తగూడకు చెందిన కందాడ అశోక్‌రెడ్డి, గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువత రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి. వీరు తమతమ భూముల్లో లాభాలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు.



అమ్మాపురంలో రైతు అశోక్‌రెడ్డి సాగు చేస్తున్న బీరకాయ తోట



జీకే తండాలో రమేష్, రవి సాగు చేస్తున్న చామంతి పూలసాగు

సీజనల్‌గా పండిస్తూ లాభాల బాట

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామశివారు కొత్తగూడకు చెందిన కందాడ అశోక్‌రెడ్డి తనకు ఉన్న 10ఎకరాల భూమిలో తండ్రి వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించారు. ప్రత్యామ్నాయ పంటలతోనే లాభాలు వస్తాయని గ్రహించి ఐదేళ్లగా ఉద్యాన పంటలైన సీజనల్ కూరగాయల సాగు, పుచ్చకాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆరు ఎకరాల్లో పామాయిల్, రెండు ఎకరాల్లో బీరకాయ, కాకరకాయ, ఇతర సీజనల్ కూరగాయలు వేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్స్, మల్చింగ్ విధానాన్ని పాటిస్తూ నీటిని ఆదాచేస్తూ, కలుపు నివారణతో ఖర్చులు తగ్గిస్తూ, సాగు చేపడుతున్నారు. కూరగాయలు అధిక ధరలు పలికే వరంగల్, ఖమ్మం మార్కెట్లకు తరలించడంతో పాటు చిన్న, సన్నకారు వ్యాపారులు తోట వద్దకు వచ్చి తీసుకొని నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీరసాగు ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా పామాయిల్ పంటలో అంతర్‌పంటగా పుచ్చకాయల సాగును చేపట్టారు.

చామంతి సాగుతో ఆదాయం

తొర్రూరు మండలం గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువ రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి పూలసాగు చేయాలని హార్టికల్చర్ అధికారులను సంప్రదించారు. సాగుపై ఉన్న సబ్సిడీలను తెలుసుకొని పూల సాగులోనే బంగారు భవిష్యత్ ఉందని పూలసాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. రమేష్ తన అన్న రవితో కలిసి జీకే తండాలో ఉన్న ఆరు ఎకరాల్లో రెండు ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేసుకొని సీజన్ వారీగా చామంతి సాగు చేయడంతో పాటు మూడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేశారు. ఎకరం భూమిలో సరిపోయే 1.60 లక్షల మొక్కలను ఒక్కొక్కటి రూ.3చొప్పున కొనుగోలు చేసి నాటగా 100 నుంచి 120 రోజుల వ్యవధిలో చేతికి వస్తుంది. ఈ పువ్వులను ఎక్కువగా వివాహ, శుభకార్యాలకు, అలకంరణకు ఉపయోగించడంతో అధిక ధర పలుకుతోంది. చేతికి వచ్చిన పువ్వులను పది మొక్కల వరకు కటింగ్ చేసి బంచ్‌గా ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఎకరంలో సుమారు 15 వేల బంచ్‌లు దిగుమతి వస్తుంది. ఒక్క బంచ్ రూ.100 నుంచి రూ.150 ధరతో సీజన్ బట్టి విక్రయిస్తుంటారు. మార్కెటింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హైదరాబాద్, పెద్దపెద్ద డేకరేషన్ హాల్స్‌కు పంపిస్తుంటారు. మొక్కలుగా కోసి ఇవ్వడంతో పువ్వు వాడిపోకుండా పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఎకరానికి రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టగా, చామంతి పూలతో సంవత్సరానికి రూ.15 లక్షల ఆదాయం వస్తే, కూలీల ఖర్చు, ఎరువు మట్టి, ఇతర ఎరువుల ఖర్చు, మొక్కల ఖర్చు సుమారు రూ.8 లక్షల వరకు వస్తుంది. సుమారుగా సంవత్సరంలో రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీనికి తోడు మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట ఆదాయంతో పాటు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కూడా కలిసొస్తోంది. సంప్రదాయ పంటల కంటే ఉద్యాన పంట సాగుతోనే అధిక లాభాలు వస్తున్నాయని యువ రైతులు ధీమాగా చెబుతున్నారు. వీరితో పాటు ఇదే గ్రామానికి చెందిన గుగులోతు భిక్షం అనే రైతు ఎకరం భూమిలో బెండకాయ, బుడంకాయ, దోసకాయ సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్నారు.

కులవృత్తినే నమ్ముకున్నాడు.. కళాఖండాలు తీర్చిదిద్దుతున్నాడు..

సూక్ష్మకళలో సత్తా చాటుతున్న జయకుమార్



సూక్ష్మకళాకారుడు జయకుమార్



మైక్రో ఆర్టిస్ట్ జయకుమార్ తయారు చేసిన భారతచిహ్నం



సహజ పూలతో సూక్ష్మ బతుకమ్మ చిత్రం

నర్సంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదివిన అతడికి కొలువు దొరకలేదు. నిరుత్సాహ పడకుండా కులవృత్తినే జీవనోపాధిగా ఎంచుకున్నాడు. తండ్రి వద్ద స్వర్ణకారవృత్తిని ఒంటపట్టించుకున్నాడు. దీంతో ఏదో సాధించాలన్న పట్టుదలతో సూక్ష్మకళాఖండాలను రూపొందించడం ఆరంభించాడు నర్సంపేటకు చెందిన శ్రీరామోజు జయకుమార్. బలపాలపై, సబ్బుబిళ్ల తదితర వస్తువులపై అద్భుతాలు సృష్టిస్తున్నారాయన. నర్సంపేట పట్టణానికి చెందిన భిక్షమాచారి-భద్రమ్మ దంపతుల కుమారుడు జయకుమార్ 1995లో బలపాలపై అద్భుత కళాఖండాలను చెక్కి తన ప్రతిభకు సానబెట్టడం ప్రారంభించారు. నాడు ఈ సూక్షకళాకారుడి కళాఖండాలను, ప్రతిభను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పాఠకులకు తొలిసారి పరిచయం చేసింది. అప్పటి నుంచి నేటి వరకు ఆయన అనేక అద్భుత కళాఖండాలను సృష్టించి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు.

చాక్‌పీసులు, సబ్బులపై శిల్పాలు

జయకుమార్ పెన్సిళ్లు, చాక్‌పీస్‌లు, సబ్బుబిళ్లలపై శిల్పాలు చెక్కి జిల్లా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. జ్యోతిరావు పూలే అవార్డును కూడా దక్కించుకున్నాడు. 2005 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్‌కు 20 మిల్లీ గ్రాముల బంగారంతో క్రికెట్ బ్యాట్‌ను తయారు చేసి కంటికి కనిపించే అక్షరాలతో మాస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2007లో ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను 7మిల్లీ మీటర్ల ముత్యంపై చెక్కి ఓటీపర్ ద తాజ్ అని చెక్కారు. 2008 ఏప్రిల్‌లో భారత క్రికెట్ చరిత్రలో 600 వికెట్లు సాధించిన కుంబ్లేకు కేవలం 0.15మిల్లీ గ్రాముల బంగారంతో వికెట్లు, బంతి, బేల్స్‌ను తయారుచేసి ఆయనకు కంగ్రాట్స్ అని రాశారు. 2009లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి వైఎస్‌ఆర్‌కు చింతాకుపై శుభాకాంక్షలు తెలపారు. 2010లో పోస్టుకార్డుపై వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని గీశారు. తెలంగాణ ఉద్యమం ఎగిసిపడుతున్న సమయంలో వెంట్రుకపై జైతెలంగాణ నినాదాన్ని లిఖించాడు. బియ్యపు గింజపై తెలుగు అక్షరాలను చెక్కారు. యువకులు అడ్డదారిలో పయనించకుండా ఆధ్యాతిక భావన అలవర్చుకోవాలని ఓంకారంలో లింగాకారాన్ని తీర్చిదిద్దారు. ఈ విధంగా అనేక సూక్ష్మకళాఖండాలను చిత్రించి ప్రశంసలను అందుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులను జయకుమార్ అందుకున్నారు.

మ్యూజియం ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యం

నిరుపేద స్వర్ణకార కుటుంబంలో జన్మించిన జయకుమార్ కంటికి కనిపించని కళాఖండాలను అనేకం సృష్టించారు. ఎన్నో కష్టాల కోర్చి రూపొందించిన ఈ సూక్ష్మ కళాఖండాలను ప్రజలకు చూపించడానికి మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సాహం, ఆర్థిక సాయం అందించాలని, తాను నేర్చుకున్న సూక్ష్మ కళను పదిమందికి నేర్పడంతో పాటు మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని జయకుమార్ కోరుతున్నారు.



ఆకుపై గణపతి చిత్రం

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమాయత్తం కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి


రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఏప్రిల్, మే నెలల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. 16 సర్కిళ్ల అధికారులతో సీఎండీ సోమవారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. లోడ్ పెరిగే అవకాశం ఉన్న ప్రతీ చోట పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్‌లో కోతలు పూర్తైన తర్వాత వ్యవసాయ సర్వీసులను త్వరతగిన మంజూరు చేయాలన్నారు. అందుకు తగ్గట్లు మెటీరియల్ పూర్తి చేసుకోవాలన్నారు. బంచ్డ్ ఫీడర్లు ఉన్న చోట వీసీబీలు పెట్టి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వోల్టేజీని మెరుగుపరచడానికి లైన్‌లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

25 ఏళ్ల నాటి బ్యానర్ పునరావిష్కరణ



నాటి ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా, వినయ్‌భాస్కర్, నరేందర్ తదితరులు

మట్టెవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సుమారు 25 ఏళ్ల నాటి స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార బ్యానర్‌ను సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో పునర్ ఆవిష్కరించారు. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు జడ్పీటీసీగా పోటీ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి వస్త్రంపైన బ్రష్‌తో రాయించిన ఎన్నికల ప్రచార బ్యానర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దాచిపెట్టి ఉంచారు. ప్రస్తుతం పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న నేపథ్యంలో కేసీఆర్‌తో ఆ బ్యానర్‌ను పునరావిష్కరింపజేసి.. నాటి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిని కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



ఎస్పీఎం షెడ్‌లోకి అధునాతన పరికరాలు

ప్రారంభించిన డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ములుగురోడ్డులోని హనుమకొండ సర్కిల్ ఎస్పీఎం షెడ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి. మధుసూదన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ మరమ్మతుల్లో భాగంగా నాణ్యత పెంచడానికి అప్‌గ్రేడ్ చేసి ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ ద్వారా కొత్త పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. మెరుగైన పనితీరును అందించేందుకు ఈ పరికరాలు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్-2 సీజీయం రాజు చౌహాన్, ఐపీసీ అండ్ ఆర్ఏసీ సీజీఎం వెంకటరమణ, హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి. మధుసూదన్, యంఆర్‌టీ డీఈ దర్శన్‌కుమార్, ఎస్పీయం అండ్ టీఈ ర్ఈ ఏడీఈ డి. జానకిరామ్‌రెడ్డి, ఎస్పీయం ఏఈ మురళి, సబ్ ఇంజనీర్ యం. రఘు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య

మచ్చలను నిర్లక్ష్యం చేయొద్దు

హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్పర్శలేని రాగి, తెలుపు రంగు మచ్చలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా స్వచ్ఛందంగా ఆరోగ్య సిబ్బందికి తెలుపాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. కుష్టువ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించేందుకు సోమవారం నుంచి జరుగుతున్న ఇంటింటి సర్వేను బాలసముద్రంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో వివక్షకు గురవుతామన్న ఆలోచనతో బయటకు చెప్పకపోవడంతో వ్యాధి ముదురుతోందని, స్వచ్ఛందంగా స్పర్శలేని మచ్చ లున్నవారు ముందుకు వచ్చి ఆదిలోనే చికిత్స తీసుకుంటే పూర్తిగా నయ మయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్టువ్యాధి సోకిన వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, వైద్యాధికారి డాక్టర్ గీత, జిల్లా మాస్‌మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, బజిలి సమ్మి, విప్లవ్ కుమార్, రాజేష్, అరుణ, స్వప్న, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా నీటి సరఫరా చేయాలి

» మేయర్ గుండు సుధారాణి » వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా వరంగల్ నగర ప్రజలకు నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని వరంగల్ మేయర్ గుండు సుధారాణి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌లు జరుగుతున్న పనులను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. వడ్డెపల్లి, బాలాజీనగర్, కాజీపేట, విష్ణుపురి, సోమిడిలో గల ఈఎస్ఎల్ఆర్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు సమర్థవంతంగా నిర్వర్తించాలని అక్కడి సిబ్బంది సూచించారు. వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ ఫోల్‌ను తొలగించాలని ఆదేశించారు. విష్ణుపురిలో సిబ్బంది చేస్తున్న సేవలను ప్రశంసించారు. బల్దియా కాకుండా ఇతర శాఖల వారు అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో బల్దియా నుంచి ఎన్‌వోసీ తీసుకున్న తర్వాతనే పనులు చేపట్టాలన్నారు. కార్పొరేటర్లు సునీల్, విజశ్రీ రజాలి, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, ఈఈలు మహేందర్, మాధవిలత, డీఈలు సారంగం, కార్తీక్‌రెడ్డి, ఏఈ సరిత పాల్గొన్నారు.

ఆపద మిత్రులకు పరిపూర్ణ శిక్షణ ఇవ్వాలి

హసన్‌పర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించే విధంగా ఆపద మిత్రులకు పరిపూర్ణమైన శిక్షణ అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం హసన్‌పర్తి టీటీడీసీ శిక్షణ కేంద్రంలో వరంగల్ జిల్లాకు సంబంధించిన ఆపదమిత్ర పథకం ద్వారా ఎంపికైన 120 మంది వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో వివిధ విపత్తులకు సంబంధించి అవగాహన, ఆపదలో ఉన్నవారిని ఏవిధంగా రక్షించాలో శిక్షణ కార్యక్రమం ద్వారా నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా అగ్నిమాపక నియంత్రణాధికారి సతీష్, జిల్లా ప్రణాళిక అధికారి గోవింద రాజన్, కలెక్టరేట్ అగ్నిమాపక కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేయూలో రాజ్యాంగంపై జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19న 'భారత రాజ్యాంగం- మైలురాళ్ల సమస్యలు సవాళ్లు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ, మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ జి. చంద్రయ్య, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర గ్రంథాలయం సంస్థ ఛైర్మన్ డాక్టర్ మహ్మద్ రియాజ్, ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ ఎస్.ద్వారకనాథ్, కేయూ మాజీ రిజిస్ట్రార్ జి.శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని రాజమణి కోరారు.

పరికిపండ్ల వేణు సేవాదర్శిని పుస్తకావిష్కరణ

హసన్‌పర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సామాజిక సేవకులు పరికిపండ్ల వేణు షష్టి పూర్తి మహోత్సవ కార్యక్రమం భీమారంలోని పొద్దుటూరు గార్డెన్స్‌లో నిర్వహించారు. నిట్ విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, కోనసీమ జిల్లా రావులపాలెం నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త చప్పిడి వరప్రసాద్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేణు 60 సంవత్సరాల జీవిత విశేషాలు, ఉపాధ్యాయుడిగా వివిధ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల గుణాత్మక విద్యాభివృద్ధికి చేసిన కృషి, సమాజహితం కోసం చేసిన వివిధ సామాజిక సేవల వివరాలతో అడ్లూరి వెంకటేశ్వర్‌రావు, కేబి ధర్మప్రకాష్‌ల సంపాదకత్వంలో రూపొందించిన సంకలనం పరికిపండ్ల వేణు సేవాదర్శిని పుస్తకావిష్కరణ చేశారు. వరంగల్ కేంద్ర ప్రతినిధి అనిల్‌ప్రసాద్ పుస్తకపరిచయాన్ని నిర్వహించారు. సుమలతచే రచించబడి విజ్ఞాన ప్రసార్ ద్వారా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ప్రసారమైన ధారావాహిక సైన్స్ నాటకాల సంకలనం, రేపటి ప్రపంచం, కృత్రిమ మేథ, రేడియో సైన్స్ నాటికల పుస్తకావిష్కరణ జరిగింది. అనంతరం ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేణుసుమలత దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు రతన్‌సింగ్‌ఠాకూర్, రామ్‌కిషన్, కాజీపేట పురుషోత్తం, పెండ్యాల బ్రహ్మయ్య, నారాయణగిరి వీరన్న, శ్రవణ్‌కుమార్, మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పరికిపండ్ల అశోక్, విద్యాసాగర్‌రెడ్డి, కాసాగాని కుమారస్వామి, లయన్ కమలాకర్, చంద్రశేఖర్, రావుల శ్రీధర్‌తో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు, వినియోగదారుల సంఘం బాధ్యులు, శాస్త్ర మిత్ర బృందం పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఉజ్వల భవిష్యత్

» ఇంజనీరింగ్ కళాశాలను అభివృద్ధి చేస్తా..
» కాకతీయ యూనివర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
» కనులపండువగా కో ఎడ్ ఇంజనీరింగ్ కళాశాల స్పోర్ట్స్ డే

కేయూ క్యాంపస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభతోనే ఇంజనీరింగ్ రంగంలో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోదించారు. సోమవారం రాత్రి కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో స్పోర్ట్స్, కల్చరల్ సంబురాలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ అధ్యక్షతన జరిగిన సంబురాల్లో కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అత్యున్నత ప్రతిభతోనే ఇంజనీరింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్ పొందుతామని చెప్పారు. ప్రపంచలో 40 శాతం మంది ఇంజనీరింగ్ యువత ఉద్యోగ, ఉపాధి రంగాల్లో దూసుకుపోతున్నారని వెల్లడించారు. కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ పరంగా, అడ్మినిస్ట్రేషన్ పరంగా ఉన్నతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జాతీయ హాకీ జట్టు రిటైర్డు కోచ్ పి. మధుకరణ్ మాట్లాడుతూ.. యువత సక్సెస్‌కు చదువుతో పాటు క్రీడలు అత్యంత ప్రాధాన్యత వహిస్తాయని చెప్పారు. కేయూ పాలక మండలి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

సభ్యులు చిర్ర రాజుగౌడ్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ రంగంలో యువతకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధిలో అధ్యాపకులు, విద్యార్థుల పాత్ర గొప్పదన్నారు.

హోరెత్తించిన విద్యార్థుల డ్యాన్స్‌లు

కళాశాల స్పోర్ట్స్, కల్చరల్ డేను పురస్కరించుకుని ఇంజనీరింగ్ విద్యార్థులు అబ్బురపరిచే నృత్యాలు చేశారు. సంప్రదాయ నృత్యాలతో పాటు, కొత్త పాటలతో ఆడిపాడారు. తోటి విద్యార్థుల ఈలలు, కేకలతో క్యాంపస్ హోరెత్తింది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా క్రికెట్‌తో పాటు ఇతర క్రీడాల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల జట్లకు బహుమతులను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీహెచ్. రాధిక, డాక్టర్ ఎమ్డీ ఆసీ ఇక్బాల్, డాక్టర్ వి. మహేందర్, డాక్టర్ శ్రీధర్‌కుమార్, సుమలత, డాక్టర్ దాసరి శైలజ, శిరీష, ఇ. రాజేశ్వరి, పర్విన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, లైబ్రరీయన్ డాక్టర్ ఎన్.సుజాత, సూపరింటెండెంట్ బొల్లెపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, ఇంద విజయరావు, మహ్మద్ యూనిస్, పున్నంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



మదీనా మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

హనుమకొండ చౌరస్తా, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని మదీనా మసీద్ ఎదుట మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలు, మతపెద్దలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అఖిల భారత ముస్లిం వ్యక్తిగత చట్టం బోర్డు ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ముస్లిం హక్కుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌస్ మొయినుద్దీన్, జావిద్, ఎస్‌డీ. అన్వర్ పాల్గొన్నారు.

మక్కా మసీద్ (బ్లూబర్డ్స్)రాయపుర వద్ద..

హనుమకొండ 10వ డివిజన్ రాయపురలోని మక్కా మసీద్ (బ్లూబర్డ్స్) వద్ద ముస్లిం యూనిటీ, డెవలప్‌మెంట్ మూమెంట్ అడ్వైజర్ మహ్మద్ అబ్దుల్ అలీ జుబేర్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు నిరసన తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షించాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

జానపద గిరిజన విజ్ఞాన పీఠం అధిపతి బాబురావు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని, వారిని ప్రోత్సహించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం హంటర్‌రోడ్‌లోని గిరిజన విజ్ఞానపీఠంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద పరిశోధక విద్యార్థిని పతకమూడి విజయశాంతిని శాలువాతో సన్మానించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమంతుల దామోదర్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ బాసాని సురేశ్, అబ్బు గోపాలరెడ్డి, డాక్టర్ గంపా సతీష్, సునంద ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానించి ఆర్థిక సాయం అందిస్తున్న బాబురావు

నాలుగో రోజూ తగ్గని భక్తులు సందడి

హసన్‌పర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాల క్రాస్‌రోడ్డు ఎర్రగట్టు వెంకన్న జాతరలో భాగంగా సోమవారం నాలుగో రోజు స్వామివారికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకట్రావ్‌తో పాటు 14 మంది ఆలయ ధర్మకర్తల సమక్షంలో ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారథాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు స్వామివారికి పాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎర్రగట్టు జాతర ఉత్సవ కమిటీ ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, శీలం రమేష్, కనపర్తి రాజు, పోలరాజు శ్యామల, చింతల రమేష్, బిగుళ్ల సురేష్, మానుపాటి విజెందర్, శాగంటి సదానందం, తోట శ్రీనివాస్, కొండమీది సంతోష్, అటికం శ్రీనాథ్ గౌడ్, సంగాల ప్రశాంత్‌కుమార్, అభినేష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ధోనగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

న్యూశాయంపేట, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : న్యూశాయంపేటలోని ధోనగుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ గ్రంధి సత్యవతి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భద్రకాళి దేవస్థాన ఈవో శేషుభారతి భద్రకాళి అమ్మవారి తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. న్యూశాయంపేటతో పాటు, చుట్టు పక్కల కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విమానాశ్రయానికి రాణిరుద్రమదేవి పేరు పెట్టాలి

జాగృతి రాష్ట్ర ప్రతినిధి మారిపెల్లి మాధవి

వడ్డెపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని మామునూరుకు మంజూరైన విమానాశ్రయానికి కాకతీయ సామ్రాజ్య ఆదర్శ వనిత రాణి రుద్రమదేవి పేరును పెట్టాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రతినిధి మారిపెల్లి మాధవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాణి రుద్రమదేవి విమానాశ్రయంగా నామకరణం చేసి కాకతీయ వారసులకు సముచిత గౌరవం కల్పించాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు తాను డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. మామునూరు విమానాశ్రయానికి రుద్రమదేవి పేరు పెట్టే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధాని నరేంద్రమోదీపై ఒత్తిడి తీసుకురావాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి జిల్లా మహిళా నేతలు నూకల రాణి, పి. మంజులరావు, కేతిరి సమ్మక్క, గుములాపురం హైమావతి, నేరెళ్ల సరోజన, కన్నం వనమాల, కూచన రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి

హనుమకొండ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థిని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఉత్తిష్ట గణపతికి గణపతిసూక్త మూలమంత్ర పఠనంతో స్వామివారికి హరిద్ర కుంకుమ, రక్తచందనం, గ్రంధ విలేఖనంతో సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి గరికతో నామాలు చెబుతూ పూజించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, పెండ్యాల సందీప్‌శర్మ, పానుగంటి ప్రణవ్‌లు వైదిక కార్యక్రమం అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పూజారి గంగు ఉపేంద్రశర్మ ←



తేజస్వినిరెడ్డిని సన్మానిస్తున్న చైతన్య యూత్, 57వ డివిజన్ సభ్యులు

గ్రూప్ -1 విజేత తేజస్వినిరెడ్డికి సన్మానం

హనుమకొండ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 57వ డివిజన్ గాంధీనగర్ కాలనీకి చెందిన జిన్నా విజయపాల్‌రెడ్డి-హేమలత దంపతుల కూతురు జిన్నా తేజస్విని రెడ్డి ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించింది. కాగా, సోమవారం 57వ డివిజన్‌లోని చైతన్య యూత్ అసోసియేషన్ కన్వీనర్ మాడిశెట్టి వీరేందర్ ఆధ్వర్యంలో జిన్నా తేజస్వినిరెడ్డిని ఘనంగా సన్మానించారు. జిన్నా తేజస్వినిరెడ్డి గతంలో గ్రూప్-2 ద్వారా పంచాయతీ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా రేగొండ మండలంలో పని చేస్తూనే కష్టపడి గ్రూప్-1 పరీక్షల్లో ర్యాంక్ సాధించడం గర్వకారణమని కాలనీ పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, దుగ్యాల వేణుగోపాలరావు, నక్క లింగయ్య యాదవ్, బత్తిని శ్రీనివాస్, కాసర్ల వెంకటేశ్వర్‌రావు, ఆకుల శ్యాంప్రసాద్, చిట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, కొత్త కరుణాకర్, తిరుపతిరెడ్డి, రాంబాబు, రమేష్, శ్రీను, సత్యనారాయణరెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరితో నష్టపోతున్న విద్యార్థులు

మాజీ ఎంపీ సీతారాంనాయక్

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో కష్టాలు పడి యువత డిగ్రీలు పూర్తి చేస్తున్నా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించ కపోవడంతో నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు నష్టపోతున్నారని మాజీ ఎంపీ సీతారాంనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అవలంబిస్తున్న తీరుతో ఉన్నత ఉద్యోగం, ఉన్నత విద్యలో వచ్చిన సీట్లను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లోనే కాకుండా ప్రభుత్వ కళాశాలల్లో ఉండటం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా సర్టిఫికెట్స్ ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

రోడ్లపై సైన్ బోర్డులు, బారికేడ్ల ఏర్పాటు



భట్టుపల్లి జంక్షన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

మడికొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొన్ని చోట్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ చొరవ చూపి ప్రమాదాల నివారణ కోసం ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి, అమ్మవారిపేట, కడిపికొండ తదితర గ్రామాల్లోని రోడ్లపై స్టేషన్ పరిధిని తెలిపే బోర్డులతో పాటు పలు రోడ్డు క్రాసింగ్స్, జంక్షన్ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన స్టాపర్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తొందరగా వెళ్లాలని వితిమీరిన వేగంతో కాకుండా కనీస జాగ్రత్తలతో వాహనాలను నడిపి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఇద్దరికి గాయాలు

మడికొండ/హసన్‌పర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. మడికొండ పరిధిలో రోడ్డు ప్రమాదంపై ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా చిల్పూర్ మండలం నష్కల్‌కు చెందిన చేగొండి సంపత్ రెండో కుమారుడు వినయ్(21), ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన మామిండ్ల కొమురెల్లి కుమారుడు అరవింద్ కలిసి ఆదివారం రాత్రి 11 గంటలకు బైక్‌పై నష్కల్ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో మడికొండ ఎలుకుర్తి క్రాస్‌రోడ్డు వద్ద కోళ్ల లోడ్‌తో ఎదురుగా వస్తున్న వాహ నం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వినయ్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా అరవింద్ గాయాలపాలయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన అరవింద్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. వినయ్ తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే, హసన్‌పర్తి రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. పడమర కోట ఖిలా వరంగల్‌కు చెందిన మేకల సురేష్ కుమారుడు సుశాంత్ (19) పరకాల పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16న తన స్నేహితులైన తాండ్ర విజయ్ (18), చెన్నగుల వర్ధన్‌తో కలిసి ఎర్రగట్టు జాతరకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ముచ్చర్ల క్రాసు కొత్త రోడ్డు నిర్మాణం దగ్గర వీరి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాల పాలైన వీరిని స్థానికులు 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సుశాంత్, విజయ్ మృతి చెందగా వర్ధన్ చికిత్స పొందుతున్నాడు. సుశాంత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాడని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంకు 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజయ్ భాస్కర్ సంఘీభావం తెలిపారు. మాయమాటలు చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి పబ్బం గడుపుతున్నారని మాదిగలనే కాకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లు తెలిపారు. ఎస్సీల వర్గీకరణకు మాజీ సీఎం కేసీఆర్ కేంద్రంలోని ప్రధానమంత్రిని అనేక మార్లు కలిసి వర్గీకరణచేపట్టాలని కోరినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న దాస్యం విజయ్ భాస్కర్

ముఖ్యమంత్రి దుశ్చర్యలను ఎండగడతాం..

కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఓయూలో విద్యార్థుల ధర్నాలను నిషేధిస్తూ వీసీ వెలువరించిన జీవోను ఉపసంహరించుకోవాలని లేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యలను ఎండగడుతామని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్రం హెచ్చరించారు. సోమవారం కేయూ లైబ్రరీ ఎదుట బీఆర్ఎస్వీ నేతృత్వంలో ఓయూ జీవోపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్, శరత్‌చంద్ర మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అడ్డుకునే అక్రమ జీవోలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నేతలు పస్తం అనిల్, రసూరి రాజేశ్, మహేశ్, గణేశ్, అఖిల్, సునీత్, హరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



యువత గుండె ఆగిపోతోందా?

ఉరకలేసే వయసులో చురుగ్గా పని చేయవలసిన గుండెలు అకస్మాత్తుగా ఆగిపోతున్నాయి. కొన్ని క్షణాల ముందు వరకూ చలాకీగా, హుషారుగా కనిపించిన యువత హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్న సంఘటనలు చూస్తున్నాం. ఈ సమస్య వెనకున్న కారణాలు, నివారణోపాయాల గురించి ప్రముఖ హృద్రోగ వైద్యులు స్టార్ హాస్పటల్స్ జాయింట్ ఎం.డీ. డాక్టర్ రమేష్ గూడపాటి వివరిస్తున్నారు.



గత మూడు నాలుగు దశాబ్దాలుగా భారతీయుల్లో గుండెపోటు ముప్పు బాగా పెరిగింది. అంతే కాకుండా గుండెపోటు వచ్చే వయసు కూడా బాగా తగ్గింది. మునుపు 60 ఏళ్లు పైబడిన వాళ్లలో ఈ సమస్యను చూసేవాళ్లం. కానీ ఇటీవలి కాలంలో 30 అంతకంటే తక్కువ వయస్కులు గుండెపోటుకు లోనవుతున్న సంఘటనలను చూస్తున్నాం. ఇందుకు కారణాలు లేకపోలేదు. అమెరికన్లు, యూరోపియన్లు, చైనీయులు, జపనీయులతో పోలిస్తే, భారతీయులు జన్యుపరంగా గుండె జబ్బులకూ, గుండె పోట్లకూ లోనయ్యే అవకాశాలు ఎక్కువ. ఇక్కడున్న భారతీయులే కాదు, విదేశాల్లోనే పుట్టి పెరిగి, ఆయా జీవనశైలులను అనుసరించే భారతీయులు సైతం, గుండె జబ్బుల బారిన పడుతూ ఉండడాన్ని బట్టి, మన భారతీయులకు జన్యుపరమైన గుండె జబ్బుల ముప్పు విదేశీయుల కంటే విదేశీయుల కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని అర్థం చేసుకోవచ్చు. అయితే మనకు జన్యుపరమైన గుండెజబ్బుల ముప్పు ముందు నుంచే పొంచి ఉండడానికి కొన్ని కారణాలున్నాయి. అవేంటంటే...

- **పొట్ట కొవ్వు :** మనకు పొట్ట దగ్గర కొవ్వు ఎక్కువగా పేరుకుంటూ ఉంటుంది. లావు పొట్ట కలిగి ఉన్న వాళ్లలో, అంతర్గత అవయవాల్లో కూడా కొవ్వు పేరుకుని ఉంటుంది. ఈ కొవ్వు శరీరానికి హాని కారకమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరిగి మధుమేహం బారిన పడడం, మంచి కొలెస్ట్రాల్ తక్కువగా, చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే జన్యుపరంగానే మనలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉంటాయి.

- **చెడు కొలెస్ట్రాల్ :** మూడింట ఒక వంతు కొలెస్ట్రాల్ మనకు మన జీవనశైలి నుంచే అందుతుంది. మనం తినే ఆహారం, చేసే వ్యాయామం మీదే ఈ కొలెస్ట్రాల్ మోతాదు ఆధారపడి ఉంటుంది. రెండింట మూడో వంతు కొలెస్ట్రాల్ మన శరీరంలోనే తయారవుతుంది. ఈ కొలెస్ట్రాల్ మోతాదును మన జన్యువులు నిర్థారిస్తాయి. అయితే ఈ మొత్తం కొలెస్ట్రాల్‌లో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం, అది ఎక్కువ హానికారకమైన కోవకు చెంది ఉండడం వల్ల సహజంగానే గుండెకు జరిగే చేటు ఎక్కువ.

- **మధుమేహం :** మనకు మధుమేహం ముప్పు కూడా ఎక్కువే! విదేశీయులతో పోలిస్తే, వాళ్ల కంటే మనకు మధుమేహం వచ్చే అవకాశాలు 20% ఎక్కువ.

ముప్పు పెరిగిందిలా...

గుండె జబ్బుల ముప్పును పెంచే ఈ కారణాలు ఇప్పుడు కొత్తగా మనలో చోటుచేసుకున్నవి కావు. ఇవన్నీ ప్రారంభం నుంచీ ఉన్నవే! అయినా ఇటీవలి కాలంలో, మరీ ముఖ్యంగా యువతలో గుండెపోటు ముప్పు పెరగడానికి కారణం మన జీవనశైలి మార్పులే! మారుతున్న మన జీవనశైలి గుండెపోటు ముప్పును మరింత పెంచుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చి చూసుకుంటే పట్టణాల్లో నివసించే వారిలో ఈ ముప్పు ఎక్కువగా ఉండడాన్ని బట్టి పట్టణ జీవనశైలి కూడా గుండెపోట్లకు కారణమవుతోందని నిర్థారించుకోవచ్చు. శారీరక వ్యాయామం లోపించడమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే మన ఆహారశైలి కూడా బాగా మారిపోతోంది. స్విగ్గీలు, జొమాటోలతో బయటి ఆహారం చిటికెలో చేతికందుతోంది. అలాగే రుచిగా ఉండే పదార్థాలన్నీ ఎక్కువ చక్కెరలు, నూనెలతో తయారవుతూ ఉంటాయి. కాబట్టి వాటినే మనం ఎక్కువగా ఎంచుకుంటూ ఉంటాం. ఊబకాయం, మధుమేహాల పెరుగుదలకు ఇలాంటి ఆహారశైలే కారణం. అలాగే ప్రస్తుతం పోటీతత్వం విపరీతంగా పెరిగింది. వృత్తిలో, చదువులో ముందుండడం కోసం పెట్టే ఈ పరుగులో మనకు తెలియకుండానే ఒత్తిడి పెరుగుతోంది. వీటితో పాటు మద్యపానం, ధూమపానం లాంటి అలవాట్లు కూడా గుండెజబ్బుల ముప్పుకు తోడవుతున్నాయి. కంటికి కనిపించని మరొక భూతం, వాతావరణ కాలుష్యం. అయితే పెరిగే వయసు (60 ఏళ్లు దాటిన తర్వాత గుండెపోటుకు గురయ్యే ముప్పు పెరుగుతుంది), గుండెజబ్బుల కుటుంబ చరిత్ర కలిగి ఉండడం (60 ఏళ్ల లోపు గుండెపోటుకు గురవడం) లాంటి సరిదిద్దే వీలు లేని కారణాలను మినహాయించి, ధూమపానం, మధుమేహం, అధిక రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్, అధిక బరువు, శారీరక వ్యాయామం లోపించడం లాంటి సరిదిద్దే వీలున్న వాటి మీద దృష్టి పెట్టగలిగితే కచ్చితంగా గుండెపోట్లను నివారించుకోగలుగుతాం!



అపోహలు

- లక్షణాలేవీ లేవు కాబట్టి నాకు గుండె సమస్య ఉండదు అనుకోవడం అపోహ మాత్రమే!
- ఫిట్‌గా ఉన్నంత మాత్రాన, ఆరోగ్యకరమైన ఆహారశైలిని అనుసరిస్తున్నంత మాత్రాన గుండె సమస్యలు రావనుకోవడం కూడా అపోహే!
- మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ సమస్యలు లేవు కాబట్టి గుండె జబ్బులు రావు అనుకోవడం కూడా అపోహే!
- కొవిడ్ తర్వాత గుండెజబ్బులు పెరిగాయి అన్నది కూడా అపోహే! కొవిడ్‌తో, కొవిడ్ వ్యాక్సిన్‌తో ముడిపడిన గుండెపోట్లు ఆ కాలానికే పరిమితం. ఆ ప్రభావం ఇప్పటివరకూ కొనసాగే వీలు లేదు.

నివారణ మన చేతుల్లోనే...

యువతలో గుండెపోటుకు వేర్వేరు కారణాలుంటాయి. గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో క్రమేపీ అడ్డంకులు ఏర్పడడం వల్ల ప్రధానంగా గుండెపోటు వస్తుంది. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్న కొందర్లో అకస్మాత్తుగా గుండెపోటు తలెత్తే అవకాశాలు కూడా ఉంటాయి. జిమ్‌లో వ్యాయామం చేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయే వాళ్లు ఈ కోవకు చెందుతారు. కొందర్లో వ్యాయామం చేసే సమయంలో గుండె రక్తనాళాలు చిట్లి, వాటిలో రక్తపు గడ్డలు ఏర్పడి గుండెపోటు రావచ్చు. కొందర్లో ముందు నుంచే గుండె కండరాల బలహీనత లాంటి సమస్యలు ఉండడం వల్ల గుండె పోటు తలెత్తవచ్చు. అయితే ఈ ముప్పులను నివారించడం కోసం పుట్టుకతోనే సంక్రమించుకున్న జన్యువులను మార్చుకోలేం కాబట్టి కనీసం జీవనశైలినైనా మార్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. అదెలాగంటే...

- ఏం తింటున్నామో గమనించుకోవాలి. ఆరోగ్యాన్ని అందించే ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి
- వారంలో ఐదు రోజులు కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి
- ప్రతి రోజూ వ్యాయామానికి సమయాన్ని కేటాయించలేని వాళ్లు వారం మొత్తంలో రెండు, మూడు విడతల్లో రెండున్నర గంటల వ్యాయామాన్ని పూర్తి చేయాలి
- శరీరాన్ని చురుగ్గా ఉంచే ఏరోబిక్ వ్యాయామం (నడక, క్రీడలు, పరుగు)తో పాటు, బరువులెత్తే వ్యాయామాలు కూడా చేయాలి

నిద్ర అత్యవసరం

ఆరు గంటల నిద్ర ఆరోగ్యానికి అవసరం. నిద్రలేమి వల్ల ఒత్తిడి పెరుగుతుంది. జీవనశైలి దెబ్బతింటుంది. ఈ పరిస్థితి గుండెపోటుకు దారితీస్తుంది. కాబట్టి నిద్ర విషయంలో రాజీ పడకూడదు. అలాగే ఒత్తిడిని కూడా అదుపులో పెట్టుకుంటూ ఉండాలి. కుటుంబసభ్యులు, స్నేహితులతో కాలక్షేపం చేయడం, పని ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం కొన్ని పనులను కింది స్థాయి ఉద్యోగులతో పంచుకోవడం చేయాలి. అలాగే వాస్తవిక అంచనాలతో లక్ష్యాలను ఏర్పరుచుకోవడం అలవాటు చేసుకోవాలి. సాధారణంగా ఒత్తిడిలో ఉన్నప్పుడు, ఒత్తిడిలో ఉన్నాను కాబట్టి వ్యాయామం చేయలేను అనే వాళ్లుంటారు. కానీ నిజానికి వ్యాయామంతో విడుదలయ్యే ఫీల్ గుడ్ హార్మోన్లతో ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించే సాధనంగా వ్యాయామాన్ని ఉపయోగించుకోవాలి. అలాగే తాజా పండ్లు, కూరగాయలు లాంటి ఆరోగ్యకరమైన ఆహారం కూడా ఒత్తిడిని తగ్గిస్తుంది.

పరీక్షలు క్రమం తప్పకుండా...

గుండె పోటుకు దారితీసే ముప్పును ముందుగానే పసిగట్టాలంటే పరీక్షలు చేయించుకోవాలి. 25 నుంచి 30 ఏళ్ల వయస్కులు ఏడాదికి ఒకసారైనా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఆ పరీక్షల్లో కొలెస్ట్రాల్, రక్తపోటు, మధుమేహం ముప్పులు కనిపిస్తే, అప్పటి నుంచి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలను కొనసాగిస్తూ ఉండాలి. ముప్పు లేని వాళ్లు ఐదేళ్లకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. 50 ఏళ్లు దాటిన వాళ్లు, మధుమేహం, అధికరక్తపోటు ఉన్న వాళ్లు, ఊబకాయులు, ధూమపానం అలవాటున్నవాళ్లు ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అలాగే 60 ఏళ్లలోపు గుండె జబ్బుల కుటుంబ చరిత్ర కలిగి ఉన్నవాళ్లు కూడా పాతికేళ్ల వయసు నుంచి, ఏడాదికోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఇలా పరీక్షలు చేయించుకుంటూ ఉండడం వల్ల ముందస్తుగానే ఆరోగ్య సమస్యలను కనిపెట్టగలుగుతాం! గుండెజబ్బులను ప్రారంభ దశల్లోనే గుర్తించగలుగుతాం!

బీజాలు బాల్యంలోనే....

గుండెపోటు బీజాలు బాల్యంలోనే నాటుకుంటాయి. రెండు, మూడేళ్ల వయసు పిల్లల్లో కొలెస్ట్రాల్ నిల్వలు పేరుకుపోవడం మొదలుపెట్టి, వయసు పెరిగేకొద్దీ తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతో ఒరిగే ప్రయోజనాల గురించి వివరించాలి. వీడియోగేమ్స్, ఫోన్లు, టీవిల కాలక్షేపానికి బదులుగా ఆరుబయట ఆటలకు పిల్లలను ప్రోత్సహించాలి. ఇలా ఆరోగ్యకరమైన ఆహారాన్నీ, వ్యాయామాన్నీ జీవనశైలిలో భాగం చేయగలిగితే, పెరిగి పెద్దయ్యాక కూడా అదే జీవనశైలిని కొనసాగించగలుగుతారు. ఫలితంగా గుండెపోట్ల ముప్పు నుంచి తప్పించుకోగలుగుతారు.



మద్యం పరిమితంగానే...

మద్యపానం కచ్చితంగా ఆరోగ్యానికి ఎంతో కొంత నష్టం చేకూరుస్తుంది. అయితే ఆ అలవాటున్న వాళ్లు గుండెకు చేటు కలగకుండా ఉండడం కోసం, మద్యాన్ని పరిమితంగా తీసుకోవడం ఉత్తమం. వేర్వేరు మద్యాల్లో ఆల్కహాల్ మోతాదులు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఆల్కహాల్ మోతాదు ఆధారంగా మద్యం పరిమితిని నిర్దేశించుకోవాలి. విస్కీ, రమ్, బ్రాండీల్లో ఆల్కహాల్ మోతాదు 40% మేరకు ఉంటుంది కాబట్టి వీటిని రోజుకు 90 మిల్లీ లీటర్లకే పరిమితం చేయాలి. బీర్ (7% - 9%), వైన్ (20%) లాంటివి వాటిలోని ఆల్కహాల్ మోతాదును బట్టి 180 మిల్లీలీటర్లకు మించకుండా చూసుకోవాలి. మహిళలు దీన్లో సగం మాత్రమే తీసుకోవాలి. అయితే మితిమీరిన మద్యం ప్రమాదకరం అనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

ఏది నిజం?

కాఫీ తాగొచ్చా?

అదనపు కాఫీతో ఇనుము శోషణ, ఎముకల సాంద్రతలు తగ్గడంతో పాటు నిద్రలేమి కూడా వేధిస్తుంది. అయితే కొందరికి కాఫీతో ఇంతకు మించిన చేటు కూడా జరుగుతుంది. ఆ కోవకు చెందిన వాళ్లు ఎవరంటే...

- ఆందోళన, నిద్రలేమిలతో బాధపడుతున్న వాళ్లలో కాఫీతో ఆ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. కాబట్టి ఈ సమస్యలున్న వాళ్లు కాఫీని రోజుకు రెండు కప్పులకే పరిమితం చేయాలి
- కాఫీ తాత్కాలికంగా రక్తపోటును పెంచుతుంది. కాబట్టి అధిక రక్తపోటు సమస్య ఉన్నవాళ్లు కాఫీకి దూరంగా ఉండడమే మేలు
- మితిమీరిన కాఫీ, గర్భంలో పెరిగే పిండం ఎదుగుదలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి గర్భిణులు కాఫీ తాగడం తగ్గించడం మంచిది
- హృద్రోగుల్లో కాఫీలోని కెఫీన్ వల్ల గుండె లయలో హెచ్చుతగ్గులు, గుండెదడ లాంటి లక్షణాలు పెరుగుతాయి. కాబట్టి ఈ కోవకు చెందినవారు కాఫీని వీలైనంతగా తగ్గించాలి
- జీర్ణ సమస్యలను ఎదుర్కొంటున్నవాళ్లు కాఫీ జోలికి వెళ్లకపోవడమే మేలు.

ఏ కాఫీ మేలు?



కొందరు బ్లాక్ కాఫీ ఇష్టపడతారు. ఇంకొందరు పాలు, చక్కెర కలిపి తయారుచేసిన కాఫీని ఇష్టంగా తాగుతారు. ఈ రెండింట్లో ఏది ఎక్కువ ఆరోగ్యకరం? బ్లాక్ కాఫీలో క్యాలరీలు తక్కువ, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. కాబట్టి బరువు అదుపులో ఉంచుకోవాలనుకునేవారు బ్లాక్ కాఫీని ఎంచుకోవడం మంచిది. పాలతో తయారుచేసిన కాఫీలో క్యాల్షియం, ప్రొటీన్ అదనంగా ఉంటాయి. అలాగే కాఫీ అసిడిటీ నుంచి రక్షణ పొందాలంటే పాలు కలిపిన కాఫీనే ఎంచుకోవాలి. ఉదయం 9:30 నుంచి 11:30 మధ్య కాఫీ తాగాలి. కాఫీ తాగడానికి అనువైన సమయమిది. కార్టిసాల్ హార్మోన్ మోతాదులు తగ్గే ఈ సమయంలో కాఫీతో కొంత శక్తిని పుంజుకోవచ్చు. నిద్రలేవి ం సమస్య వేధించకుండా ఉండాలంటే మధ్యాహ్నం 3 గంటల నుంచి కాఫీ జోలికి వెళ్లకూడదు.

మధుమేహం

నడకలో నలతలు



నడిచేటప్పుడు కొన్ని మధుమేహ లక్షణాలు బయల్పడుతూ ఉంటాయి. వాటిని కనిపెట్టి, వెంటనే అప్రమత్తం కాగలిగితే మధుమేహ చికిత్స ఆలస్యమవకుండా ఉంటుంది. ఆ లక్షణాలు ఏవంటే...

- **అరచేతులు, పాదాల్లో తిమ్మిర్లు:** అధిక చక్కెర రక్తప్రసరణను ప్రభావితం చేసి, నాడులను దెబ్బతీస్తుంది. దాంతో అరచేతులు, పాదాల్లో నొప్పి, తిమ్మిర్లు వేధిస్తాయి. దీన్నే న్యూరోపతీ అంటారు. ఈ లక్షణాలతో పాటు సూదులు గుచ్చినట్టు కూడా అనిపించవచ్చు

- **నొప్పులు:** కాళ్లలో నొప్పులు వేధిస్తాయి. ఇది కూడా నాడీ నష్టానికి సూచనే! దీర్ఘకాలికంగా అత్యధిక చక్కెరలను కలిగి ఉన్నప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతుంది. కాళ్లలోని రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు కూడా కాళ్ల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. కాబట్టి నొప్పులకు కారణాన్ని తెలుసుకోవాలి

- **అలసట:** క్రమం తప్పక నడక అలవాటు ఉన్నప్పటికీ, కొత్తగా అలసట మొదలైనా, కొద్ది దూరానికే ఓపిక నశిస్తున్నా వెంటనే అప్రమత్తం కావాలి. చక్కెర పెరిగినా, తగ్గినా అలసట, నిస్సత్తువలు వేధిస్తాయి. నిరంతరం అలసట వేధిస్తున్నా, సరిపడా విశ్రాంతి తీసుకున్నప్పటికీ నిస్సత్తువగా ఉంటున్నా, శరీరం చక్కెరను సమర్థవంతంగా నిర్వహించడం లేదని అర్థం.

- **పాదాల్లో వాపులు:** నడక ముగించుకున్న తర్వాత పాదాలు, కాలి గిలకలూ వాస్తుంటే రక్తంలో చక్కెర మోతాదులు హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్టు అర్థం చేసుకోవాలి. మధుమేహం మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తుంది. ఫలితంగా శరీరంలో నీటి నిల్వ పెరిగి, పాదాలు, కాలి గిలకల్లో వాపులు మొదలవుతాయి.

వేసవి వెతలు

చమట పొక్కులకు చెక్

వేసవిలో పిల్లలను వేధించే ప్రధాన సమస్య... చమట పొక్కులు. ఈ సమస్య నుంచి పిల్లలకు ఉపశమనం కలగడం కోసం కొన్ని చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే...

శరీరంపై చమట ఆరిపోవడం లేదా, చర్మపు ముడతల్లో చమట, మట్టి పేరుకుపోవడం మూలంగా చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఈ కాలంలో ఇబ్బంది పెడతాయి. సాధారణంగా మామిడి పండ్లు తినడం వల్ల వేడిచేసి సెగ గడ్డలు మొదలయ్యాయని అందరూ అనుకుంటూ ఉంటారు. కానీ సెగ గడ్డలకు కారణం చర్మం మీద చమట ఇంకిపోయి, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, ఇన్‌ఫెక్షన్ తలెత్తడమే!



చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, సెగ గడ్డలు పిల్లలను వేధించకుండా ఉండాలంటే రోజుకు రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి. వీటికి తోడు ఈ అదనపు జాగ్రత్తలు కూడా పాటించాలి.

- **చల్లని వాతావరణం:** చల్లనీటి స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గి, ఉపశమనం కలుగుతుంది. అలాగే పిల్లలు గాలి ధారాళంగా చొరబడే వీలున్న చల్లని గదుల్లోనే ఉండాలి
- **దుస్తులు:** తేలికగా, చమటను పీల్చుకునే, గాలి చొరబడే వీలున్న మెత్తని దుస్తులనే పిల్లలకు వేయాలి
- **ఉపశమనం:** పొక్కిన ప్రదేశంలో దురద, మంటలను తొలగించడం కోసం చల్లని తడి వస్త్రాన్ని కప్పి ఉంచవచ్చు. లేదా వస్త్రంలో మంచు ముక్కలను ఉంచి, కాపడం పెట్టుకోవచ్చు
- **ఆయింట్‌మెంట్లు:** జిడ్డుగా ఉండే తైలాలు, ఆయింట్‌మెంట్లు పూయకూడదు
- **గోకకూడదు:** చమట పొక్కులు వచ్చిన ప్రదేశాల్లో దురద సహజం. కాబట్టి పిల్లలు అదే పనిగా గోక్కునే ప్రయత్నం చేస్తారు. దాంతో పుండ్లు పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఉపశమనం దక్కడం కోసం ఆయా ప్రదేశాల్లో సున్నితంగా రుద్దాలి
- **ఓట్‌మీల్:** చర్మం మంట తగ్గడం కోసం స్నానం నీళ్లకు ఓట్‌మీల్ జోడించాలి
- **సోడా ఉప్పు:** చర్మరంధ్రాలు తెరుచుకుని, ఇన్‌ఫ్లమేషన్ తగ్గడం కోసం రెండు స్పూన్ల సోడా ఉప్పును స్నానం చేసే నీళ్లలో కలుపుకోవాలి

నియంత్రణ ఇలా...

- **నీళ్లు:** శరీరంలో నీరు తరిగిపోకుండా చూసుకుంటే చమట పొక్కుల సమస్య తలెత్తకుండా ఉంటుంది. కాబట్టి పిల్లలు సరిపడా నీళ్లు తాగుతున్నారో లేదో గమనించుకుంటూ ఉండాలి
- **అలసట:** ఎండలో ఎక్కువసేపు ఆడుతూ చమటలు పట్టకుండా చూసుకోవాలి
- **పౌడర్:** అదనపు చమటను పీల్చుకునేలా చమట పట్టే వీలున్న ప్రదేశాల్లో టాల్కమ్ పౌడర్ చల్లాలి. అయితే అవసరానికి మించి పౌడర్ చల్లితే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి చమటపొక్కులు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి పౌడర్‌ను పరిమితంగా వాడుకుంటూ, రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి

వైద్యులను ఎప్పుడు కలవాలి?

- మూడు రోజులు దాటినా చమట పొక్కులు తగ్గనప్పుడు
- చమట పొక్కుల తీవ్రత అంతకంతకూ పెరుగుతున్నప్పుడు
- చమట పొక్కులు చీము పట్టినప్పుడు
- చమట పొక్కులకు జ్వరం తోడైనప్పుడు

అధ్యయనం

స్లీప్ ఆప్నియా సమస్యతో బాధపడేవారికి పార్కిన్సన్స్ డిసీజ్ ముప్పు పొంచి ఉంటుందనీ, ఈ సమస్యను నిర్థారించిన రెండేళ్లలోపు సిపాప్ చికిత్స మొదలుపెడితే పార్కిన్సన్స్ జబ్బు నుంచి రక్షణ పొందవచ్చనీ తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ వివరాల్లోకి వెళితే...

నిద్రాభంగంతో పార్కిన్సన్స్



నిద్రలో గొంతులోని కండరాలు రిలాక్స్ అవుతూ, శ్వాస మార్గానికి అడ్డుపడి, శ్వాస పీల్చుకోడానికి వీలుగా తరచూ నిద్ర మెలకువ అవుతూ ఉండే సమస్యే, అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా. ఈ అంతరాయం శరీరంలో ఆక్సిజన్ మోతాదులను తగ్గించి, మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా సిపాప్ థెరపీ అందుబాటులోకొచ్చింది. మాస్క్ ద్వారా గాలి శ్వాసమార్గంలోకి ప్రవహిస్తూ, శ్వాసమార్గాన్ని తెరిచి ఉండే ఈ పరికరం వల్ల నిద్రాభంగం కలగకుండా కంటి నిండా నిద్రపోయే వీలుంటుంది. అయితే స్లీప్ ఆప్నియా సమస్యతో బాధపడేవారు, ఈ సమస్యను సకాలంలో గుర్తించలేక చికిత్సను ఆలస్యం చేస్తూ ఉంటారు. ఫలితంగా దీర్ఘ కాలంలో కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన పార్కిన్సన్స్ రుగ్మత బారిన పడే ప్రమాదం ఉందని తాజా అధ్యయనాల్లో తేలింది. ఇందుకోసం పరిశోధక బృందం, స్లీప్ ఆప్నియాను కలిగిన ఉన్న 15 లక్షల మందికి చెందిన వైద్య నివేదికలను, ఆ సమస్య లేని వ్యక్తుల వైద్య నివేదికలతో సరిపోల్చినప్పుడు, స్లీప్ ఆప్నియాతో బాధపడుతూ సిపాప్ పరికరాన్ని ఉపయోగించని వ్యక్తులు అంతిమంగా పార్కిన్సన్స్ రుగ్మతకు గురవుతున్నట్టు తేలింది.

పరిశోధన

రక్తదానంతో క్యాన్సర్ రక్ష



రక్తదానం ప్రాణదానం అంటారు. రక్తదానం వల్ల ప్రత్యేకించి దాతకు లుకేమియా (రక్త క్యాన్సర్) నుంచి రక్షణ దక్కుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే....

వయసు పైబడేకొద్దీ రక్తాన్ని ఉత్పత్తి చేసే మూల కణాల్లో సహజసిద్ధ ఉత్పరివర్తనాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. వాటిలో కొన్ని ఉత్పరివర్తనాలు లుకేమియా ముప్పును పెంచుతాయి. అయితే క్రమం తప్పకుండా రక్తదానం చేసే వారిలో ఈ ఉత్పరివర్తనాలు క్యాన్సర్‌కు దారి తీయకుండా ఉంటాయని లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ యూనివర్శిటీ పరిశోధకులు కనిపెట్టారు. క్రమం తప్పకుండా రక్తదానం చేసేవారి శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతూ మూల కణాలు మరింత సమర్థంగా మారిపోతూ ఉంటాయనీ, వీరిలో ఆరోగ్యకరమైన, మరింత ప్రభావవంతమైన రక్తకణాలు తయారవుతూ ఉంటాయనీ పరిశోధకులు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యంలో రక్తం చిక్కదనం కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. చిక్కని రక్తం, రక్త ప్రవాహాన్ని కొంతమేరకు కుంటు పరిచి, అధిక రక్తపోటుకూ, అంతిమంగా గుండెజబ్బులకూ దారి తీస్తుంది. కానీ క్రమం తప్పక రక్తదానం చేసేవారిలో రక్తపోటు స్థిరంగా ఉంటూ, గుండెజబ్బులు, గుండెపోట్ల ముప్పు తగ్గుతుందని కూడా పరిశోధకులు వివరిస్తున్నారు.

రేవతి, తన్వీయాదవ్‌లకు బెయిల్ మంజూరు

హైదరాబాద్, సైదాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తిట్లతో వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన కేసులో మహిళా జర్నలిస్టులు పి.రేవతి, తన్వీయాదవ్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రేవతి తరఫున న్యాయవాది జి.కిరణ్ కుమార్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. మహిళలు అయినందున రిమాండ్ రద్దు చేసి బెయిల్ మంజూరు చేయాలని వాదించారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగానే వీరు ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారని, బెయిల్ ఇవ్వద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. ఇరువురి వాదనల అనంతరం న్యాయమూర్తి అనూష బెయిల్‌ను మంజూరు చేశారు. కాగా, కేసులకు, బెదిరింపులకు భయపడబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్‌లను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. అక్రమ కేసులు బనాయించి ఆడబిడ్డలను జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా అని కేటీఆర్ ప్రశ్నించారు.

సీఎం వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదు

» బీజేపీ, బీఆర్ఎస్ నేతల తీరుపై కాంగ్రెస్ ఎంపీల మండిపాటు

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఫేక్ జర్నలిస్టులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేత అమిత్ మాలవీయ వక్రీకరించి అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. సీఎం కొంత హార్ష్‌గా మాట్లాడిన మాట వాస్తవమేనని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు తప్ప తానే కొడతానని ఆయనేం చెప్పలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో అక్రమ కేసులకు ఆస్కారమే లేదని, మీడియాకు సరైన గౌరవం లభిస్తోందని కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ చెప్పారు. సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరిస్తోందన్నారు.

అమెరికాలో టోర్నడోల బీభత్సం

» తెనాలికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల దుర్మరణం

తెనాలి, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): అమెరికాలో టోర్నడో(సుడిగాలి తుఫాను)లు బీభత్సం సృష్టించాయి. తీవ్రమైన టోర్నడోల ధాటికి తెనాలి, అమెరికాకు చెందిన దంపతుల ఇద్దరు కుమారులూ దుర్మరణం చెందారు. దీంతో తెనాలిలోనూ వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన దివంగత గడ్డం థామస్ కుమార్తె షారోన్‌కు, అమెరికాకు చెందిన నథానియేల్ లివిస్కాకు గతంలో తెనాలిలోనే వివాహం జరిగింది. వివాహం అనంతరం వారు అమెరికాలోని మిస్సిస్సిపీ రాష్ట్రంలో స్థిరపడ్డారు. వీరికి ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. కుమారులు సాధు(15), జొషా అష్‌విల్లీ(16) ఆదివారం రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా, తెల్లవారు జామున టోర్నడో ధాటికి పెద్ద చెట్టు విరిగి ఇంటిపై పడడంతో వారు అక్కడిక్కడే మరణించారని బంధువులు తెలిపారు. మరో గదిలో నిద్రిస్తున్న తమ కుమార్తె షారోన్, అల్లుడు, మనుమరాలు మాత్రం క్షేమంగా ఉన్నారని షారోన్ తల్లి మేరీగ్రేస్ థామస్, సోదరుడు జూనియర్ థామస్ విలేకరులకు తెలిపారు.

6 దేవాలయాల అభివృద్ధికి రూ.300 కోట్లు

» రూ.50 కోట్ల చొప్పున 2025-26 బడ్జెట్‌లో కేటాయింపు

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రభుత్వం ఆరు ప్రముఖ ఆలయాల అభివృద్ధి కోసం రూ.300 కోట్లు కేటాయించింది. అసెంబ్లీలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు జరిపినట్టు తెలిసింది. ఈ ఆరు ఆలయాలను మాస్టర్ ప్లాన్‌ల కింద రెండేళ్లలో దశలవారీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మాస్టర్ ప్లాన్ కింద సీతారామచంద్ర స్వామి (భద్రాచలం), రామలింగేశ్వర స్వామి (కీసరగుట్ట), జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం (బాసర), ఆంజనేయ స్వామి (కొండగట్టు), లక్ష్మీనర్సింహా స్వామి (ధర్మపురి), సమ్మక్క-సారలమ్మ (మేడారం) ఆలయాల అభివృద్ధి కోసం రూ.50 కోట్ల చొప్పున కేటాయించినట్టు తెలిసింది.

నలుగురు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందజేత



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వి.హరీశ్, పి.అశోకుడు, జ్వాల కోటేశ్, ఎం. విజయ్

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో నలుగురు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు అవార్డులు సాధించారు. ఎ.జ్వాల కోటేశ్ (హైదరాబాద్), పి.అశోకుడు (హైదరాబాద్), వీరగోని హరీశ్ (వరంగల్), ముచ్చర్ల విజయ్ (నల్గొండ)కు ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డులు దక్కాయి. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ అవార్డులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, పత్రికలలో ఎన్నో వార్తలు ప్రచురితమైన పాఠకుల దృష్టిని ఆకర్షించేది ఫొటోలు మాత్రమేనని అన్నారు. ఒక మంచి ఫొటో ఆలోచనలు రేకెత్తిస్తుందని పేర్కొన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులకు ప్రభుత్వం తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఆలిండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తూడి దేవేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను తీసేస్తేనే పట్టున్నట్టా?

పారదర్శక పాలన అందిస్తేనే పట్టు వచ్చినట్లు.. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నాం

» కులగణన వల్లే బడుగులకు ఎమ్మెల్సీ సీట్లు
» రాష్ట్రం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది
» రాజీవ్ యువవికాసంతో ఉపాధి
» అర్హులకు అందించే బాధ్యత ఎమ్మెల్యేలదే
» పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పాలనపై పట్టు రావడమంటే.. ఇద్దరు మంత్రులను తొలగించడమో, ఇద్దరు అధికారులను జైలుకు పంపడమో కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందరినీ సమన్వయం చేసుకుని మంచి పరిపాలన అందిస్తేనే పట్టు వచ్చినట్లు అని, దానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించినా, నిత్యావసరాల ధరల నియంత్రణలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నా, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నా.. ఇంకా పాలనపై పట్టు వచ్చినట్లు లేదంటూ మీడియా మిత్రులు అంటున్నరు. కానీ, పట్టు రావడమంటే పారదర్శక పాలన అందించడమే. మేం ఆ దిశగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నాం" అని అన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంచే కార్యక్రమాలను ప్రారంభించుకున్నామని తెలిపారు. 10 నెలల్లో 57,924 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసుకున్నామని, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ తొలి ఏడాదిలో ఇన్ని నియామకాలు చేపట్టలేదని అన్నారు. 65 లక్షల మంది స్వయం సహాయక గ్రూపుల మహిళలకు 1.30 కోట్ల నాణ్యమైన చీరలను అందించనున్నామని, పాఠశాలల నిర్వహణ బాధ్యతనూ ఈ సంఘాలకే అప్పగించామని పేర్కొన్నారు. ఆయా స్కూళ్లకు టీచర్లు సరిగా వస్తున్నారా, లేదా అన్నది చూడాల్సిన బాధ్యతను ఆ మహిళలే తీసుకోవాలని సూచించారు.

రాహుల్ హామీ మేరకు కులగణన..

రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం కులగణన సర్వేను పూర్తి చేశామని సీఎం రేవంత్ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో బిల్లును ఆమోదించామన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకూ మంగళవారం చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. కులగణన సర్వేతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో వచ్చిన చైతన్యాన్ని గమనించి.. ఇటీవల జరిగిన ఐదు ఎమ్మెల్సీ సీట్లను ఆ వర్గాలకే రాజకీయ పార్టీలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది తొలి అడుగు మాత్రమేనన్నారు. రాష్ట్రం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉందని, అంచనాలు తప్పి.. ఆదాయం తగ్గి, అప్పులు అడ్డగోలుగా పెరిగి పోయాయని అన్నారు. అయినా ధైర్యం కోల్పోకుండా ప్రజలకు వాస్తవాలు వివరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వంలో దుబారా ఖర్చును తగ్గించేశామన్నారు. "గత ప్రభుత్వంలో వసూలు చేయాల్సిన పన్నులను వదిలేశారు. మేం వచ్చాక 14 నెలలపాటు ఇసుక విషయంలో పాత ప్రభుత్వ విధానాలనే కొనసాగించాం. ఆ విధానంలో రోజుకు రూ.1.20 కోట్ల నుంచి 1.50 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. అయితే నెల రోజుల నుంచి అధికారులపై గట్టిగా ఒత్తిడి తెస్తే ఇసుక ద్వారా ప్రభుత్వానికి రోజుకు వచ్చే ఆదాయం రూ.3 కోట్ల నుంచి రూ.3.50 కోట్లకు పెరిగింది" అని సీఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం జీఎస్టీ వసూళ్లలో, రాష్ట్ర స్వీయ ఆదాయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఆదాయ పన్ను వసూళ్లలోనూ అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో 8.8 శాతంగా ఉన్న నిరుద్యోగ సమస్యను 6.1 శాతానికి తగ్గించామన్నారు.

నియోజకవర్గానికి 5వేల మందికి ఉపాధి!

రాజీవ్ యువ వికాసం ద్వారా అన్ని అర్హతలు ఉన్నవారికి స్వయం ఉపాధి కోసం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థికసాయం అందజేయనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. ఇందుకోసం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించుకున్నామన్నారు. జూన్ 2న ఐదు లక్షల మందితో లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి 4 వేల నుంచి 5 వేల మందికి ఉపాధిని కల్పించవచ్చునన్నారు. అయితే ఆయా లబ్ధిదారులకు అర్హత ఉందా, లేదా అన్నది ఎమ్మెల్యేలే చూసుకోవాలని సూచించారు. తెలిసిన వారని చెప్పి.. ఐదంతస్తుల భవనం ఉన్నోడికీ రూ.5 లక్షలు ఇస్తానంటే కుదరదని, గతంలో అలా చేసినోళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చూడాలని అన్నారు. ఈ పథకం నిజమైన నిరుద్యోగులకు అందాలన్నారు. ఇక నియోజకవర్గానికొకటి చొప్పున వంద అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ ఇవ్వాలనుకుంటున్నామని సీఎం తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగం దొరకకుంటే భవిష్యత్తులో రాజీవ్ యువ వికాసంలో ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీసీఎం భట్టివిక్రమార్కకు సూచించారు. రాష్ట్రంలో చిన్న చిన్న ప్రాంతాల్లోనూ గంజాయి, సింథటిక్ డ్రగ్స్, కొకైన్‌లకు యువత బానిసలవుతున్నారని సీఎం రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించి మత్తు పదార్థాలకు దూరం చేయాలని అన్నారు. భట్టి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం యువత తలరాతను మార్చే పథకమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎస్సీ ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల చైర్మన్లు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణను పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎమ్మెల్యే వంశీకృష్ణకు బైపాస్ సర్జరీ

పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/అచ్చంపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణకు బైపాస్ సర్జరీ జరిగింది. గత శుక్రవారం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు బంజారాహిల్స్‌లోని స్టార్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం డాక్టర్ గోపీచంద్ ఆధ్వర్యంలోని వైద్యుల బృందం ఆయనకు బైపాస్ సర్జరీ నిర్వహించింది. శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉన్న వంశీకృష్ణను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వంశీకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వంశీకృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వివరించారు.

సీఎంను కలిసిన ఆర్ నారాయణమూర్తి

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తిని శాలువాతో సన్మానించిన సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ తల్లి ఫొటోను బహూకరించారు.

27న డీసీసీ అధ్యక్షులతో మల్లికార్జున ఖర్గే సమావేశం

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులతో ఈ నెల 27న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భేటీ కానున్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగే సమావేశానికి టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సైతం హాజరు కానున్నారు. తెలంగాణతో పాటు మరో 15 రాష్ట్రాలకు చెందిన డీసీసీ, సీసీసీల అధ్యక్షులతోనూ ఆ రోజున ఖర్గే భేటీ అవుతారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై ఆ సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

చిత్రజ్యోతి

SINCE 1965



ఆత్మలు అందరికీ ఎందుకు కనిపించవు?

అల్లరి నరేశ్ మరో కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నాని కాసరగడ్డ దర్శకత్వంలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. పొలిమేర, పొలిమేర-2 చిత్రాలతో పేరొందిన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ కథ, స్ర్కీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి '12ఏ రైల్వే కాలనీ' అని టైటిల్ పెట్టి టీజర్ రిలీజ్ చేశారు. అల్లరి నరేశ్ ఒక కిటికీ దగ్గర నిలబడి ఆలోచనలో, ధ్యాన్య ముద్రలో కనిపించడంతో టీజర్ మొదలవుతుంది. వైవా హర్ష వాయిస్ ఓవర్‌లో 'ఆత్మలు అందరికీ ఎందుకు కనపడవు' అని ప్రశ్నిస్తుంది. ఈ చిత్రంలో పొలిమేర సిరీస్ ఫేమ్ డాక్టర్ కామాక్షి భాస్కర్ల కథానాయికగా నటించారు. సినిమాను ఈ వేసవిలో విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది.

సికందర్ నుంచి చాలా నేర్చుకోవచ్చు





రష్మిక

ఇటీవలె విడుదలైన 'ఛావా' సినిమాతో సూపర్ హిట్ కొట్టారు హీరోయిన్ రష్మిక మందన్న. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ టైటిల్‌రోల్‌లో మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సికందర్'లో హీరోయిన్‌గా నటించారు. రంజాన్ సందర్భంగా సినిమా విడుదలవుతోంది. ఇటీవలె ఈ సినిమా నుంచి రెండో సింగిల్ 'బం బం భోలే'ను విడుదల చేశారు మేకర్స్. తాజాగా, ఈ పాట బీటీఎస్ (బిహైండ్ ద సీన్స్) వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు రష్మిక. ఇందులో సల్మాన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సల్మాన్ ఖాన్ ఓ నడిచే లైబ్రరీ లాంటివారని.. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చని తెలిపారు. సెట్‌లో ఆయన ఎనర్జీ లెవెల్స్ అద్భుతంగా ఉంటాయని పేర్కొన్నారు.



అదే పౌరుషం.. అదే రోషం..!



నందమూరి కల్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం లాంచ్ చేశారు. ఐపీఎస్ ఆఫీసర్‌గా విజయశాంతి శక్తిమంతమైన పాత్రను పోషించారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత యాక్షన్ సన్నివేశాలు చేశాను. ఎలా చేస్తానో అని యూనిట్‌లో కొంతమంది టెన్షన్ పడ్డారు. చాలా సహజంగా నటించాను. ఇలా చేయగలుగుతానని వాళ్లు ఊహించలేదు. అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ విజయశాంతినే. అదే పౌరుషం..అదే రోషం.. తగ్గేదేలే. ఎంత వయసొచ్చినా ఇంతే స్ట్రాంగ్‌గా ఉంటా' అని అన్నారు. హీరో నందమూరి కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'ఈ సినిమా మెయిన్ పిల్లర్ అమ్మ(విజయశాంతి). ఈ వయసులో కూడా ఎలాంటి డూప్ లేకుండా అద్భుతమైన స్టంట్స్ చేశారు. మరో 20 ఏళ్ల పాటు ఈ సినిమా గుర్తుండిపోతుంది' అని అన్నారు. దర్శకుడు ప్రదీప్, నిర్మాత సునీల్ బలుసు, రచయిత శ్రీకాంత్ విస్సా తదితరులు మాట్లాడారు.

ఆది కెరీర్‌ను మలుపు తిప్పుతుంది

ఎంపీ రఘునందన్ రావు



ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా షణ్ముగం సాప్పని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌ను షణ్ముగం సాప్పని, తులసీరామ్ సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మించారు. ఈ నెల 21న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్‌లోనే ఏదో ప్రత్యేకత ఉంది. సినిమా ఆది కెరీర్‌ను మలుపు తిప్పుతుంది. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ఈ సినిమా అందరి కష్టం. అవికా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. క్లైమాక్స్ అద్భుతంగా వచ్చింది" అని హీరో ఆది చెప్పారు. "ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. మంచి కథతో తెరకెక్కిన ఈ సినిమా అందరి మనసులను గెలుచుకుంటుంది" అని దర్శకుడు షణ్ముగ సాప్పని తెలిపారు. "ఈ సినిమాలో ఆది నటనకు అందరూ ఫిదా అవుతారు" అని హీరోయిన్ అవికా గోర్ చెప్పారు.

మా స్కూటర్‌కి అన్నీ తెలుసు

డైరెక్టర్ సుప్రీత్ కృష్ణ



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రల్లో సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మాతలు. ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుప్రీత్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ 'క్రికెట్ యాడ్‌లో ఓ వాహనాన్ని చూసినప్పుడు కలిగిన ఆలోచనే ఈ చిత్రం. వాహనానికి లైఫ్ ఉంటే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి వచ్చిన కథ ఇది. పిల్లల దగ్గరికి టుక్ టుక్ ఎలా వచ్చింది? ఆ వాహనం వెనుక కథ ఏమిటి అనేది ఆసక్తికరంగా చెప్పాం. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్ కూడా ఉంటుంది. చిత్తూరు నేపథ్యంలో 90 నుంచి 20వ దశకం మధ్య జరిగే స్టోరీ ఇది. గతం, వర్తమానం, భవిష్యత్ అన్నీ తెలిసిన స్కూటర్ కథ. మనం ఏదైనా ప్రశ్న అడిగితే దానికి తనదైన శైలిలో సమాధానం చెబుతుంది. సినిమాలో కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా బాగా కుదిరాయి' అని తెలిపారు.

వినోదాలు పంచేందుకు సిద్ధం



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహన్ కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 18న సినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ "వేసవిలో వినోదాలు పంచేందుకు మా చిత్రం సిద్ధమైంది. ఇంటిల్లిపాదీ కడుపుబ్బా నవ్వుకుంటారు" అని చెప్పారు. తనికెళ్ల భరణి, నరేశ్ విజయకృష్ణ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: పీజీ.విందా, సంగీతం: వివేక్‌సాగర్.

ఏం బతుకురా నాది..



రాజ్‌తరుణ్, రాశిసింగ్ జంటగా నటించిన చిత్రం 'పాంచ్ మినార్'. ఈ క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్‌ను రాజ్ కుడుమల దర్శకత్వంలో మాధవి, ఎమ్ఎస్ఎమ్.రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల చేశారు. 'ఏం బతుకురా నాది.. బయటపడే దారేది, నా ఫేటే ఎట్టా మారేది' అంటూ సాగే ఈ మిడిల్ క్లాస్ యాంథమ్‌ను అనంత్ శ్రీరామ్ రచించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించగా, దినేష్ రుద్ర ఆలపించారు. బ్రహ్మాజీ, అజయ్ ఘోష్, శ్రీనివాస్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ పూడి, డీఓపీ: ఆదిత్య జవ్వాది.

విభిన్న తరహా ప్రేమకథ



సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. యూవీ కాన్సెప్ట్స్, అజయ్ కుమార్ రాజు నిర్మిస్తున్నారు. విభిన్న తరహా ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలోనే తెలుగు, తమిళ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.

ఖజానాకు కాసుల గలగల



ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.21.26 లక్షల కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 13% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (మార్చి 16 నాటికి) ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 13.13 శాతం వృద్ధితో రూ.21.26 లక్షల కోట్లకు చేరాయి. ముందస్తు పన్ను చెల్లింపులు పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం నాలుగు వాయిదాల్లో ముందస్తు పన్ను వసూళ్లు రూ.10.44 లక్షల కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో వసూలైన రూ.9.11 లక్షల కోట్లతో పోలిస్తే 14.62 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 చివరి విడత ముందస్తు పన్ను చెల్లింపుల గడువు శనివారం నాటితో ముగిసింది. ఈ సారి కార్పొరేట్ కంపెనీల ముందస్తు పన్ను చెల్లింపులు వార్షిక ప్రాతిపదికన 12.54 శాతం వృద్ధితో రూ.7.57 లక్షల కోట్లకు, కార్పొరేటేతర ముందస్తు పన్ను చెల్లింపులు 20.47 శాతం వృద్ధితో రూ.2.87 లక్షల కోట్లకు పెరిగాయి. ఐటీ చట్టంలోని సెక్షన్ 208 ప్రకారం.. సంబంధిత ఆర్థిక సంవత్సరానికి రూ.10,000కు పైగా పన్ను చెల్లించాల్సి ఉన్న వ్యక్తులు (వేతనజీవులు సహా) కూడా ముందుస్తుగానే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 2024 ఏప్రిల్ 1 నుంచి ఆదివారం నాటి (తేదీ 16) వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను సహా మొత్తం కార్పొరేటేతర పన్నుల నికర ఆదాయం 17 శాతం పెరిగి రూ.11.01 లక్షల కోట్లకు చేరింది. కార్పొరేట్ పన్ను నికర రాబడి మాత్రం 7 శాతం వృద్ధితో రూ.9.69 లక్షల కోట్లకు పరిమితమైంది. సెక్యూరిటీ లావాదేవీ పన్నుల నికర ఆదాయం 56 శాతం పెరిగి రూ.53,095 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.4.60 లక్షల కోట్ల రిఫండ్స్ జారీ చేయడం జరిగింది. కాగా, స్థూల పన్ను వసూళ్లు 16.15 శాతం వృద్ధితో రూ.25.86 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల రూపంలో రూ.22.37 లక్షల కోట్లు సమకూరవచ్చని కేంద్రం అంచనా.

4.68 లక్షల మంది వార్షికాదాయం రూ.కోటి పైనే..

అందులో 43,000 మంది ఆదాయం రూ. 10 కోట్ల పైమాటే..

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖ తాజా డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 28 వరకు 9.11 కోట్ల మంది ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించారు. అందులో 8.56 కోట్ల రిటర్నుల ఈ-వెరిఫికేషన్ పూర్తయిందని.. రూ.3.92 లక్షల కోట్ల రిఫండ్లు జారీ చేయడం జరిగిందని ఐటీ శాఖ తెలిపింది. కాగా, 4.68 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నుల్లో రూ.కోటికి పైగా వార్షికాదాయాన్ని వెల్లడించారు. అందులో 43,004 మంది వార్షిక రాబడి రూ.10 కోట్ల పైమాటే.

వార్షికాదాయం	పన్ను చెల్లింపుదారులు
రూ.1-5 కోట్లు	3,89,380
రూ.5-10 కోట్లు	36,274
రూ.10 కోట్లకు పైగా	43,004
మొత్తం	4,68,658

బంగారం మరో రికార్డు

ఒక్కరోజే రూ.1,300 అప్, తులం రూ.90,750



న్యూఢిల్లీ: దేశీయంగా బంగారం, వెండి ధరలు సరికొత్త జీవనకాల రికార్డు గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.1,300 పెరుగుదలతో రూ.90,750కి చేరింది. 99.5 స్వచ్ఛత లోహం రేటు సైతం అదే స్థాయిలో పెరిగి రూ.90,350కి చేరుకుంది. పసిడి ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. కిలో వెండి కూడా రూ.1,300 పెరుగుదలతో రూ.1,02,500 ధర పలికింది. ట్రంప్ సుంకాల వడ్డన కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలతో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వచ్చే సమీక్షలో ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలతో ఇంటర్నేషనల్ మార్కెట్లో వీటి ధరలు పెరగడమే ఇందుకు కారణం. గత శుక్రవారం ట్రేడింగ్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 3,000 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,017 డాలర్లకు ఎగబాకింది. కాగా, మళ్లీ కాస్త తగ్గి 2,995 డాలర్లకు పరిమితమైంది. సిల్వర్ 34.06 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఈ ఏడాదిలో రూ.11,000 అప్ : ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధర రూ.11,360 (14.31 శాతం) పెరిగింది. ఈ జనవరి 1న రూ.79,390 పలికిన తులం బంగారం.. ప్రస్తుతం రూ.90,750కి ఎగబాకింది. వాణిజ్య అనిశ్చితులు మరింత పెరిగితే, మున్ముందు పసిడి మరింత పుంజుకోవచ్చని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. అదే గనక జరిగితే, దేశీయంగా తులం బంగారం రూ.లక్ష దాటడం ఖాయం.

బజాజ్‌కు అలియాన్జ్ గుడ్‌బై

లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో అలియాన్జ్ వాటాను కొనుగోలు చేయనున్న బజాజ్

న్యూఢిల్లీ: దేశీయ ఆర్థిక సేవల రంగానికి చెందిన బజాజ్ గ్రూప్, జర్మనీ బీమా దిగ్గజం అలియాన్జ్ ఎస్ఈ తమ 24 ఏళ్ల భాగస్వామ్యానికి ముగింపు పలికాయి. ఇరువర్గాలు కలిసి బజాజ్ అలియాన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ(బీఏఎల్ఐసీ), బజాజ్ అలియాన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ(బీఏజీఐసీ) పేరిట రెండు బీమా సంస్థలను నిర్వహిస్తున్నాయి. ఈ రెండింటిలో అలియాన్జ్ ఎస్ఈ కలిగి ఉన్న 26 శాతం చొప్పున వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు బజాజ్ గ్రూప్ సోమవారం వెల్లడించింది. బీఏఎల్ఐసీలోని 26 శాతం వాటాను రూ.10,400 కోట్లకు, బీఏజీఐసీలోని 26 శాతం వాటాను రూ.13,780 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదిరిందని తెలిపింది. అంటే, రెండు కంపెనీల్లోని అలియాన్జ్ వాటాలకు బజాజ్ మొత్తం రూ.24,180 కోట్లు చెల్లించనుందన్నమాట. ఈ కొనుగోలు పూర్తయిన అనంతరం రెండు కంపెనీల్లో బజాజ్ 100 శాతం వాటాదారుగా మారనుంది. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) సహా పలు నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి ఈ ఒప్పందం పూర్తి కానుంది.

నాలుగో నెలా ఎగుమతులు డీలా..

- గతనెలలో రూ.3.21 లక్షల కోట్లకు పరిమితం
- 42 నెలల కనిష్ఠ స్థాయికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: భారత ఎగుమతులు వరుసగా నాలుగో నెలలోనూ క్షీణించాయి. గత నెలలో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన గణనీయంగా తగ్గి 3,691 కోట్ల డాలర్లకు (సుమారు రూ.3.21 లక్షల కోట్లు) పడిపోయాయి. పెట్రోలియం ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులతో పాటు ట్రంప్ సుంకా ల ప్రభావంతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరగడం ఇందుకు కారణం. కేంద్ర వాణిజ్య శాఖ సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ముడిచమురు, విలువైన లోహాల ధరల్లో గణనీయ మార్పుల కారణంగా గతనెలలో భారత్‌లోకి దిగుమతులు సైతం 5,096 కోట్ల డాలర్లకు (రూ.4.43 లక్షల కోట్లు) తగ్గాయి. దాంతో వాణిజ్య లోటు కూడా 1,405 కోట్ల డాలర్లకు (రూ.1.22 లక్షల కోట్లు) పరిమితమైంది. ఇది 42 నెలల (2021 ఆగస్టు తర్వాత) కనిష్ఠ స్థాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరితో గడిచిన 11 నెలల్లో భారత వస్తు, సేవల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 6.24 శాతం వృద్ధితో 75,053 కోట్ల డాలర్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వస్తు, సేవల ఎగుమతులు 70,643 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, వస్తు ఎగుమతులు ఈ జనవరిలో 3,643 కోట్ల డాలర్లు, గత డిసెంబరులో 3,801 కోట్ల డాలర్లు, నవంబరులో 3,211 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి.

మారుతి, టాటా వాహన ధరలు పెంపు

న్యూఢిల్లీ: వాహన ధరలు ఏప్రిల్ నుంచి పెంచుతున్నట్లు మారుతి సుజుకీ, టాటా మోటార్స్ ప్రకటించాయి. పెరిగిన ముడిసరకు వ్యయాల భారం కొంతమేరకైనా తగ్గించుకునేందుకు ఈ చర్య తీసుకున్నట్లు రెండు కంపెనీలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. తమ కార్ల ధరలు 4 శాతం మేరకు పెంచుతున్నట్లు మారుతి ప్రకటించగా తమ వాణిజ్య వాహనాల ధరలు 2 శాతం పెంచుతున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది.

స్పైస్‌జెట్‌లో రూ. 90 కోట్ల వాటా విక్రయించిన అజయ్ సింగ్

న్యూఢిల్లీ: చౌక విమానయాన సేవల సంస్థ స్పైస్‌జెట్ ప్రమోటర్ అజయ్‌సింగ్ సోమవారంనాడు ఎయిర్‌లైన్స్‌లో 1.62 శాతం వాటాకు సమానమైన దాదాపు 2 కోట్ల షేర్లను రూ.90 కోట్లకు విక్రయించారు. ఓపెన్ మార్కెట్లో బల్క్ డీల్స్ ద్వారా ఈ షేర్ల విక్రయం జరిగింది. గతవారంలోనూ అజయ్ సింగ్ ఎయిర్‌లైన్స్‌లో దాదాపు ఒక శాతం వాటాను రూ.52 కోట్లకు విక్రయించారు. కాగా, ప్రమోటర్ గ్రూప్ కంపెనీ ద్వారా స్పైస్‌జెట్‌కు రూ.294 కోట్ల మూలధన నిధులు సమకూర్చనున్నట్లు సింగ్ వెల్లడించారు.



మార్కెట్లోకి రూ.4.2 కోట్ల బెంజ్ కారు

ఉదయ్‌పూర్: జర్మనీ లగ్జరీ కార్ల కంపెనీ మెర్సిడెస్ బెంజ్ తాజాగా మేబాక్ ఎస్ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్ కారును భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 4.0 లీటర్ వీ8 టర్బో ఇంజన్‌తో కూడిన ఈ కారు ధర రూ.4.2 కోట్లు. గరిష్ఠంగా గంటకు 260 కి.మీ వేగంతో ప్రయాణించగలదు. వచ్చే ఏడాది తొలినాళ్లలో ఈ కార్ల డెలివరీ ప్రారంభం కావచ్చని కంపెనీ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	430
వరంగల్	407	గోదావరి	415
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 60	

బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు

341 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ మార్కెట్ ఐదు రోజుల నష్టాలకు తెరదించింది. ప్రపంచ మార్కెట్లలో ఏర్పడిన ర్యాలీకి తోడు బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌ను లాభాల్లో నిలిపింది. ఇంట్రాడేలో 547.44 పాయింట్లు లాభపడి 74,376.35ని తాకిన సెన్సెక్స్ చివరికి 341.04 పాయింట్ల లాభంతో 74,169.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 111.55 పాయింట్ల లాభంతో 22,508.75 వద్ద క్లోజయింది. మార్కెట్లో కన్సాలిడేషన్ కొనసాగుతున్నదని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ పరిశోధనా విభాగం వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 24 పైసలు పుంజుకుని 86.81 వద్ద ముగిసింది.

ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం డౌన్

ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్‌పై దివాలా చర్యలు ప్రారంభించాలంటూ కంపెనీకి ఆపరేషనల్ క్రెడిటర్ అయిన రోజ్‌మెర్టా డిజిటల్ సర్వీసెస్ కంపెనీ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేర్లు 7 శాతం మేరకు నష్టపోయాయి. ఈ షేరు బీఎస్ఈలో 7.18% నష్టంతో రూ.46.91 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 7.22% నష్టంతో రూ.46.86 వద్ద ముగిసింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రరూ.1601.13 కోట్ల మేరకు తగ్గి రూ.20,691.20 కోట్ల వద్ద స్థిరపడింది.

డెట్ ఫండ్ల నుంచి రూ.6525 కోట్లు ఉపసంహరణ

ఫిబ్రవరిలో డెట్ మ్యూచువల్ ఫండ్ల నుంచి ఇన్వెస్టర్లు రూ.6525 కోట్లు ఉపసంహరించారు. స్వల్పకాలిక నిధుల నుంచి ఉపసంహరణలు ఇందుకు దోహదపడ్డాయి. 16 డెట్ ఎంఎఫ్ విభాగాల్లో పదింటిలో నికర ఉపసంహరణలు నమోదయ్యాయని భారత మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం (ఆంఫి) తెలియచేసింది. ఫిబ్రవరి చివరి నాటికి డెట్ ఎంఎఫ్‌ల నిర్వహణలోని నిధుల పరిమాణం స్వల్పంగా పెరిగి రూ.17.08 లక్షల కోట్లకు చేరింది.

ఫామ్‌గేట్ ధర — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	86	విజయవాడ	90
వరంగల్	86	గుంటూరు	92
కరీంనగర్	86	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	86	చిత్తూరు	94
కర్నూలు	86	నెల్లూరు	99
విశాఖపట్నం	84	అనంతపురం	99
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,560 ▼	82,100 ▼	1,11,900 ▼
విజయవాడ	90,700 ▲	86,000 ▲	1,02,500 ▼
విశాఖపట్నం	88,240 ▼	80,890 ▼	1,00,410 ▼
రాజమండ్రి	89,560 ▼	82,100 ▼	1,02,700 ▼
ప్రొద్దుటూరు	88,850 ▼	82,280 ▼	1,00,400 ▼
ముంబై	88,100 ▲	80,700 ▲	99,770 ▲

స్పోర్ట్స్



చాంపియన్స్ ట్రోఫీతో రూ. 737 కోట్ల నష్టం

పీసీబీ కుదేలు

లాహోర్: అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు చాంపియన్స్ ట్రోఫీ భారీ నష్టాలను మిగిల్చింది. 29 ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ టోర్నీని నిర్వహించే అవకాశం రావడంతో పాక్ బోర్డు లాహోర్, కరాచీ, రావల్పిండి స్టేడియాలను ఆధునీకరించేందుకు రూ.503 కోట్లు (భారత కరెన్సీలో) ఖర్చు చేసింది. ఇది వారు అంచనా వేసిన బడ్జెట్‌కన్నా 50 శాతం ఎక్కువ కావడం గమనార్హం. అలాగే ఈవెంట్ నిర్వహణ కోసం మరో రూ.347 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇంతా చేస్తే ఐసీసీ నుంచి ఆతిథ్య ఫీజు, టిక్కెట్ల అమ్మకాలు, స్పాన్సర్‌షిప్స్ ద్వారా పీసీబీకి వచ్చింది రూ.52 కోట్లు మాత్రమే. పేరుకే ఆతిథ్య దేశం..కానీ పాక్ జట్టు స్వదేశంలో ఆడింది ఒక్క మ్యాచ్ మాత్రమే. న్యూజిలాండ్‌తో ఆడిన ఆ మ్యాచ్‌లో ఓడింది. భారత్‌తో మ్యాచ్‌ని దుబాయ్‌లో ఆడింది. బంగ్లాతో స్వదేశంలో ఆడాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. దీంతో మొత్తంగా పాక్ బోర్డు ఈ టోర్నీ నిర్వహణ ద్వారా రూ.737 కోట్ల నష్టాలను చవిచూసింది. ఈ భారీ మొత్తాన్ని పూడ్చుకునేందుకు ఇప్పుడు పీసీబీ పొదుపు చర్యలకు దిగింది. జాతీయ టీ20 చాంపియన్‌షిప్ ఆడే ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రూ.40 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించినట్టు పాక్ మీడియా పేర్కొంది. అంతేకాదు.. స్టార్ హోటళ్లలో కాకుండా ఎకానమీ హోటళ్లలో సర్దుకుపోవాలని ఆటగాళ్లకు చెపినట్టు సమాచారం. అయితే పీసీబీ చైర్మన్ నక్వీ సూచనల మేరకు మ్యాచ్ ఫీజును రూ.30 వేలుగా ఖరారు చేయవచ్చని బోర్డు అధికారి ఒకరు తెలిపారు.



ఫామ్‌లోకి వస్తారా..?

- మెరుగైన ప్రదర్శనపై సింధు, సేన్ దృష్టి
- క్వాలిఫయర్స్ బరిలో కిడాంబి

నేటి నుంచి స్విస్ ఓపెన్



బాసెల్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన ఏస్ షట్లర్ పీవీ సింధు, క్వార్టర్స్‌లో వెనుదిరిగిన లక్ష్య సేన్ మళ్లీ బలంగా పుంజుకోవాలనుకొంటున్నారు. మంగళవారం నుంచి జరిగే స్విస్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. భారత ప్లేయర్లు ఎక్కువ మంది ఉండడంతో ఆరంభ రౌండ్లలోనే టాప్ షట్లర్లు ఒకరితో ఒకరు పోటీపడాల్సి పరిస్థితి. తొలి రౌండ్‌లో మాళవిక బన్సోడ్‌తో ఏడో సీడ్ సింధు తలపడనుంది. ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత శ్రీ కూడా బరిలో నిలవనున్నారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లోనే హెచ్‌ఎస్ ప్రణయ్‌తో లక్ష్య సేన్ పోటీపడనున్నాడు. కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, శ్రుతి మిశ్రా-ప్రియ, ఆర్తి సారా-వర్షిణి విశ్వనాథ్ బరిలో నిలవనున్నారు. కాగా, 2015 చాంపియన్ కిడాంబి శ్రీకాంత్‌తోపాటు ఆయుష్ శెట్టి, తరుణ్ మానేపల్లి, సతీష్ కుమార్, శంకర్ ముత్తుస్వామి క్వాలిఫయర్స్ ఆడనున్నారు.

ఐపీఎల్ మరో 4 రోజుల్లో



రాజస్థాన్.. కొత్త కొత్తగా



జట్టులో భారీ మార్పులు.. కోచ్‌గా రాహుల్ ద్రవిడ్‌ను తీసుకోవడంతో ఈ సీజన్‌లో మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ సరికొత్త జోష్‌తో కనిపిస్తోంది. 2008 ఆరంభ లీగ్‌లో విజేతగా నిలిచిన రాజస్థాన్.. సుదీర్ఘ విరామం తర్వాత 2022లో ఫైనల్‌కు చేరినా కప్‌ను ముద్దాడలేక పోయింది. అయితే, ఈసారి నిలకడైన ప్రదర్శనతో టైటిల్ నెగ్గాలన్న పట్టుదలతో ఉంది. సంజూ శాంసన్ మరోసారి జట్టును నడిపించనుండగా.. ద్రవిడ్ సూచనలు వారికి అదనపు బలం కానున్నాయి. శాంసన్‌తోపాటు యశస్వీ జైస్వాల్, హెట్‌మయర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ కోర్ టీమ్. జోష్ బట్లర్, అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌ను వదిలేసుకొన్న రాయల్స్.. ఆశ్చర్యకర రీతిలో జోఫ్రా ఆర్చర్, నితీశ్ రాణాను వేలంలో కొనుగోలు చేసింది. ఓవరాల్‌గా చూస్తే జట్టులో సమతుల్యం కనిపిస్తోంది. హసరంగ, మహీష్ తీక్షణ స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకొన్నా.. అతడు ఈ సీజన్‌లో ఆడడం కష్టమే. కానీ, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యువరక్తం ఎక్కించడానికి ఫ్రాంచైజీ ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్టు అర్థమవుతోంది. రాయల్స్ ప్రధాన బలం టాపార్డర్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. అనుభవం, దూకుడైన ఆటతో జైస్వాల్, సంజూ ఓపెనర్లుగా రాణిస్తుండగా.. రాణా వన్‌డౌన్‌లో ఆడే అవకాశం ఉంది. ఇక, మిడిలార్డర్‌లో పరాగ్, హెట్‌మయర్, జురెల్, శుభమ్ దూబే కీలకం కానున్నారు. గత సీజన్‌లో పరుగుల వరద పారించిన పరాగ్.. మరోసారి అదే తరహా జోరు కొనసాగించాలని ఫ్రాంచైజీ కోరుకొంటోంది. రాజస్థాన్ బౌలింగ్ విభాగం కూడా బలంగా కనిపిస్తోంది. ఆర్చర్, సందీప్ శర్మ, ఫజల్ ఫరూకీ ఏదశలోనైనా వికెట్లు పడగొట్టగల సమర్థులు. అయితే, వీరు డెత్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయలేక పోవడం ఆందోళన కలిగించే అంశం.

రాజస్థాన్ రాయల్స్

బ్యాటర్లు: జైస్వాల్, హెట్‌మయర్, రియాన్ పరాగ్, శుభమ్ దూబే, వైభవ్ సూర్యవంశీ.
వికెట్ కీపర్లు: శాంసన్ (కెప్టెన్), జురెల్, కునాల్ సింగ్ రాథోడ్;
ఆల్‌రౌండర్లు: రాణా, హసరంగ, యుద్ధ్‌వీర్ సింగ్;
బౌలర్లు: సందీప్ శర్మ, ఆర్చర్, ఫజల్, క్వీనా మఫాక, మహీశ్ తీక్షణ, కుమార్ కార్తికేయ, తుషార్ దేశ్ పాండే, ఆకాష్ మధ్వాల్, అశోక్ శర్మ.



బెంగళూరు కల నెరవేరేనా?

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు విరాట్ కోహ్లీ ప్రధాన ఆకర్షణ. బ్యాటింగ్‌లో ఎంతో బలంగా కనిపించే బెంగళూరు గత 17 సీజన్లలో ఒక్కసారి కూడా విజేతగా నిలవలేదు. కప్ మనదే అంటూ దిగడం.. నిరాశగా వెనుదిరగడం షరా మామూలుగా మారింది. అయితే, ఈసారి మాత్రం తలరాతను మార్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గతేడాది వరుస విజయాలతో ప్లేఆఫ్స్‌కు చేరినా.. నాకౌట్‌లో తడబడింది. కాగా, గత సీజన్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన డుప్లెసీని వదిలేయడంతో.. ఈసారి అనూహ్యంగా రజత్ పటీదార్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. బ్యాటింగ్‌లో కోహ్లీతో పాటు పటీదార్, ఫిల్ సాల్ట్, దేవ్‌దత్ పడిక్కల్ కీలకం. జితేష్, టిమ్ డేవిడ్ ఫినిషర్ల పాత్ర పోషించనున్నారు. భువనేశ్వర్, హాజెల్‌వుడ్ పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నారు. అయితే, స్పిన్ విభాగం కొంత బలహీనంగా కనిపిస్తోంది. ఆల్‌రౌండర్లు లివింగ్‌స్టోన్, క్రునాల్ పాండ్యాతోపాటు సుయాష్ శర్మ, మోహిత్ రాఠే స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. బెంచ్ బలం పెద్దగా లేకపోవడం కూడా లోటుగానే పరిగణించాలి. గత సీజన్‌లో ఆశలు లేని స్థితి నుంచి ప్లేఆఫ్స్‌కు చేరిన ఆర్‌సీబీ ఈసారి కూడా మెరుగైన ప్రదర్శన చేయాలనుకొంటోంది.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

బ్యాటర్లు: రజత్ పటీదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్, స్వస్తిక్ చికార;
వికెట్ కీపర్లు: జితేష్ శర్మ, ఫిల్ సాల్ట్; **ఆల్‌రౌండర్లు:** లియామ్ లివింగ్‌స్టోన్, క్రునాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, మనోజ్, జాకబ్ బెథల్; **బౌలర్లు:** భువనేశ్వర్, హాజెల్‌వుడ్, రసిక్ దార్, సుయాష్, నువాన్ తుషార, లుంగీ ఎన్‌గిడి, అభినందన్ సింగ్, మోహిత్ రాఠే, యష్ దయాళ్.

ఐపీఎల్ ముచ్చట్లు

దిశా ఆట.. శ్రేయా పాట!

ఆరంభ కార్యక్రమం



కోల్‌కతా: ఐపీఎల్ ఆరంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీసీసీఐ ప్రయత్నిస్తోంది. ఈడెన్ గార్డెన్స్‌లో ఈనెల 22న సాయంత్రం 6.30 నుంచి 25 నిమిషాలపాటు ఈ కార్యక్రమం జరుగనుంది. కేకేఆర్-ఆర్‌సీబీ మధ్య జరిగే ప్రారంభ మ్యాచ్‌కు ముందు జరిగే ఈ ఈవెంట్‌లో సుప్రసిద్ధ నేపథ్య గాయని శ్రేయా ఘోశాల్, పంజాబీ పాప్ సింగర్ కరణ్ ఔజ్లా తమ గాన మాధుర్యంలో అలరించేందుకు సిద్ధం కానుండగా, నటి దిశా పటాని డ్యాన్స్‌తో ఉర్రూతలూగించనుంది. అయితే అధికారికంగా బోర్డు ఇంకా ఎవరి పేరునూ ప్రకటించలేదు.

20న కెప్టెన్ల సమావేశం

ఐపీఎల్‌కు చెందిన పది ఫ్రాంచైజీల కెప్టెన్ల సమావేశం ఈనెల 20న ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో జరుగనుంది. లీగ్‌కు సంబంధించి ముఖ్య నిబంధనల గురించి ఇందులో చర్చిస్తారు. అనంతరం ట్రోఫీతో కెప్టెన్ల ఫొటోషూట్ ఉంటుంది. పదిమందిలో ఈసారి అక్షర్ (ఢిల్లీ), పటీదార్ (బెంగళూరు) కొత్త కెప్టెన్లు కానున్నారు.

ఢిల్లీ వైస్‌కెప్టెన్‌గా డుప్లెసీ




ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎంపికైన అక్షర్ పటేల్‌కు డిప్యూటీగా ఫా డుప్లెసీ వ్యవహరించనున్నాడు. 40 ఏళ్ల ఈ దక్షిణాఫ్రికా మాజీ సారథి గత మూడు సీజన్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు కెప్టెన్‌గా కొనసాగాడు. అయితే వేలంలో ఆ జట్టు అతడిని వదిలేయడంతో కనీస ధర రూ. 2 కోట్లకు డీసీ తీసుకుంది.

విశాఖ చేరిన ఢిల్లీ ఆటగాళ్లు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో తాము ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌గా చేసుకున్న అక్షర్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. ఈనెల 24న సూపర్ జెయింట్స్‌తో తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. కులదీప్ యాదవ్, కేఎల్ రాహుల్ మంగళవారం నగరానికి చేరుకోనున్నారు.



రికార్డులు తిరగరాసిన ఆండ్రీవా

ఇండియన్ వెల్స్ టైటిల్ కైవసం

ఇండియన్ వెల్స్ (యూఎస్): రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా సంచలనం సృష్టించింది. వరల్డ్ నెం:1 అరియానా సబలెంక (బెలారస్)ను 2-6, 6-4, 6-3తో ఓడించి ఇండియన్ వెల్స్ టైటిల్‌ను సొంతం చేసుకొంది. ఈ క్రమంలో 1999లో సెరెనా విలియమ్స్ తర్వాత ఈ టోర్నీ నెగ్గిన పిన్నవయస్కురాలిగా 17 ఏళ్ల ఆండ్రీవా రికార్డులకెక్కింది. అంతేకాకుండా డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో వరల్డ్ నెం:1, 2 ప్లేయర్లను ఓడించిన రెండో అండర్-18 ప్లేయర్‌గా కూడా మిర్రా నిలిచింది. 1999 యూఎస్ ఓపెన్‌లో డావెన్‌పోర్ట్, మార్టినా హింగిస్‌లను సెరెనా ఓడించింది. 2005లో మరియా షరపోవా తర్వాత డబ్ల్యూటీఏ ట్రోఫీ ఫైనల్లో టాప్ ర్యాంకర్‌ను ఓడించిన చిన్న వయసు ప్లేయర్‌గానే కాకుండా.. 1997లో హింగిస్ తర్వాత వరుసగా రెండో డబ్ల్యూటీఏ 1000 టైటిల్ సాధించిన క్రీడాకారిణిగా కూడా ఆండ్రీవా చరిత్ర సృష్టించింది.

వచ్చే ఒలింపిక్స్‌లో బాక్సింగ్ చోటు పదిలం

లాసాన్నె: మూడేళ్ల తర్వాత జరిగే లాస్‌ఏంజిల్స్ (2028) ఒలింపిక్స్‌లో బాక్సింగ్ క్రీడ యథాతథంగా కొనసాగనుంది. ముందుగా 2022లో ప్రకటించిన లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్ ప్రోగ్రామ్‌లో బాక్సింగ్‌ను చేర్చలేదు. అయితే గత నెలలో వరల్డ్ బాక్సింగ్‌కు తాత్కాలిక గుర్తింపు నివ్వడంతో ఇందుకు మార్గం సుగమమైంది. ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదించిన ఈ తీర్మానంపై ఈనెల 18-21న జరిగే ఐఓసీ సెషన్‌లో అధికారికంగా తుది నిర్ణయం తీసుకుంటారు. గతంలో పాలనాపరమైన లోపాలు, నిధుల దుర్వినియోగం కారణంగా 2019లో అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)పై ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నిషేధం విధించింది.

దేవన్నపేట పంప్‌హౌస్ 19న ప్రారంభం

» ఒక మోటార్‌ను ప్రారంభించనున్న మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా దేవన్నపేటలో కట్టిన పంప్‌హౌస్‌లో ఒక మోటార్‌ను ఈ నెల 19వ తేదీన నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దీంతో అధికారులు ఆ మోటార్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డారు. వాస్తవానికి ఈ పంప్‌హౌస్ ఇప్పటికే సిద్ధమయింది. అయితే ఏదైనా ప్రమాదం జరిగితే రక్షణ చర్యలు తీసుకోవడం కష్టమని, అందువల్ల పైపులను సిమెంట్‌తో కేసింగ్ చేయాలని నిపుణులు సిఫారసు చేశారు. అత్యంత లోతులో పంప్‌హౌస్ ఉండటంతో వాల్వ్‌లో ఏవైనా సమస్యలు వచ్చి... నీరు వెనక్కి తన్నితే పంప్‌హౌస్ మొత్తం దెబ్బతింటుందని, అందులో పనిచేసే ఉద్యోగులు బతికి బట్టకట్టే అవకాశాల్లేవన్న హెచ్చరికలతో గత రెండు నెలలుగా సిమెంట్ కేసింగ్ పనులు జరుగుతున్నాయి. తాజాగా యాసంగిలో దేవాదుల కింద నీటి విడుదల కీలకం కావడంతో ఒక్క మోటార్‌నైనా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు పెంటారెడ్డితో పాటు అధికారులంతా వారం రోజులుగా అక్కడే మకాం వేసి... మోటార్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఒక్కోటి 30 మెగావాట్ల సామర్థ్యం గల మూడు మోటార్లు దేవన్నపేటలో ఉన్నాయి. ఒక్కో మోటార్ 600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనుంది. దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్వహణ చూసే సంస్థకు చెందిన కార్మికులు నెల రోజుల పాటు సమ్మె చేయడంతో ఈ పథకంలోని పలు రిజర్వాయర్లలో నీటి కష్టాలు మొదలయ్యాయి. దేవన్నపేటలో ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన ఒక మోటార్‌ను సిద్ధం చేస్తుండగా... మూడు మోటార్లు సిద్ధమైతే 1,800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నారు. ఈ ప్రాజెక్టు కింద 5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. యాసంగిలో 1.90 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. పంటలు కీలక దశలో ఉండటంతో దేవన్నపేట పంప్‌హౌస్‌ను ఏ విధంగానైనా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది.

వారాబందీ ప్రకారం యాసంగికి నీళ్లు

» నెలాఖరుదాకా కీలకం.. ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వారాబందీ (వారం రోజులు నీళ్లు ఇచ్చి... వారం ఆపడం) విధానంలో సాగునీటిని అందించాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ల(సీఈ)తో యాసంగి నీటి విడుదలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటలు కోత దశలో ఉన్నందున మరో వారం రోజులు నీటి విడుదల కీలకమని, ఏ పంట ఎండకుండా నీటిని అందించాలని నిర్దేశించారు. నెలాఖరుకల్లా యాసంగి డిమాండ్ క్రమంగా తగ్గే అవకాశం ఉందన్నారు. నీటి విడుదల ప్రణాళిక ఆధారంగా ప్రాజెక్టుల కింద సాగునీటిని అందించాలని పేర్కొన్నారు.

వసతిగృహ సంక్షేమ అధికారుల ఫలితాల విడుదల

వసతిగృహ సంక్షేమ అధికారుల నియామక పరీక్ష తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది. మొత్తం 581 పోస్టులకు గాను 574 మందిని ఎంపిక చేసినట్లు టీజీపీఎస్సీ తెలిపింది. వీరిలో 561 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్- 1, గ్రేడ్- 2, లేడీ సూపర్‌వైజర్ పోస్టులకు ఎంపిక కాగా.. 13 మంది వార్డెన్, మాట్రన్ గ్రేడ్- 1, గ్రేడ్- 2 పోస్టులకు ఎంపికయ్యారని తెలిపింది. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించి ఉద్యోగ నోటిఫికేషన్, నిబంధనలకు అనుగుణంగా విచారణ సహా తదుపరి ప్రక్రియలను పూర్తి చేసి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

ఆర్థిక పరిస్థితి దిగజారితే అలవెన్సులు తగ్గించుకోరెందుకు?:బీజేపీ

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని సీఎం రేవంత్ వ్యాఖ్యానించడం శోచనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వి.సుభాష్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతలా దిగజారితే సీఎం, ఆయన క్యాబినెట్‌లోని మంత్రులు అలవెన్సులు ఎందుకు తగ్గించుకోవట్లేదని ఆయన ప్రశ్నించారు. త్యాగాన్ని సీఎం మొదట ఆయన నుంచే ప్రారంభించాలని సుభాష్ పేర్కొన్నారు.

మరో 8 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

రాష్ట్రంలోని మరో 8 జిల్లాలకు బీజేపీ జిల్లా అధ్యక్షులను నియమించారు. రంగారెడ్డి అర్బన్‌కు- వి.శ్రీనివాసరెడ్డిని, రంగారెడ్డి రూరల్- పి. రాజ్‌భూపాల్‌గౌడ్, వికారాబాద్- కొప్పు రాజశేఖర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు- వేముల నరేందర్‌రావు, జోగులాంబ గద్వాల- టి. రామాంజనేయులు, ఖమ్మం- నెల్లూరి కోటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం- బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భాగ్యనగర్ మలక్‌పేటకు- జె. నిరంజన్‌యాదవ్‌ను నియమించారు.

ఇక్కడ టీడీపీ, జనసేనతో కలిస్తే బీజేపీకి నష్టం


» ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

తెలంగాణలో టీడీపీ, జనసేనతో కలిసి పోటీచేస్తే బీజేపీకే నష్టం జరుగుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సొంతంగా బీజేపీ ఎదుగుతున్న తరుణంలో ఇతర పార్టీలతో పొత్తు సరికాదన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని ఆయన చెప్పారు. కొన్ని కీలక అంశాలపై ప్రాంతీయ పార్టీల వైఖరి, జాతీయ పార్టీల దృక్పథం వేరువేరుగా ఉంటాయని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన విమర్శలపై ఆయన స్పందిస్తూ, రాజాసింగ్ బహిరంగంగా అలాంటి వ్యాఖ్యలు చేసి ఉండాల్సింది కాదని రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

జేఎన్‌టీయూ బీటెక్ ఫస్టియర్ ఫలితాలు విడుదల

» అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు 25%లోపే

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ ఫస్టియర్ విద్యార్థుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలు సోమవారం రాత్రి 9 గంటలకు విడుదలయ్యాయి. జనవరిలో నిర్వహించిన మొదటి సెమిస్టర్ (రెగ్యులర్), రెండో సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ పోర్టల్‌లో ఉంచినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు వర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ అరుణకుమారి సమాచారం అందించారు. కాగా, వర్సిటీ పరిధిలో మొత్తం 60కి పైగా అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా, వాటిలో చదువుతున్న సుమారు 40వేలమంది ఫస్టియర్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో అన్ని సబ్జెక్టులూ పాసైన విద్యార్థులు 10వేల (25శాతం) లోపే ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా మ్యాథ్స్(ఎం1)లో, ఆపై ఇంజనీరింగ్ డ్రాయింగ్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది ఫెయిలైనట్లు విద్యార్థి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.



టీఆర్ఎస్ తొలి జెండాను ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

టీఆర్ఎస్ తొలి జెండా పునరావిష్కరణ

» పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్న కేసీఆర్

టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన రెండు నెలల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలకు ఉపయోగించిన తొలి జెండాను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పునరావిష్కరించారు. ఈ జెండా గుర్తుపై నర్సంపేట, నల్లబెల్లి స్థానం నుంచి జడ్పీటీసీగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇప్పటి వరకు దాన్ని తన వద్ద దాచుకున్నారు. రైతు, నాగలి గుర్తుతో రూపొందించిన ఈ జెండాను పెద్ది సుదర్శన్‌రెడ్డి కేసీఆర్‌కు అందజేశారు. 25 ఏళ్ల సిల్వర్‌జూబ్లీ వేడుకల నేపథ్యంలో సోమవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ దాన్ని పునరావిష్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఉద్యమ కాలంనాటి పాతజ్ఞాపకాలను నెమరువేసుకొని, పార్టీ పురోగతి, తెలంగాణ సాధన వంటి విషయాలను పార్టీ నేతలతో పంచుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఫ్యూచర్‌సిటీ అథారిటీలో.. కందుకూరు మండల గ్రామాలన్నీ కలిపేలా కృషి

» ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

మహేశ్వరం, కందుకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగాల ఫలితంగానే ఇక్కడ ప్రపంచ స్థాయి పరిశ్రమలు స్థాపితమవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను చూసి ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని ప్రభుత్వంపై లేనిపోని బురద జల్లాలని చూస్తున్నాయని, ఎవరు ఎంత మొత్తుకున్నా రాష్ట్ర ప్రజలు, రైతులు మాత్రం కాంగ్రెస్ వైపే ఉన్నారన్న విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్‌సిటీ అథారిటీలో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని అన్ని గ్రామాలను కలిపేందుకు కృషి చేస్తానని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మహేశ్వరం ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చిన ఆయనకు కందుకూరు మండలంలోని నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, పెద్దమ్మ తండా, దావుత్‌గూడతండా గ్రామాలకు చెందిన అఖిలపక్ష పార్టీల నాయకులు ఫ్యూచర్‌సిటీ అథారిటీలో తమ తొమ్మిది గ్రామాలను కలపాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో ఈ విషయమై సీఎంతో మాట్లాడతానని మంత్రి హామీ ఇచ్చారు.



మహేశ్వరంలో మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న అఖిలపక్ష పార్టీల నేతలు

పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు

పాలనా సౌలభ్యం కోసమే!

రెండు రాష్ట్రాల్లో ఒకే పేరుతో ఉంటే ఇబ్బందులు.. నిజాంపై పోరాడిన సురవరం పేరు పెట్టాం

» ఈ నిర్ణయం కులం, కుటుంబం కోసం కాదు

» పొట్టి శ్రీరాములుపై అపారమైన గౌరవముంది

» తెలంగాణ ఏర్పడ్డాక పలు సంస్థల పేర్లు మార్చాం

» చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు

» కేంద్ర మంత్రులిద్దరూ అనుమతులు తేవాలి

» తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై .. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వివరణ

» సురవరం పేరును ఓయూకు పెట్టండి: బీజేపీ

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసమే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీగా నామకరణం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఒక వ్యక్తి కోసమో, కులం కోసమో, ఒక కుటుంబం కోసమో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుతో యూనివర్సిటీని కొనసాగించడం వల్ల పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయని, గందరగోళం తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ సమస్యల్లేకుండా చేసేందుకు వర్సిటీ పేరును మార్చాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అయితే ఇది పొట్టి శ్రీరాములుపై తమకు గౌరవం లేకపోవడం కాదని, ఆయనపై అపారమైన గౌరవం ఉన్నాయని స్పష్టం చేశారు. సోమవారం శాసనసభలో ప్రభుత్వం 'పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ(సవరణ) బిల్లు-2025'ను ప్రవేశపెట్టి ఆమోదించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ పేరును ఎందుకు మార్చాల్సివచ్చిందో సీఎం వివరించారు. "తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు స్థానంలో సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాల్సిందిగా సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు గత శాసనసభా సమావేశాల్లో ప్రతిపాదించారు. గత పదేళ్లుగా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, విధివిధానాలను పరిశీలించిన తర్వాతనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం, ప్రాణత్యాగం ద్వారా 1953లో మద్రాసు నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన విషయాన్ని ఎవరూ తక్కువగా చూడడం లేదు. ఆయన ప్రాణత్యాగాన్ని అందరం గుర్తుంచుకుని, స్మరించుకోవాలి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలనాపరమైన కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఆనాడు తెలంగాణ కోసం పోరాడిన గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం, వారి పేర్లను విద్యాసంస్థలకు పెట్టుకోవడం జరుగుతోంది. కానీ, కొంతమంది కొన్ని వర్గాలకు అపోహలు కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహిస్తున్నవారు ఇలా మాట్లాడడం సరి కాదు" అని సీఎం అన్నారు.



పలు సంస్థల పేర్ల మార్పు..

ఏపీ, తెలంగాణకు తమ భౌగోళిక ప్రాంతాన్ని బట్టి విశ్వవిద్యాలయాలు వచ్చాయని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఏపీకి వెళ్లడంతో తెలంగాణలో 2014లో హెల్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుని.. కాళోజీ పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు. దీని అర్థం ఎన్టీఆర్ పట్ల తెలంగాణ ప్రజలకు గౌరవం లేదనో, చిన్నచూపు చూడాలనో కాదన్నారు. దాంతోపాటు ఇక్కడి ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరును, డా.వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ పేరును పెట్టుకున్నామని అన్నారు. తిరుపతిలో ఉన్న వెంకటేశ్వర వెటర్నిటీ యూనివర్సిటీని తెలంగాణలోనూ ఏర్పాటు చేసుకుని, పీవీ నర్సింహారావు పేరు పెట్టుకున్నామన్నారు. ఆ కోవలోనే తెలంగాణలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీగా పేరు పెట్టుకున్నామని వివరించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ సాయుధ పోరాటానికి అందించిన సేవలు, నిజాంకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని మరువలేమన్నారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి.. ఒక వ్యక్తి పట్ల, ఒక కులం పట్ల ప్రత్యేక అభిమానం ఉందంటూ కొంత మంది బయట మాట్లాడుతున్నారని సీఎం తప్పుబట్టారు. తనకు అలాంటి అభిమానమే ఉంటే.. మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును ఎందుకు పెడతానని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోని నెల్లూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ఉంటే.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఐఐహెచ్‌టీని మంజూరు చేయించుకుని, కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టామని అన్నారు. విజ్ఞతతో, విశాల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను బాధ్యత గల వ్యక్తులు కులానికి ఆపాదించి మాట్లాడడం భావ్యం కాదన్నారు. అహ్మదాబాద్‌లో ఒక స్టేడియానికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పేరును మార్చి, ప్రధాని నరేంద్ర మోదీ పేరును పెట్టారని, తాము అలాంటి తప్పులు చేయబోమని చెప్పారు.

చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు..!

పొట్టి శ్రీరాములు, మాజీ ముఖ్యమంత్రి రోశయ్యతోపాటు ఆర్యవైశ్య సమాజం పట్ల తమ ప్రభుత్వానికి అపారమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాల్సిందిగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు లేఖ రాస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వారే అనుమతులు తీసుకురావాలన్నారు. ఇక బల్కంపేట నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరును పెట్టాలని నిర్ణయించామని ప్రకటించారు. అనంతరం బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అహ్మదాబాద్‌లోని స్టేడియానికి ఉన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పేరును మార్చలేదని తెలిపారు. అక్కడి గ్రౌండుకు మాత్రమే ప్రధాని మోదీ పేరు పెట్టారన్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడారంటున్న సురవరం ప్రతాపరెడ్డి పేరును నిజాం నవాబు పేరు ఉన్న ఉస్మానియా యూనివర్సిటీకి పెట్టాలని సూచించారు. కాగా, పొట్టి శ్రీరాములు పేరును మార్చడం తెలుగువారిని అవమానించడమేనని బీజేపీ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. యూనివర్సిటీ పేరు మార్పును బీజేపీ వ్యతిరేకించింది. సీపీఐ ఎమ్మెల్యే సమర్థించారు.

సభలో ఐదు బిల్లులు

శాసనసభలో సోమవారం ఐదు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 'తెలంగాణ షెడ్యూల్డు కులాలు(రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు-2025'ను మంత్రి దామోదర రాజనర్సింహ, 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ(విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025', 'తెలంగాణ బీసీ(స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు) బిల్లు-2025'ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, 'తెలంగాణ చారిటబుల్ అండ్ రెలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్(సవరణ) బిల్లు-2025'ను మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ(సవరణ) బిల్లు-2025'ను ప్రవేశపెట్టి ఆమోదించారు.

మోదీజీ.. అపాయింట్‌మెంట్ ప్లీజ్..!

» ప్రధానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని సోమవారం తీర్మానం చేసిన రాష్ట్ర శాసనసభ.. ప్రధానిని కలవాలని నిర్ణయించింది. బిల్లుకు కేంద్రం మద్దతు కోరేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మోదీకి లేఖ రాశారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ఇటీవల కులగణన చేసిందని, బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం కూడా చేశామని లేఖలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాల్లో ఇప్పుడున్న రిజర్వేషన్లను 29 నుంచి 42 శాతానికి పెంచాలని, అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసినట్లు తెలిపారు. దీనికిగానూ కేంద్రప్రభుత్వ మద్దతుకు అపాయింట్‌మెంట్ కావాలని, కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల ప్రతినిధులతో వచ్చి కలుస్తామని సిఎం లేఖలో కోరారు. దీనిపై ప్రధానమంత్రి ఇచ్చిన సమయాన్ని బట్టి ఢిల్లీ వెళ్లాలని సీఎం నిర్ణయించారు. అయితే ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలోనే అక్కడకు వెళ్లాలని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు తెలిసింది.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మకం

» కామారెడ్డి డిక్లరేషన్ అమలు: మహేశ్

» 'ప్రైవేటు'లోనూ రిజర్వేషన్ : కూనంనేని

» నూతన అధ్యాయం: బీసీ కమిషన్ చైర్మన్



హైదరాబాద్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అభివర్ణించారు. మండలి మీడియా పాయింట్‌లో మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీసీలకు మద్దతుగా కాంగ్రెస్ ఉందని చెప్పడానికి రిజర్వేషన్ల పెంపే నిదర్శనమని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను విజయవంతంగా అమలు చేశామని పేర్కొన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లోనూ బీసీలకు రిజర్వేషన్ కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. అసెంబ్లీలో బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వమే కులగణన సర్వే చేసిందని చెప్పారు. సర్వే వవివరాల ఆధారంగా రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లును శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించడంపై తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలకనుందని పేర్కొన్నారు. అభివర్ణించారు. బీసీ బిల్లు ఆమోదం తెలంగాణ చరిత్రలో సువర్ణ అధ్యాయమని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ పేర్కొన్నారు.

రేవంత్ గోడలు దూకేది

మాకు తెల్వదా?

(మొదటిపేజీ తరువాయి)

రేఖల గురించి బయట పెట్టాలా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీలో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తాము నోరు విప్పితే రేవంత్‌కు ఇంట్లో అన్నం కూడా పెట్టరని పేర్కొన్నారు. 'నామీద 15 కేసులు పెట్టిన రేవంత్‌కు ప్రజాస్వామ్య విలువలు ఈ రోజు గుర్తుకు వచ్చాయా? ఆయనకు ఈ రోజు కుటుంబం గుర్తుకు వచ్చిందా? నాకు అడ్డమైనవారితో లింకులు పెట్టిన నాడు.. మా కుటుంబాలు బాధ పడలేదా? మాకు సంబంధాలు అంటగట్టినప్పుడు, మా పిల్లల్ని రాజకీయాల్లోకి లాగిన రోజు మీకు విలువలు లేవా? ఈ రోజు ముఖ్యమంత్రి తన పిల్లలు, భార్య గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. పదిహేనేళ్లుగా రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్‌లో పత్తాలు ఆడేవారితో గాసిప్స్ నడపటం అలవాటని ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం రూ.70వేల కోట్ల ఆదాయం తగ్గిందని బడ్జెట్ కంటే ముందే సీఎం ఒప్పుకొన్నారని, ఇది ముమ్మాటికీ తెలంగాణ ఫాలింగ్ అని, ఇంతకంటే ఘోరమైన అవమానం ఇంకొకటి ఉండదని పేర్కొన్నారు. జాతిపిత గాంధీని చంపింది గాడ్సే అయితే.. తెలంగాణ జాతిపిత లాంటి కేసీఆర్‌పై చిల్లర మాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి అభినవ గాడ్సే అని విమర్శించారు. రేవంత్ నెగటివ్ పాలిటిక్స్ వల్లే తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఆదాయం పెంచే తెలివి ఈ ప్రభుత్వానికి లేదని, సర్కార్ అట్టర్ ఫ్లాప్ అయిందని విమర్శించారు. కేసీఆర్‌పై ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టును బంద్ పెట్టి, వ్యవసాయ రంగాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు. "ఢిల్లీకి 40 సార్లు కాకపోతే 400 సార్లు పోయి ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కాళ్లు పట్టుకో.. మాకేం సమస్య లేదు కానీ తెలంగాణకి ఎన్ని నిధులు తెచ్చావు? కేంద్రంతో సఖ్యతగా ఉండి ఏం సాధించావు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ నేతల రహస్య సమావేశాలపై రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను సీఎం ఎందుకు ఖండించడం లేదు? రాజాసింగ్‌ను సస్పెండ్ చేసే దమ్ము బీజేపీ నాయకులకు ఉందా? అని నిలదీశారు. తెలంగాణ వాళ్లకు నాయకత్వ లక్షణాలు లేవని, పాలన చేతకాదని నాటి సమైక్యాంధ్ర పాలకుల వ్యాఖ్యలు.. నేడు రేవంత్ హయాంలో నిజమవుతున్నాయన్నారు. భూములు అమ్మకూడదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ధర్నాలపై రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 'నీతో కలిసి వచ్చినప్పుడు యూట్యూబర్లంతా జర్నలిస్టులుగా కనిపించారా? ఇవాళ నిన్ను విమర్శించగానే వాళ్లు జర్నలిస్టులు కాదంటూ మాట్లాడుతావా? జర్నలిస్టుల బట్టలు విప్పిస్తానని మాట్లాడడం సిగ్గుచేటు' అని ధ్వజమెత్తారు.



అందాల పోటీలతో ఏం సాధిస్తావు?

'అందాల పోటీలు పెట్టి రేవంత్ ఏం సాధించాలనుకుంటున్నారు? కరెంటు కోతలు, వ్యవసాయ సంక్షోభంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అందాల పోటీలు నిర్వహిస్తామనడం సిగ్గుచేటు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఫార్ములా-ఈ తో ఏకపక్షంగా ఒప్పందం రద్దు చేసుకుని రూ.46 కోట్లు పోవడానికి రేవంత్ కారణమయ్యాడని, ఈ విషయమై తాము అధికారంలోకి రాగానే విచారణ జరుపుతామన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది పాత్ర

అనివార్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజనపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. సమావేశానికి బీఆర్ఎస్‌ను కూడా ఆహ్వానించినా.. వారు ప్రత్యేక రాజకీయ కారణాలతో హాజరు కాలేమని చెప్పినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పార్లమెంటు సమావేశాల్లో బిజీగా ఉండడం, ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో హాజరు కాలేదని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన నేతలంతా ఇచ్చిన సమాచారం మేరకు భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని అక్బరుద్దీన్ ఒవైసీ సూచించారు. కాగా, దేశంలో ఆందోళనలకు దారి తీయకుండా ఉండేందుకు కొంతకాలం పాటు ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ నిర్ణయం వెలువడే వరకు పునర్విభజన ప్రక్రియను వాయిదా వేయాలని కేశవరావు అన్నారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్లకు అనుగుణంగానే దక్షిణాది రాష్ట్రాల్లోనూ సీట్ల సంఖ్యను పెంచాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, జాన్ వెస్లీ సూచించారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం అభినందనీయమని సీపీఎం మాస్‌లైన్ నేత హనుమేశ్ అన్నారు. రాబోయే రోజుల్లో ఈ అంశంపై విస్తృతంగా చర్చ, కార్యక్రమాలు చేపట్టాలని నేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అఖిలపక్ష కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా ఆచరించడానికి తాము సిద్ధమని తెలిపారు.

కాంగ్రెస్ సర్కారుకు స్పష్టతలేదు: కేటీఆర్

నియోజకవర్గాల పునర్విభజన అంశంలో కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం స్పష్టతలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అఖిల పక్ష సమావేశ నిర్వహణపై కూడా వారికి స్పష్టతలేదని సోమవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ వల్ల తెలంగాణకు దక్షిణాది రాష్ట్రాలకు జరగనున్న నష్టాలపై దేశంలో మొదట మాట్లాడింది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేనందున.. దీనిపై కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామని తెలిపారు. ఈ నెల 22న చెన్నైలో చేపట్టే డీఎంకే సమావేశానికి బీఆర్ఎస్ తరఫున తానే హాజరై పార్టీ విధానాన్ని బలంగా వినిపిస్తానన్నారు.

లగచర్ల, హకీంపేట్ భూసేకరణ కేసు

మళ్లీ ఏకసభ్య ధర్మాసనం వద్దకే

8.15 ఎకరాలపై యథాతథ స్థితి.. డివిజన్ బెంచ్ ఆదేశం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో రెండు ఎకరాలు, లగచర్ల గ్రామంలో 6.15 ఎకరాలకు సంబంధించిన భూసేకరణ విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని సోమవారం హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. పిటిషనర్లకు చెందిన మొత్తం 8.15 ఎకరాల భూసేకరణ అంశంపై ఏకసభ్య ధర్మాసనం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ జడ్జి బెంచ్ వద్దే స్టే వెకేట్ పిటిషన్, కౌంటర్ పిటిషన్ వేసుకోవచ్చని తెలిపింది. ఈ కేసుపై మెరిట్ ఆధారంగా తుది నిర్ణయం తీసుకోవాలని ఏకసభ్య ధర్మాసనానికి సూచించింది. పిటిషనర్ల భూమి విషయంలో యథాతథ స్థితి కొనసాగించాలని.. మిగతా ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చని తెలిపింది. లగచర్ల, హకీంపేట గ్రామాల్లో బహుళార్థసాధక పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కోసం మొత్తం 461 ఎకరాలను సేకరించేందుకు గతేడాది నవంబర్ 29న నోటిఫికేషన్ జారీచేసింది. దీనిని సవాల్ చేస్తూ లగచర్ల గ్రామానికి చెందిన పత్లావత్ గోపాల్ నాయక్ మరో 14 మంది, హకీంపేట గ్రామానికి చెందిన కుమ్మరి శివకుమార్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ జే శ్రీనివాసరావు ఏకసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లకు సంబంధించి హకీంపేటలో రెండు ఎకరాలు, లగచర్లలో 6.15 ఎకరాల మేరకు భూసేకరణ ప్రక్రియపై స్టే విధించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ మధ్యంతర ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ అప్పీళ్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాల్ చేయడానికి సరైన కారణాలు లేవని.. సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఎత్తివేయాలని కోరారు. పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ఇప్పటికే సగానికిపైగా భూసేకరణ పూర్తియిందని.. పరిహారం సైతం చెల్లించామని పేర్కొన్నారు. వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. సింగిల్ జడ్జి వద్దే ఈ విషయాన్ని తేల్చుకోవాలని పేర్కొంది.

వేసవిలో 'తుమ్మిడిహెట్టి' పనులు: ఉత్తమ్



హైదరాబాద్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరమైన అంశాలపై మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి వచ్చే వేసవిలో చేవెళ్ల ప్రాణహిత -తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు ప్రొఫెసర్ కోదండరామ్, తాతామధు, మధుసూదనాచారి, జీవన్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానం చెబుతూ... చేవెళ్ల-ప్రాణహిత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పనులకు సంబంధించి సాంకేతిక పరమైన అంశాలపై చర్చించేందుకు ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మహారాష్ట్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్నాయని మొత్తం 114 కి.మీ.లలో 104 కి.మీ. వరకు ప్రధాన కాలువ పనులు పూర్తి చేసినట్లు వివరించారు.

అందరినీ ఆకర్షించేలా టూరిజం పాలసీ: జూపల్లి



రాబోయే రోజుల్లో రాష్ట్ర ఆదాయం పెంచుకోవడంతో పాటు పర్యాటక రంగంలో యువతకు భారీగా ఉపాధి కల్పించే నిర్ణయాలు తీసుకోనున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడానికి వీలుగా టూరిజం పాలసీని తీసుకురానున్నామని, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా పోచారం అభయారణ్యంలో ఏకో టూరిజం అభివృద్ధి చేయనున్నామని ఆయన తెలిపారు. పసుపు బోర్డు రాకముందు క్వింటాలు పసుపు రూ.16 వేలకు అమ్ముడుపోగా.. బోర్డు పెట్టాక అది రూ.8 వేలకు పడిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని కోరారు. మెదక్ జిల్లా గుమ్మడిదల అటవీ ప్రాంతంలోని ప్యారానగర్ లో 100 ఎకరాల్లో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డును కడుతోందని, దీన్ని నిలిపివేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. 2027లో గోదావరి పుష్కరాలు జరుగనున్నాయని, దీనికోసం పనులు ముమ్మరం చేయాలని ధర్మపురి ఎమ్మెల్యే ఆడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

త్వరలో విదేశీ విద్య బకాయిల చెల్లింపు: సీతక్క



త్వరలోనే విదేశీ విద్య పథకం బకాయిలన్నీ చెల్లిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రకటించారు. 1913 మంది విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసిస్తున్నారని, వీరి కోసం రూ.167 కోట్లు చెల్లించామని, మరో రూ.25 కోట్ల బకాయిలున్నాయని, త్వరలోనే వీటిని కూడా విడుదల చేస్తామని చెప్పారు. 2023 డిసెంబరు దాకా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.4 వేల కోట్ల బకాయిలు ఉండేవని, వాటిని క్రమంగా చెల్లిస్తూ రూ.1100 కోట్లకు చేర్చామన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబు చెప్పారు. రాష్ట్రంలో 83 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని, ఇటీవలే దుబ్బాకలో ఓ హాస్టల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకోగా... గుట్టుగా వైద్యం అందించారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించగా మంత్రి సీతక్క కల్పించుకొని.. విద్యార్థుల అంశాన్ని రాజకీయం చేయొద్దని, మీరు స్కూళ్లు కడితే మేం కూల్చలేదు కదా అని నిలదీశారు. 2014 నుంచి 2023 దాకా 114 మంది విద్యార్థులు చనిపోయారని ఆక్షేపించారు. ఇక గురుకులాల్లో సోలార్ గీజర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. అశ్వాపురం ఎమ్మెల్యే జారే ఆది నారాయణ గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆలయాలుగా అభివర్ణిస్తూ పాటను పాడారు.

బీఆర్ఎస్ హయాంలో అక్బర్ ఎందుకు నోరెత్తలేదు?

ప్రశ్నోత్తరాల్లో ఒక్క ప్రశ్న వాయిదా పడితేనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ.. గత పదేళ్లలో ఎన్నో ప్రశ్నలు వాయిదా పడినా ఎందుకు అడగలేదని మంత్రి సీతక్క ప్రశ్నించారు. అప్పుడు సభను బీఆర్ఎస్ బుల్డోజ్ చేసినా ఎందుకు మాట్లాడలేదన్నారు. అసలు ప్రశ్నోత్తరాలే లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సభను నడిపిందని విమర్శించారు.

ప్రశ్నలకు సమాధానమివ్వకుండా దాటవేస్తారా

» ప్రశ్నోత్తరాల్లో అక్బరుద్దీన్ మండిపాటు.. వాకౌట్



ఇదేనా ప్రజాస్వామ్యం, ఇంత అన్యాయం చేస్తే ఎలా, ఇదేమైనా గాంధీభవన్ అనుకుంటున్నారా.. అంటూ మజ్లిస్ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ శాసనసభలో తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల్లో 'ప్రభుత్వం జారీ చేసిన జీవోలెన్ని, వాటిలో ఎన్ని జీవోలను, బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో)లను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచారు...? వాటి వివరాలేన్నీ' అని ఒక ప్రశ్న వేశారు. అయితే సోమవారం సభ ప్రారంభమైన తర్వాత ఉదయం 10 నుంచి 11 గంటల దాకా ప్రశ్నోత్తరాలు పూర్తిచేయాలని సభ్యులను స్పీకర్ కోరారు. సభ్యులడిగిన నాలుగు ప్రశ్నలకు జవాబులు ఇచ్చేసరికి సమయం 11:29 గంటలు కావడంతో స్పీకర్ మిగిలిపోయిన ప్రశ్నలకు 'డీమ్డ్ టూ ఆన్సర్' (ప్రశ్నలకు జవాబులు ఇచ్చినట్లు పరిగణనలోకి తీసుకోవాలని) ప్రకటిస్తూ జీరో అవర్‌ను ప్రారంభించారు. దాంతో అక్బరుద్దీన్ నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ మాసంలో ఉపవాసముంటూ ప్రశ్నలపై మాట్లాడాలని ఓపికగా సభకు వస్తే, ప్రశ్నోత్తరాల్లో మిగిలిన ప్రశ్నలను ఈ విధంగా దాట వేస్తారా అని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మంత్రివర్గంలోకి ఎమ్మెల్సీలను తీసుకోరనుకుంటున్నా: సురేఖ



మంత్రివర్గంలోకి శాసనమండలి సభ్యులను తీసుకోరనే తాను భావిస్తున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. శాసనమండలిలో సీనియర్లు చాలా మంది ఉంటారని, ఒకరికి ఇస్తే పోటీ పెరుగుతుందని చెప్పారు. అయితే అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాము స్వాగతిస్తామన్నారు. అయినా మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉంటుందని అనుకోవట్లేదని వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పుపై బీజేపీ నేతలు వివాదం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయన పేరును కేంద్ర సంస్థలకు పెట్టుకుంటే తమకే అభ్యంతరం లేదన్నారు.

సభలో ఉన్నందుకు అవమానంగా ఉంది: పైడి

ఈ శాసనసభలో ఎమ్మెల్యేగా ఉన్నందుకు తాను అవమానంగా భావిస్తున్నానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సభలో పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి రూ.1000 కోట్లు కేటాయించి, ఆర్మూర్‌కు రూ.90 లక్షలిస్తే ఎలా అని ఆయన మండిపడ్డారు. నియోజక వర్గానికి వెళితే ఏం చేశావు, ఏం సాధించావని కాంగ్రెస్ వాళ్లు తనను నిలదీస్తున్నారని, నిధులన్నీ కొడంగల్‌కే తరలిస్తే తాము ఏం చేయాలని ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణను అభివృద్ధి చేయాలని, జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం పెట్టాలని కేంద్ర విమానయాన మంత్రిని కోరగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన విజ్ఞప్తులు, ధ్రువపత్రాలు సమర్పిస్తే పరిశీలిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఉత్తర తెలంగాణలో అవమానం తప్ప, అభివృద్ధి లేదని అన్నారు.

బీసీ బిల్లులకు జై!



(మొదటిపేజీ తరువాయి)

ఉంటుంది. అందుకే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 31 (సి) ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతున్నట్టు బిల్లుల్లో పేర్కొంది. న్యాయ సలహా తీసుకుని రాష్ట్రపతి వాటిపై ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అవి చట్టపరంగా నిలబడాలంటే మాత్రం.. బిల్లులను పార్లమెంటు ఉభయ సభలు 2/3 మెజారిటీతో ఆమోదించాలి. అప్పుడు మాత్రమే అవి రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేరి, వాటికి రాజ్యాంగ రక్షణ లభిస్తుంది.

ప్రత్యేక కమిషన్.. అధ్యయనం అందుకే

అసాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావాలంటే.. అందుకు కారణాలు, అవసరమైన గణాంక సమాచారం ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (4) ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో రిజర్వేషన్లు చేయడం ద్వారా నియామకాలు లేదా పోస్టుల్లో 50% విుంచవచ్చని తీర్పు ఇచ్చింది. అలాగే, రిజర్వేషన్లను పెంచాలని భావిస్తున్న ఆయా వర్గాలు తమకు తగిన ప్రాతినిధ్యం లేదనే వివరాలను సమగ్ర గణాంకాలతో వివరించాలని నిర్దేశించింది. అప్పుడే రిజర్వేషన్ల పెంపునకు పార్లమెంటులో ఆమోదం లభిస్తుంది. అందుకే.. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రత్యేకంగా (డెడికేటెడ్ కమిషన్) ఏర్పాటు చేసింది. నిజానికి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో 2024 నవంబరులో డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే, విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బాధ్యతను కూడా ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఆయన నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌కే అప్పగించింది. ఈ కమిషన్ రిజర్వేషన్లను పెంచడానికి కారణాలను అధ్యయనం చేసిందని బిల్లులో పేర్కొంది. అంతకు ముందు రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేను కమిషన్ సేకరించి క్రోడీకరించిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధ్యయనం చేసి రిజర్వేషన్లు పెంచాలని సూచిస్తూ ఈ ఏడాది మార్చిలో నివేదిక ఇచ్చిందని పేర్కొంది. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు సామాజికంగా, ఆర్థికంగా, విద్య పరంగా ఇంకా వెనకబాటుతనంలోనే కొనసాగుతున్నాయని స్పష్టం చేసిందని పేర్కొంది. అయితే, రిజర్వేషన్ల తేనెతుట్టెను కేంద్ర ప్రభుత్వం కదుపుతుందా!? బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ఒప్పుకుంటుందా!? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!!



జాతీయ పార్టీల నేతలను కలుద్దాం!

కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యేల భేటీలో నిర్ణయం

స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు జాతీయ పార్టీల మద్దతు కూడగట్టాలని కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యేల సమావేశంలో నిర్ణయించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ఆధ్వర్యంలో అసెంబ్లీలోని మంత్రి పొన్నం చాంబర్‌లో ఎమ్మెల్యే భేటీ జరిగింది. ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, ప్రకాశ్‌గౌడ్, ఈర్లపల్లి శంకర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్‌లు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ బిల్లులపై జాతీయ పార్టీల ఆమోదం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , మంత్రులతో కలిసి కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

అసెంబ్లీకి చేరిన ఎస్సీ వర్గీకరణ

బిల్లును సభలో ప్రవేశపెట్టిన మంత్రి దామోదర

నేడు చర్చ.. ఆమోదించే అవకాశం

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం శుభం కార్డు వేయనుంది. రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు 'తెలంగాణ షెడ్యూల్డు కులాలు (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు-2025'ను మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై మంగళవారం చర్చించి.. ఆమోదం తెలపనున్నారు. బిల్లును సభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా వర్గీకరణ ఆవశ్యకతను అందులో పేర్కొంది. ఇందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సహా పలు అంశాలను తెలిపింది. వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయాలు తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం నుంచి ఇప్పటి వరకూ తీసుకున్న నిర్ణయాలు, చర్యలను తెలిపింది. వర్గీకరణపై అధ్యయనానికి రిటైర్డ్ జస్టిస్ నేతృత్వంలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేశామని, 59 షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన అక్షరాస్యత, ఉపాధి, ప్రవేశాలు, నియామకాలు, ఆర్థిక సహాయం, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన వివరాలను కమిషన్ సేకరించిందని, క్షేత్ర స్థాయిలోనూ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందని వివరించింది. సదరు కమిషన్ రాష్ట్రంలోని ఎస్సీలను 3 గ్రూపులుగా విభజించిందని, గ్రూప్-1లో 15; గ్రూప్-2లో 18; గ్రూప్-3లో 26 కులాలను చేర్చినట్లు తెలిపింది. మూడు గ్రూపుల్లోని 59 కులాలకు 15 శాతం రిజర్వేషన్‌ను కేటాయించిందని పేర్కొంది. గ్రూపు-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన, పట్టించుకోని కులాలను చేర్చి వీరికి 1 శాతం, గ్రూపు-2లో మధ్యస్థంగా లబ్ధి పొందిన కులాలను చేర్చి 9 శాతం, గ్రూపు-3లో మెరుగైన ప్రయోజనం పొందిన కులాలను చేర్చి వీరికి 5 శాతం రిజర్వేషన్లను సిఫారసు చేసినట్లు తెలిపింది. దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్‌ను కూడా సంప్రదించామని తెలిపింది. రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా అందాలనే దృక్పథంతో వర్గీకరణ చేశామని, ఈ విషయంలో రాజ్యాంగంలోని షెడ్యూల్ 1950లో జోక్యం చేసుకోకుండా వర్గీకరణ చట్టం తీసుకు రావాలని నిర్ణయించామని బిల్లులో పేర్కొంది. దీనిని రాజ్యాంగంలోని 200వ ఆర్టికల్ కింద గవర్నర్ ఆమోదం కోసం పంపనున్నట్టు తెలిపింది.

బీసీ బిల్లుపై ఏడాదిగా కసరత్తు

» అఖిలపక్షంతో వెళ్లి ప్రధానిని కలుస్తాం

» పార్లమెంటులోనూ బిల్లు పెట్టాలి: భట్టి

» తమిళనాడు స్ఫూర్తితో సాధిస్తాం: పొన్నం





హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు తీసుకురావడానికి ఏడాది నుంచి కసరత్తు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో బిల్లుపై చర్చ అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. అధికారంలోకి వస్తే కులగణన చేస్తామన్న రాహుల్‌గాంధీ హామీని నెరవేర్చామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 50 రోజుల్లోనే శాస్త్రీయంగా కులగణన సర్వే చేపట్టామని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు కులగణన చేయాల్సి వస్తే.. రాష్ట్రంలో చేసిన సర్వేను మోడల్‌గా తీసుకునేంత శాస్త్రీయంగా చేయించామన్నారు. అఖిలపక్ష నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్లి మోదీని కలుస్తామని, పార్లమెంట్‌లోనూ బిల్లు పెట్టాలని కోరుతామన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమిళనాడును స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్తామని మంత్రి పొన్నం పేర్కొన్నారు. అప్పట్లో తమిళనాడు సీఎం జయలలిత ఢిల్లీలో కూర్చుని ఇస్తవా.. చస్తవా అనే ధోరణితో వ్యవహరించి రిజర్వేషన్లు సాధించారని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ నిలవబోతుందన్నారు. కలిసికట్టుగా ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్లను సాధించుకుని వద్దామని ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి అన్నారు. ఇది బీజేపీకి పరీక్ష అని, అది వ్యాపారుల వైపా? బీసీల వైపా? అనేది తేలిపోతుందన్నారు.

కేంద్రంపైకి బాంబులు, కత్తులతో వెళ్లాలి

ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్య.. పొన్నం, సీతక్క ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లులకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే ప్రమాదం ఉందని, బిల్లు రూపకల్పనలో ప్రామాణిక ఏంటో తెలపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతుండగా.. బిల్లును వ్యతిరేకించవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. దీనిపై వివేకానంద స్పందిస్తూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ తనకు మామ అయినా కనికరించట్లేదని, అనుమానాలు నివృత్తి చేయడం లేదన్నారు. దీనికి మంత్రి బదులిస్తూ.. చుట్టాన్ని కాబట్టి.. మీ ఇంటికొచ్చి బ్రేక్‌ఫాస్ట్ చేసి మాట్లాడుకుందామని, ఇక్కడ బిల్లుకు అడ్డుపడొద్దని సూచించారు. "ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపాలంటే అందరం సిద్ధమై కలిసికట్టుగా బాంబులు, గన్నులతో వెళ్లాలి. ఎక్సర్‌సైజ్ చేసి వెళ్లాలి" అంటూ వివేకానంద వ్యాఖ్యానించడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బిల్లులను మజాక్‌గా తీసుకుంటారా? అని మండిపడ్డారు. ఇంతలో వివేకానంద మాట్లాడుతూ 12 మందిలో ఇద్దరు మాత్రమే బీసీ మంత్రులు ఉన్నారని, శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. దీనిపై మంత్రి సీతక్క స్పందిస్తూ.. శ్రీహరి గురించి మాట్లాడే అర్హత మీకుందా? అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ మీద కోపంతో ఒక్క ముదిరాజ్‌కు కూడా టికెట్లు ఇవ్వని చరిత్ర బీఆర్ఎస్‌ది అని ధ్వజమెత్తారు. సభలో ఉదయం మద్దతు పలికిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. సాయంత్రానికి అపరిచితుడిలో రెమోలాగా మారిపోయారని ఎద్దేవా చేశారు.

బీసీ బిల్లులపై వాడీవేడి చర్చ

» మూడు సవరణలు చేర్చాలన్న హరీశ్‌రావు

» కేంద్రానికి పంపే బిల్లుల్లో వద్దన్న పొన్నం

» బిల్లులకు బీఆర్ఎస్, బీజేపీ మద్దతు

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులపై అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మధ్య వాడీవేడి చర్చ జరిగింది. బీసీ రిజర్వేషన్ల బిల్లుల్లో మూడు సవరణలు చేయాలని బీఆర్ఎస్ ప్రతిపాదించగా, ఆయా అంశాలను కేంద్రానికి పంపే బిల్లుల్లో పెట్టడం సాధ్యం కాదని ప్రభుత్వం పేర్కొంది. బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లులపై సోమవారం శాసనసభలో జరిగిన చర్చలో తొలుత హరీశ్‌రావు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని, పార్లమెంట్‌లో ఓటింగ్ జరిగితే తమ నలుగురు ఎంపీలు బిల్లులకు అనుకూలంగా ఓటేస్తారని పేర్కొన్నారు. అయితే, ఈ బిల్లుల్లో మూడు అంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఉండాలని, బీసీలకు సబ్ ప్లాన్‌ను ప్రకటించడంతోపాటు రూ.20వేల కోట్లు కేటాయించాలని కోరారు. బిల్లుల విషయంలో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్తామంటే.. కలిసి వచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. హరీశ్ ప్రతిపాదించిన సవరణలపై మంత్రి పొన్నం అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రానికి పంపే బిల్లుల్లో హరీశ్‌రావు ప్రతిపాదించిన అంశాలను ఎలా పెడతాం? అని నిలదీశారు. బీసీ బిల్లులపై మొండికేయవద్దని హితవు పలికారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణనను శాస్త్రీయంగా పూర్తి చేసినప్పుడే..పార్లమెంట్‌లోనూ బీసీ బిల్లులకు ఆమోదం లభిస్తుందని, ఈ విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధి చాటుకోవాలని సూచించారు. బీసీ బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు.

ఏపీలో ఎస్సీ వర్గీకరణకు ఓకే

» ఏకసభ్య కమిషన్ నివేదికకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ కమిషన్ సమర్పించిన నివేదికకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ నివేదికను ఆమోదించారు. దీనిని ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశ పెట్టనున్నారు. అనంతరం, దీనిపై ప్రత్యేక చర్చను చేపట్టి సభ ఆమోదం తీసుకుని.. ఆ వెంటనే కేంద్రానికి పంపించనున్నారు. కాగా.. ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలోని ఎస్సీలను గ్రూప్-1, 2, 3లుగా విభజించింది. గత ఏడాది నవంబరు 15న ఏకసభ్య కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం 2 నెలల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు.

కలిసికట్టుగా వెళ్లి ప్రధానిని కలుద్దాం

42% రిజర్వేషన్ సాధనకు నేను నాయకత్వం వహిస్తా.. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ మాతో కలిసి రావాలి

» ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యత బీజేపీదే

» ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదం పొందేలా చేద్దాం

» రిజర్వేషన్ సాధించే వరకూ విశ్రమించేది లేదు: అసెంబ్లీలో రేవంత్



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు పార్లమెంటు ఆమోదమే లక్ష్యంగా అన్ని పార్టీల నాయకులూ కలిసికట్టుగా వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలుద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు తాను నాయకత్వం వహిస్తానని, ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యతను రాష్ట్ర బీజేపీ నాయకులు తీసుకోవాలని కోరారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చించేందుకు తాను రాహుల్ గాంధీతో మాట్లాడతానని, అందరూ ఏకమైతే ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ ఆమోదం పొందేలా చేయవచ్చని అభిప్రాయపడ్డారు. అన్ని పార్టీలనూ కలుపుకొని వెళతానని, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ, ఎంఐఎం, సీపీఐ నాయకులంతా కలిసి ప్రధానిని కలుద్దామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై సోమవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ తమ లెక్క ఎంతో చెప్పాలని బలహీనవర్గాలు కోరుతున్నాయి. జనాభా లెక్క తెలియకుండా రిజర్వేషన్లు ఇవ్వడం కుదరదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని పాదయాత్ర సమయంలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రిజర్వేషన్లను పెంచి బలహీన వర్గాలకు అండగా నిలవాలని కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ చేసింది. అందుకు తగ్గట్లుగానే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టగానే గత ఏడాది ఫిబ్రవరి నాలుగో తేదీన బీసీ కులగణన ప్రక్రియ ప్రారంభించాం. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, మేధావులు తదితరులందరితో చర్చించి 42% రిజర్వేషన్ అమలుకు నిర్ణయం తీసుకున్నాం. ఈ ఏడాది ఫిబ్రవరి 2న బీసీ కమిషన్ క్యాబినెట్‌కు నివేదిక అందించింది. సరిగ్గా, ఒక్క ఏడాదిలోనే అంటే.. ఈ ఏడాది ఫిబ్రవరి 4న క్యాబినెట్లో దానిని ఆమోదించడమే కాకుండా అదే రోజు శాసనసభలో ప్రవేశపెట్టాం" అని సీఎం రేవంత్ వివరించారు. అందుకే, ఫిబ్రవరి నాలుగో తేదీని సామాజిక న్యాయ దినంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించేందుకు బిల్లులను సభలో ప్రవేశపెట్టామని, జెండాలు, ఎజెండాలకు అతీతంగా పార్టీలన్నీ ఏకాభిప్రాయంతో సహకరించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో పారదర్శకంగా కుల గణన సర్వే చేపట్టామని, ఈ లెక్కలు నూటికి నూరు శాతం కరెక్ట్ అని అన్నారు. 56.36% ఉన్న బలహీన వర్గాలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లులో ప్రతిపాదించామని చెప్పారు. "గత ప్రభుత్వం 2017లో బిల్లు నంబరు 6 ద్వారా బీసీలకు 37 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించి.. శాసనసభలో ఆమోదించి గవర్నర్‌కు పంపింది. దానిని ఆయన రాష్ట్రపతికి పంపారు. ఇప్పటికే రాష్ట్రపతి ఆమోదానికి ప్రతిపాదనలు వెళ్లినందున తాజా ప్రతిపాదనలకు చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వీటిని పరిహరించేందుకు గత ప్రభుత్వ ప్రతిపాదనలను ఉపసంహరిస్తూ.. తాజా ప్రతిపాదనల్ని పంపిస్తున్నాం" అని వివరించారు. వివాదాలకు తావు లేకుండా బలహీనవర్గాలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ విధానమన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం తయారు చేసుకున్న చట్టాల్లో అవసరమైతే రాజ్యాంగ సవరణ చేపట్టి బలహీన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయాల్లో 42% రిజర్వేషన్ పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని, అందరి అభిప్రాయం ఒకటే అయినప్పుడు సాధ్యం కాక ఎందుకు ఆగుతుందని ప్రశ్నించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ సమావేశాల్లోనే బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకుందామని తెలిపారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యతను కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నాయకులు తీసుకోవాలని కోరారు. ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం లేఖ పంపించాలని సీఎస్, అధికారులను ఆదేశించిన సీఎం.. దాని కాపీని బీజేపీ నాయకులకు అందజేయాలని సూచించారు. తక్షణం ప్రధాన మంత్రిని కలిసి రిజర్వేషన్లలో మార్పులకు అవసరమైన సవరణలు చేసేందుకు అడుగు ముందుకు వేయాలన్నారు. రిజర్వేషన్ సాధించే వరకూ విశ్రమించేది లేదని, సాధించేందుకు అవసరమైన నాయకత్వం వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

15వేల కోట్ల పెట్టుబడులు.. 3 లక్షల ఉద్యోగాలు

నూతన పర్యాటక విధానంపై జీవో



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన పర్యాటక విధానంపై ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్ ఎగ్జిట్‌ల వద్ద భారీ మాల్స్‌ను పీపీపీ(పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో అభివృద్ధి చేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అలాగే బీఓటీ (బిల్ట్ అండ్ ఆపరేట్,ట్రాన్స్‌ఫర్) పద్దతిలో అభివృద్ధి చేసే టూరిజం ప్రాజెక్టులకు కేటాయించే స్థలాల రిజిస్ట్రేషన్ చార్జీల్లో 5 శాతం లీజుకు ఖరారు చేశారు. యేటా 5శాతం లీజు మొత్తాన్ని పెంచాలని నిర్ణయించారు. ప్రధానంగా మెగా ప్రాజెక్టులకు 66 ఏళ్ల పాటు, పెద్ద, మధ్య తరహా ప్రాజెక్టులకు 33ఏళ్ల పాటు, చిన్న, సూక్ష్మతరహా ప్రాజెక్టులకు స్థలాలను 15 ఏళ్ల వరకు లీజు పరిమితిని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. ప్రధానంగా ప్రకృతి, వైద్యం, ఆధ్యాత్మిక పర్యాటకానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రత్యేకంగా ఒక బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిని పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. టూరిజం ప్రాజెక్టులను చేపట్టేందుకు ముందుకువచ్చే కంపెనీలకు ప్రభుత్వం వివిధ రకాల రాయితీలను అందించనుంది.

సర్కారు లక్ష్యాలివే

నూతన పర్యాటక విధానంతో రాబోయే ఐదేళ్లలో రూ.15వేల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో సుమారు 3 లక్షల అదనపు ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా పలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం, ఆయా ప్రాంతాల్లోనూ వివిధ రకాల పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నారు.

యూజీసీ నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం వ్యాజ్యం

- డీమ్డ్ యూనివర్సిటీల్లో మా పాత్ర లేకుండా చేశారు
- వాటిని మూసేస్తే ఎవరిది బాధ్యత?.. ప్రశ్నించిన సర్కారు

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జారీ చేసిన నూతన నిబంధనలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నూతన నిబంధనల ప్రకారం అనుమతి పొందిన డీమ్డ్ టు బీ యూనివర్సిటీలు భవిష్యత్తులో మూతపడితే ఆ బాధ్యత ఎవరు వహిస్తారని, విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు జవాబుదారీగా ఉంటారని ప్రశ్నించింది. యూజీసీ ఇన్‌స్టిట్యూషన్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీస్ రెగ్యులేషన్స్ - 2023లోని 2 (15), 6, 7, 8, 29, 30 తదితర నిబంధనలను కొట్టివేయాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం, యూజీసీతో పాటు ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలైన అరోరా హయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అకాడమీ, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, కేఎల్ యూనివర్సిటీ, కేఎల్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్, సింబయాసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ యూనివర్సిటీ, విజ్ఞాన్ ఫౌండేషన్ తదితర యూనివర్సిటీలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. డీమ్డ్ యూనివర్సిటీలు, వాటి ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో చిన్న చిన్న దుకాణాలు, షెడ్లలో కూడా కాలేజీలు నడిపించారని, వాటిపై నియంత్రణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్రం, యూజీసీలకు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

స్మగ్లింగ్‌కు సిబ్బంది సహకారం

- రూ. 8.47 కోట్ల బంగారం సీజ్

ముంబై, మార్చి 17: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం స్మగ్లింగ్ చేస్తున్న ఐదుగురు వ్యక్తులను కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. నాలుగు వేర్వేరు కేసుల్లో అరెస్టయిన ఈ ఐదుగురి నుంచి రూ.8.47 కోట్ల విలువైన 10 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. అరెస్టయిన వారిలో ముగ్గురు విమానాయాన సంస్థల సిబ్బంది కావడం గమనార్హం.! ఓ వ్యక్తి తన జేబుల్లో రూ.2.27 కోట్లు విలువ చేసే 2.8 కిలోల బరువున్న 24 క్యారెట్ల బంగారాన్ని దుబాయ్ నుంచి తీసుకురాగా అరెస్టు చేశామని కస్టమ్స్ అధికారులు తెలిపారు. మరో ఘటనలో ఓ విమానాయాన సంస్థకు చెందిన సిబ్బంది తరలిస్తున్న రూ.2.36కోట్లు విలువ చేసే 2.9 కిలోల బంగారాన్ని సీజ్ చేశామన్నారు. ఇంకో రెండు కేసుల్లో.. రూ.1.31 కోట్ల విలువైన 1.6 కిలోల బంగారాన్ని తరలిస్తున్న ప్రైవేటు విమానయాన సంస్థ సిబ్బంది, విమానంలోని చెత్తను తరలించే బ్యాగుల్లో రూ.2.53 కోట్ల విలువైన 3.1 కిలోల స్వర్ణాన్ని బయటకు పంపుతున్న సిబ్బందిని అరెస్టు చేశారు.

స్మగ్లర్ ఇంట్లో 90 కోట్ల విలువైన పసిడి పట్టివేత

అహ్మదాబాద్, మార్చి 17: క్రికెట్ బెట్టింగ్‌లు, బంగారం స్మగ్లింగ్ చేసే ఓ ఘరానా స్మగ్లర్ ఇంట్లో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ సంయుక్తంగా చేసిన దాడుల్లో రూ.90 కోట్ల విలువైన 95 కిలోల బంగారం లభ్యమైంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉండే మేఘ్ షా, అతని తండ్రి మహేంద్ర షా ఇంట్లో సోమవారం ఈ దాడులను జరిపినట్లు అధికారులు తెలిపారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నట్లు వివరించారు.

ఆత్మకూర్ తహసీల్దార్ జీతభత్యాల నిలుపుదల

- హైకోర్టు ఆదేశాలు.. పరిహారం చెల్లింపులో ఆలస్యం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూర్ తహసీల్దార్‌కు హైకోర్టు షాకిచ్చింది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.6 లక్షల పరిహారాన్ని బాధిత రైతు కుటుంబానికి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నందుకు ఆ తహసీల్దార్ జీతభత్యాలను నిలిపేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆత్మహత్య చేసుకున్న బాధిత రైతు కుటుంబాలకు రూ. 6 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తనకు పరిహారం చెల్లించాలని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన లక్కరుసు లక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ అర్హతలను పరిశీలించి పరిహారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రూ.6లక్షల పరిహారం ఖజానాకు విడుదల చేశారు. ఈ మొత్తాన్ని చెల్లించడంలో తహసీల్దార్ జాప్యం చేసినందున కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. తహసీల్దార్ కావాలనే ఏదో వంక చూపుతూ పేద మహిళలకు ఆటంకాలు కలిగిస్తున్నారని అభిప్రాయపడింది.

భద్రాద్రి రాముడిపై బీజేపీ చిన్నచూపు: వద్దిరాజు

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భద్రాద్రి రాముడిపై చిన్నచూపు చూస్తోందని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తూ, మరోవైపు అదే రాముడు నడయాడిన భద్రాచలంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యసభలో రవిచంద్ర మాట్లాడుతూ, దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం ఆలయానికి రైలు మార్గం అనుసంధానించే భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ దశాబ్దాలుగా కలగానే ఉందన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశానికి ప్రవేశ ద్వారంగా ఉన్న కాజీపేటను రైల్వే డివిజన్‌గా గుర్తించాలని కోరారు. నిజామాబాద్, మంచిర్యాల, భద్రాచలం రోడ్ నుంచి తిరుపతికి నూతన రైలును మంజూరు చేయాలని వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ గుడ్ న్యూస్

- 24 నుంచి సిఫారసు లేఖలకు అనుమతి

తిరుమల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. మార్చి 24వ తేదీ నుంచి వారి సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు జారీ చేయనున్నట్టు టీటీడీ సోమవారం ప్రకటించింది. తమ సిఫారసు లేఖలకు దర్శనాలు కల్పించాలంటూ తెలంగాణ ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్ ద్వారా ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ పంపారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ దర్శనానికి అవకాశం కల్పించమంటూ టీటీడీ అధికారులను ఆదేశించారు. తొలుత ఫిబ్రవరి నుంచే తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను తీసుకుంటామని ప్రకటించినా.. టీటీడీ తమ లేఖలు తీసుకోవడం లేదంటూ పలువురు తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఈనెల 24 నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను తీసుకుంటామని టీటీడీ ప్రకటన చేసింది. ఆది, సోమవారాల్లో మాత్రమే(సోమ, మంగళవారాల దర్శనాలకు సంబంధించి) స్వీకరిస్తామని, అలాగే రూ.300 దర్శన టికెట్లకు సంబంధించిన సిఫారసు లేఖలను బుధ, గురువారాల్లో (ఏరోజుకారోజు కేటాయిస్తారు) తీసుకుంటామని టీటీడీ స్పష్టం చేసింది.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు: సజ్జనార్

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు కావాలనుకునే భక్తులకు నేరుగా వారి ఇంటి వద్దకే చేర్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాట్లు చేసిందని ఎండీ సజ్జనార్ తెలిపారు. కల్యాణ తలంబ్రాలు కావాల్సిన భక్తులు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాలతోపాటు సంస్థ వెబ్‌సైట్‌లో రూ. 151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న జరిగే శ్రీరామ నవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని వినియోగించుకోవచ్చని అన్నారు. ఆర్టీసీ వెబ్‌సైట్ tgsrtclogistics.co.inలో ఆన్‌లైన్ బుకింగ్‌తోపాటు కాల్ సెంటర్ నెంబర్లు 040-69440069, 040- 69440000 ను సంప్రదిస్తే.. సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు భక్తుల వద్ద నేరుగా ఆర్డర్లు స్వీకరిస్తారన్నారని సజ్జనార్ తెలిపారు.

50 కోట్ల భూమిని కాపాడండి.. హైకోర్టులో పిల్

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం మునుగనూరులోని రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సరూర్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ గ్రామంలోని సర్వే నెంబర్ 90(పీ)లో ఉన్న 6.28 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని సంబంధిత అధికార్లకు నోటీసులు జారీ చేసింది.

ఏఐతో క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ

- సీటీ స్కాన్‌ను కృత్రిమ మేధతో విశ్లేషించడం ద్వారా.. ఐదేళ్ల తర్వాత వచ్చే క్యాన్సర్లనూ ముందే పసిగట్టొచ్చు
- కాంటినెంటల్ ఆస్పత్రిలో ఏఐ ప్రోగ్రామ్


'ఏఐ ఫర్ ద ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ మల్టిపుల్ క్యాన్సర్స్' ప్రోగ్రామ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, వైద్యులు

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒక సిటీ స్కాన్ చేసి, దాన్ని కృత్రిమ మేధ(ఏఐ)తో అనుసంధానం చేస్తే ఐదు సంవత్సరాలు ముందుగానే క్యాన్సర్ ముప్పును గుర్తించవచ్చని.. ఆ పరిజ్ఞానాన్ని తమ వద్ద అందుబాటులోకి తెచ్చామని కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఆ ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎంఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), మయోక్లినిక్, నెదర్లాండ్స్‌కు చెందిన పలు సంస్థలతో కలిసి.. దేశంలోనే తొలిసారి 'కాంటినెంటల్ సెంటర్ ఫర్ ఎర్లీ డిటెక్షన్ అండ్ ట్రీట్‌మెంట్ ఫర్ క్యాన్సర్'ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఏఐ సాయంతో.. రొమ్ము, క్లోమ, ఊపిరితిత్తుల క్యాన్సర్ల వంటివాటిని ముందస్తుగా గుర్తించి, వైద్యం అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్ వేలాది మంది ప్రాణాలు కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తుందని.. క్యాన్సర్ మరణాలను నివారించడమే కాక, చికిత్స ఖర్చును తగ్గిస్తుందని చెప్పారు. సీటీ స్కాన్‌ను ఏఐ ద్వారా విశ్లేషించి.. క్యాన్సర్ కణాలు ఏ దశలో ఉన్నాయి, ఏయే అవయవాలపై దాని ప్రభావం ఉండొచ్చు అనే అంశాలపై కచ్చితమైన నివేదికను పొందవచ్చని, సదరు రోగులకు ఎలాంటి చికిత్స చేయాలో కూడా ఏఐ సూచిస్తుందని వివరించారు. ఇప్పటికే 1500 మందికి పైగా క్యాన్సర్ పేషెంట్స్‌కు ఈ ఏఐ ఆధారిత ఇమేజింగ్ పరీక్షలను కూడా నిర్వహించినట్టు వెల్లడించారు. ఇలా క్యాన్సర్‌ను తొలిదశల్లోనే గుర్తిస్తే 90 శాతం జీవితకాలం మెరుగుపడుతుందని.. ఏడాదిపాటు చికిత్స చేయించుకున్నాక ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. కాగా.. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బీ (ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్) డీన్ మదన్, ప్రొఫెసర్ మణీంద్ర కె.యలవర్తి, వైద్యులు రుజు జోషీ, రవీంద్రనాథ్ పాల్గొని ప్రసంగించారు.

టన్నుల్లో స్మగ్లింగ్.. గ్రాముల్లో పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

కస్టమ్స్ అధికారులు కుమ్మక్కవుతున్నారా? అస్మదీయుల స్మగ్లింగ్‌ను చూసీచూడనట్లు వదిలేస్తున్నారా?



30% అక్రమ బంగారమే..!

దేశంలో జరుగుతున్న బంగారం క్రయవిక్రయాల్లో 30% అక్రమ మార్గాల్లో దిగుమతి అయినదేనని ఓ నివేదిక స్పష్టం చేస్తుంది. టన్నుల్లో బంగారం స్మగ్లింగ్ జరుగుతుంటే.. కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు పట్టుకుంటున్నది కేవలం కిలోలు, గ్రాముల్లోనే కావడం గమనార్హం.! అంటే.. బంగారం స్మగ్లింగ్‌లో దొరికితే దొంగ.. లేకుంటే దొర అన్నట్లుగా పరిస్థితులు కొనసాగుతున్నాయి. టన్నుల కొద్దీ దొంగ బంగారం చేరాల్సిన చోటికి సేఫ్‌గా చేరిపోతోంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్(డబ్ల్యూజీసీ) అంచనా మేరకు 2022లో దేశంలో గోల్డ్ స్మగ్లింగ్ విపరీతంగా పెరిగింది. అందుక్కారణం.. దిగుమతి సుంకాన్ని సర్కారు 7.5% నుంచి 12.5శాతానికి పెంచడమే.! ఆ తర్వాత ఈ సుంకాన్ని 15శాతానికి పెంచారు. అయితే.. బంగారం అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఈ సుంకాన్ని 6శాతానికి తగ్గించింది. దీంతో బంగారం ధరలు 10 గ్రాములకు రూ.4 వేల మేర తగ్గాయి. అయినా.. గోల్డ్‌స్మగ్లింగ్ తగ్గకపోగా.. రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఏటా భారత్‌కు 700 టన్నుల మేర బంగారం దిగుమతి అవుతుండగా.. అందులో 400 టన్నులు చట్టబద్ధంగా వస్తోందని, మిగతా 300 టన్నులు స్మగ్లింగేనని కేంద్ర ఆర్థికశాఖ అంచనా వేస్తోంది. దేశంలో ప్రస్తుతం 10 గ్రాముల బంగారం(22 క్యారెట్లు) ధర సుమారు రూ.82వేలుగా ఉంది. అదే 24క్యారెట్ల బంగారం అయితే.. రూ.89,820 + 3% జీఎస్టీ చెల్లించాలి. అంటే.. రూ.92వేల పైచిలుకు ఖర్చవుతుంది. దుబాయ్ వంటి దేశాల్లో 24 క్యారెట్ల మేలిమి బంగారం రూ.82,976కే లభిస్తోంది. తేడా సుమారు రూ.8వేలు. దాన్ని 22క్యారెట్లుగా మారిస్తే.. 10.91 గ్రాములు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా కిలో బంగారాన్ని అక్రమ మార్గాల్లో దిగుమతి చేసుకుంటే.. రూ.20 లక్షల మేర స్మగ్లర్లకు లాభం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దుబాయ్ ఇతర దేశాల నుంచి రవాణా, అధికారులకు లంచాలు పోను.. కిలోకు రూ.19 లక్షల వరకు మిగులుతుందని అంచనా.! స్మగ్లరు ఒకట్రెండు కిలోలు కాకుండా.. ఒకే విడతలో వేర్వేరు ప్రయాణికులకు 10-20 కిలోల మేర బంగారాన్ని అంటగట్టి పంపుతారని తెలుస్తోంది. దీన్ని బట్టి వారి లాభాలు రూ.1.9 కోట్ల నుంచి రూ.3.8 కోట్ల వరకు ఉంటాయి.

కస్టమ్స్ అధికారుల పాత్ర..

నిజానికి సెంట్రల్ ఎక్సైజ్ పరిధిలో.. కస్టమ్స్ విభాగంలో పనిచేసేవారు నిబద్ధతతో ఉంటారనే పేరుంది. అయితే.. కొందరు అధికారులు మాత్రం తప్పుదారి పడుతూ.. స్మగ్లర్లకు సహకరిస్తుంటారని సమాచారం. కస్టమ్స్ విభాగాల్లో పనిచేసేవారు రెండేళ్ల వరకు మాత్రమే విమానాశ్రయాల్లో పనిచేస్తారు. ఈ రెండేళ్లలో అందినకాడికి సంపాదించడమే లక్ష్యంగా కొందరు స్మగ్లర్లతో అంటకాగుతున్నారు. అంటే.. అక్రమ బంగారాన్ని అడ్డంకులు లేకుండా విమానాశ్రయం దాటేలా చేస్తారు. ఇలా కిలో బంగారానికి కస్టమ్స్ అధికారులకు రూ.50వేల దాకా ముడుతున్నట్లు సమాచారం. దాంతో.. సింహభాగం బంగారం యథేచ్ఛగా బయటకు వెళ్తుండగా.. 10% లోపు అక్రమ బంగారాన్ని మాత్రం సీజ్ చేస్తూ.. కేసులు నమోదు చేస్తున్నారు.

ఇంటర్నేషనల్.. డొమెస్టిక్‌గా మారినప్పుడు

అంతర్జాతీయ విమానాల్లో భారత్‌కు వచ్చిన వారికి కస్టమ్స్ తనిఖీలు ఉంటాయి. అయితే.. కొన్ని అంతర్జాతీయ విమానాలు ముంబై, న్యూఢిల్లీ లాంటి విమానాశ్రయాల్లో ల్యాండ్ అయ్యాక.. డొమెస్టిక్‌గా ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. స్మగ్లర్లు పురమాయించిన ప్రయాణికులు ఇలాంటి విమానాల్లో సీట్ల కింద లేదా సీట్ల పక్కన ఉండే సందుల్లో బంగారాన్ని దాచేస్తుంటారు. సరిగ్గా ఆ విమానాలు డొమెస్టిక్‌గా మారినప్పుడు స్మగ్లర్లు తమవారి కోసమే ఆయా సీట్ నంబర్లకు టికెట్లు కొనుగోలు చేస్తుంటారు. ఇలా ఈ ముఠాకు చెందిన మరో ప్రయాణికుడు ఆ బంగారాన్ని తీసుకుని, గమ్యస్థాన విమానాశ్రయంలో దిగిపోతాడు. అది డొమెస్టిక్ విమానం కావడంతో కస్టమ్స్ తనిఖీలు ఉండవు. ఇలాంటి విమానాల్లో పనిచేసే సిబ్బంది, ఆయా విమానాశ్రయాల్లో పనిచేసేవారు స్మగ్లర్లతో అంటకాగుతున్నట్లు నిఘావర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి ఇంటి దొంగలను ఆయా విమానయాన సంస్థలు ఎప్పటికప్పుడు పసిగడుతున్నా.. బంగారం స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట పడడం లేదు. ఇటీవల దుబాయ్ నుంచి వచ్చిన విమానంలో ఓ మహిళ 1,600 గ్రాముల బంగారం ఉన్న బ్యాగును ఫ్లైట్ సిబ్బందికి ఇవ్వగా.. అతను దాన్ని కిటికీలోంచి బయటకు పారేశారు. సీసీ ఫుటేజీ ద్వారా విమానయాన సంస్థ ఈ విషయాన్ని గుర్తించి, ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంది. అడపాదడపా కస్టమ్స్/డీఆర్ఐ అధికారులు స్మగ్లింగ్ అవుతున్న బంగారాన్ని సీజ్ చేసి, సరఫరాదారును అరెస్టు చేసినా.. సూత్రధారులను అరెస్టు చేసేదాకా దర్యాప్తు సాగడం లేదు.

నిత్యం వార్తల్లో శంషాబాద్..!

బంగారం అక్రమ రవాణాకు సంబంధించి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నిత్యం వార్తల్లో ఉంటోంది. ముంబై, బెంగళూరు, న్యూఢిల్లీ విమానాశ్రయాల తరహాలో భారీ ఎత్తున బంగారం పట్టుబడకున్నా.. అడపాదడపా చెప్పుకోదగ్గ స్థాయిలో పసిడి సీజ్ అవుతోంది. నగరానికి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉంటున్నారు. పురుషులతో పోలిస్తే.. వీరికి తనిఖీలు పెద్దగా ఉండవు. దాంతో స్మగ్లర్లు మహిళలను బంగారం అక్రమ రవాణాకు వినియోగించుకుంటున్నారని తెలుస్తోంది. లోదుస్తుల్లో.. పాదరక్షల్లో..చివరకు పౌడర్, పేస్ట్ రూపంలో బంగారాన్ని క్యాప్సుల్స్‌గా మార్చి, మర్మావయవాల్లో, మలద్వారంలో, పొట్టలో దాచుకుని.. తీసుకొస్తున్నారు.

కఠిన శిక్షలతోనే భయం

ఏ విమానాశ్రయంలోనైనా కస్టమ్స్ విభాగానికి చెందిన ఒక్క ఉద్యోగి పరిచయమున్నా.. స్మగ్లర్ల పని సులభమవుతుంది. సాధారణ ప్రజలే కాకుండా వీఐపీలు ఎక్కువగా సరుకు అక్రమ రవాణా చేస్తుంటారు. వీఐపీలకు గ్రీన్‌చానల్ ఉంటుంది. దాంతో.. వారి పని సులువు అవుతుంది. ఎవరైనా అధికారి లేదా సిబ్బంది స్మగ్లర్లకు సహకరిస్తే.. వారికి శిక్షలు కఠినంగా ఉన్నప్పుడే.. అక్రమ రవాణా అంటే వారిలో భయం ఉంటుంది.

- సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత అధికారి సుధాకర్

చట్టాలు ఏం చెబుతున్నాయి?

- పాస్‌పోర్టు చట్టం-1967, కస్టమ్స్ చట్టాల ప్రకారం ప్రయాణికులు నిర్ణీత మొత్తంలో బంగారాన్ని భారత్‌కు తెచ్చుకోవొచ్చు.
- దుబాయ్ వంటి దేశాల్లో ఆర్నెల్లకంటే ఎక్కువగా ఉన్న పురుషులు 20 గ్రాములు, మహిళలు, 15 ఏళ్లలోపు పిల్లలు 40గ్రాముల బంగారాన్ని తీసుకువస్తే.. ఎలాంటి సుంకాలు ఉండవు.
- ఇంతకు మించి అదనపు బంగారం తీసుకురావాలంటే.. సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది. పురుషులకు 20 నుంచి 50 గ్రాముల అదనపు బంగారానికి 3%, 50-100 గ్రాములకు 6%, 100 గ్రాములకు మించిన బంగారానికి 10% కస్టమ్స్ డ్యూటీ చెల్లించాలి. మహిళలు, పిల్లలకు 40-100 గ్రాములకు 3%, 100-200 గ్రాములకు 6%, 200 గ్రాముల కంటే ఎక్కువైతే 10% మేర కస్టమ్స్ సుంకాన్ని చెల్లించాలి.
- దుబాయ్‌లో ఆర్నెల్లలోపు ఉండి.. తిరిగి వచ్చేవారికి ఎలాంటి మినహాయింపులు ఉండవు. వారు 38.5% మేర కస్టమ్స్ సుంకాలను చెల్లించాల్సిందే.


డీకే అరుణ ఇంటిని పరిశీలిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

డీకే అరుణ ఇంట్లోకి ఎందుకొచ్చాడు?

- గంటన్నర పాటు దేనికోసం వెతికాడు??
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- నిందితుడు పాతనగరానికి వెళ్లినట్లు గుర్తింపు
- సీసీ కెమెరాల్లో దృశ్యాల సేకరణ
- డీకే ఇంటిని సందర్శించిన సీపీ సీవీ ఆనంద్
- ఫోన్‌లో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డీకే అరుణ ఇంట్లోకి చొరబడిన ఆగంతుకుడు గంటన్నర పాటు ఏం చేశాడు? దేనికోసం వెతికాడు? వస్తువులేమీ చోరీ చేయకుండా ఎందుకు తిరిగి వెళ్లిపోయాడు? అతని ఉద్దేశమేమిటి? అనే కోణాల్లో జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3.42 సమయంలో.. ఓ ఆగంతుకుడు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లో నివసించే డీకే అరుణ నివాసంలోకి చొరబడ్డ విషయం తెలిసిందే.! వంటింటి కిటికీని తొలగించి, లోనికి ప్రవేశించిన దుండగుడు.. దేనికోసమో వెతికి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మొదటి అంతస్తులో ఉన్న బెడ్‌రూంలో సుమారు అరగంటపాటు వెతికి.. అక్కడి వస్తువులను చిందరవందర చేశాడు. ఇంట్లోకి ప్రవేశించే ముందే.. సీసీకెమెరాల వైర్లను తొలగించాడు. దీన్ని బట్టి.. అతను ఈ ఇంటికి కొత్తవాడు కాకపోవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం హైదరాబాద్ సీసీ కెమెరాలను జల్లెడపట్టగా.. ఆ దుండగుడు పాతనగరం వైపు పారిపోయినట్లు నిర్ధారించారు. సీసీ కెమెరాల ఫుటేజీల్లో ఆగంతుకుడి ముఖం స్పష్టంగా కనిపిస్తున్నట్లు సమాచారం. కాగా.. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం డీకే అరుణ ఇంటిని పరిశీలించారు. సిబ్బందిని అడిగి.. ఆగంతుకుడు ఎలా వచ్చాడు? ఎటువైపు నుంచి పారిపోయాడు? అనే వివరాలను తెలుసుకున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా డీకే అరుణకు ఫోన్ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా తన ఇంటికి అదనపు భద్రత కల్పించాలని డీకే అరుణ కోరగా.. సీఎం అందుకు అంగీకారం తెలిపినట్లు సమాచారం.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం

- 10-15 నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తి
- ఏప్రిల్‌లో కొన్ని చోట్ల పైలట్ ప్రాజెక్ట్
- నిషేధిత జాబితాలోని గజం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలను సమర్థవంతంగా అందించేందుకుగాను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని తీసుకురాబోతున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీసం 45 నిమిషాల నుంచి గంటకుపైగా సమయం పడుతోందని, స్లాట్ బుకింగ్ విధానం ద్వారా 10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికే కార్యాలయానికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సోమవారం సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, సీసీఎల్ఏ కార్యదర్శి మందా మకరంద్, ఐటీ కార్యదర్శి బావేష్, ఆరు జోన్ల డీఐజీలు, ఉమ్మడి జిల్లాల జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షించాల్సిన అవసరంలేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), చాట్ బోట్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్‌వ్యవస్థీకరణ చేయాలని అధికారులకు సూచించారు. ఇక నిషేధిత జాబితాలోని ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను తెచ్చి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచి రెవెన్యూశాఖకు అనుసంధానం చేయాలని సూచించారు. నిషేధిత జాబితాలోని గజం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత జాబితాలోని గజం భూమిని రిజిస్ట్రేషన్ చేసిన క్షణంలోనే తన కార్యాలయంతోపాటు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయంలో ప్రదర్శితమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలి

లక్షలాది కుటుంబాలకు మేలు చేసే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. జిల్లా రిజిస్ట్రార్లు ప్రతి రోజు దీనిపై సమీక్షించాలని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఏమైనా సందేహాలుంటే సబ్ రిజిస్ట్రార్లు ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని నివృత్తి చేసుకొని సమస్యను పరిష్కరించాలే తప్ప దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కార్యాలయాలకే పరిమితంకాకుండా ప్రతివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించాలని ఆదేశించారు.

ఓయూలో ఉద్రిక్తత

- నిరసనలు నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- విద్యార్థి సంఘాల ఆందోళన ఉధృతం
- లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు, అరెస్టులు


విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేసి ఠాణాకు తరలిస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణ నెలకొంది. నినాదాలతో దద్దరిల్లింది. ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, నినాదాలపై నిషేధం విధిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళన ఉధృతం చేశాయి. ఇందులో భాగంగా ఏబీవీపీ సోమవారం ఓయూ బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు ఏబీవీపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం అన్ని విద్యార్థి సంఘాల నాయకులు లైబ్రరీ నుంచి ఓయూ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ర్యాలీని ఇంకా ముందుకు తీసుకెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టులు చేశారు. అరెస్టయిన వారిని అంబర్‌పేట, లాలాగూడ, నల్లకుంట పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని, ప్రశ్నించే గొంతులను ఆపలేరన్నారు. ఓయూలో ఎమర్జెన్సీ పాలన సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీసీ వెంటనే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలు ఏకమై మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

నిరసనలపై నిషేధం అప్రజాస్వామికం

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు తెలపడంపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీచేయడం అప్రజాస్వామికమని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో, విద్యార్థుల హక్కులకు సంబంధించిన ఎన్నో పోరాటాల్లో కీలకపాత్ర పోషించింది ఓయూ విద్యార్థులేనని స్పష్టం చేశారు. ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే గద్దె దించడం తెలంగాణ యువతకు పెద్ద విషయం కాదన్నారు. విద్యార్థుల హక్కులను హరించేలా విడుదల చేసిన సర్క్యులర్ వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల అరెస్టులను ఖండిస్తున్నాం

ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని, తెలంగాణ ఉద్యమానికి గుండెకాయలాంటి ఓయూలో ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. విద్యార్థులను అణచి వేయడం మానేసి, వారి సమస్యలు విని, తక్షణ పరిష్కారం చూపాలని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన సూచించారు.

బీఆర్ఎస్వీ నాయకులకు ఊరట

కేసీఆర్‌పై సీఎం రేవంత్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ దగ్గర ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్వీ నాయకుడు కందుల మధు, తదితరులకు నాంపల్లి కోర్టు ఊరటనిచ్చింది. సీఎం రేవంత్ రెడ్డిని అసభ్యపదజాలంతో దూషించినందున రిమాండ్‌కు ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరగా, రిమాండ్‌ను నిరాకరించాలని నిందితుల తరఫున న్యాయవాది జి.కిరణ్ కుమార్ వాదించారు. ఇరువురి వాదనల అనంతరం కోర్టు రిమాండ్‌ను నిరాకరించడంతో బీఆర్ఎస్వీ నాయకులు విడుదలయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.